సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 315

బుధవారం 5-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGALa




‘రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం’



**బడ్జెట్ నష్టాలు భర్తీ..**

40వేల పాయింట్ల పైకి సెన్సెక్స్. నిఫ్టీ 272 పాయింట్లు అప్. –బిజినెస్‌లో



**పది వికెట్లతో పని పట్టారు**

అండర్‌–19 ప్రపంచకప్ సెమీస్‌లో పాక్‌పై భారత్ ఘనవిజయం – స్పోర్ట్స్‌లో

## నిజామాబాద్‌లో సుగంధ ద్రవ్యాల బోర్డు ప్రాంతీయ కార్యాలయం

- ఎక్స్‌టెన్షన్ సెంటర్ కూడా ఏర్పాటు
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన
- పసుపు బోర్డు చాలా చిన్నదన్న కేంద్ర మంత్రి.. నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ

**సాక్షి, న్యూఢిల్లీ:** నిజామాబాద్‌లో సుగంధ ద్రవ్యాల బోర్డు ప్రాంతీయ కార్యాలయం, ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. మంగళ వారం ఆయన ఈ అంశంపై పార్లమెంట్ భవనంలో మీడియాతో మాట్లాడారు. ‘నిజామా బాద్ ఎంపీ అభ్యర్థన మేరకు ఆ పట్టణంలో స్పైసెస్ బోర్డు డివిజనల్ ఆఫీస్‌ను అప్‌గ్రేడ్ చేసి రీజనల్ ఆఫీస్ కమ్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నాం. నిజామాబాద్‌లో పలు రకాల సుగంధ ద్రవ్యాలు పండుతాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మా కార్యక్రమాలను బలోపేతం చేసేందుకు వీలుగా ఈ సెంటర్ పనిచేస్తుంది. డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి దీనికి నేతృత్వం వహిస్తారు. రెండేళ్లలో ఈ ప్రాంతం నుంచి ఎగుమతులు, ఉత్పత్తులు, నాణ్యత గణనీయంగా పెరుగుతాయని ఆశి స్తున్నాం. పసుపు, మిర్చిపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా ఈ ప్రాంతం స్పైసెస్ హబ్‌గా మారుతుంది. టీఐఈఎస్, ఏఈపీ స్కీమ్‌ల ద్వారా మౌలిక వసతులు మెరుగుపరుస్తాం. తెలంగాణలో సుగంధ ద్రవ్యాల పంటల ప్రగతికి ఈ నిర్ణయం దోహద పడుతుంది. కేంద్ర వ్యవసాయ శాఖ, కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ, వాణిజ్య శాఖల మధ్య ప్రభావవంతమైన సమన్వయం ఏర్పడుతుంది. గతంలో పసుపు బోర్డు గురించి మాట్లాడేవారు. అది చాలా చిన్నది. ఇన్ని అధికారాలు దక్కేవి కాదు. ఇంత సమన్వయం, మంత్రిత్వ శాఖల మద్దతు ఉండేది కాదు. అందుకే ఈ సెంటర్ తెచ్చాం. ఇది రైతుల ఆదాయం రెట్టింపయ్యేందుకు దోహదపడుతుంది. బోర్డుకు ఉండే అన్ని అధికారాలు దీనికి ఉంటాయి. ఈ ప్రాంతంలో టర్మరిక్ క్లస్టర్లు ఉన్నాయి. వాటికి

మిగతా 2వ పేజీలో ▶





జాతర ఇలా..

**బుధవారం:** గద్దెలపైకి చేరనున్న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు

**గురువారం:** సమ్మక్క గద్దెలపైకి రాక

**శుక్రవారం:** గద్దెలపై నుంచి భక్తకోటికి దర్శనమివ్వనున్న వనదేవతలు

**శనివారం:** అమ్మల వనప్రవేశం

మహాజాతర జరిగే మేడారం ప్రాంత విహంగ వీక్షణం. (ఇన్‌సెట్లో) విద్యుత్ వెలుగుల్లో వనదేవతల గద్దెలు

# మూటముల్లె పట్టి.. జాతర పోదమా

## నేటి నుంచి మేడారం మహాజాతర

సాయంత్రం గద్దెలపైకి సారలమ్మ ● గోవిందరాజు, పగిడిద్దరాజు సైతం 2లో

భారీ సంఖ్యలో తరలివస్తున్న భక్తులు ● ఇప్పటికే 50 లక్షలు దాటిన మొక్కులు

జన జాతరలు | తీరొక్క మొక్కులు | నేడు సమ్మక్క కల్యాణం -4లో

## కార్గో బస్సులపై నా ఫొటోలొద్దు

- ఆర్టీసీకి సీఎం కేసీఆర్ స్పష్టీకరణ
- ఆర్టీసీ ఎండీకి లేఖ రాసిన సీఎంఓ

**సాక్షి, హైదరాబాద్:** ‘సరుకు రవాణా చేసే కార్గో బస్సులపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటో పెట్టడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మీడియాలో ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రయత్నాలను సీఎం కేసీఆర్ తప్పుపట్టారు’అని సీఎంవో ఓ ప్రకటనలో తెలిపింది. ఆర్టీసీ బస్సులను సరుకు రవాణాకు ఉపయోగించడం వల్ల ప్రజలకు సేవలు అందించడం, ఆర్టీసీ లాభాల్లో పయనించడం తన లక్ష్యం అని సీఎం అన్నారు. బస్సులపై ఫొటోలు వేయించుకొని ప్రచారం చేసుకోవాల్సిన అవసరం తనకు లేదని, ఈ ప్రతిపాదన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కేసీఆర్ అభిప్రాయ పడ్డారు. దీంతో సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి పి.రాజశేఖర్‌రెడ్డి ఆర్టీసీ ఎండీకి నోట్ పంపారు. కార్గో బస్సులపై సీఎం ఫొటో వేయరాదని స్పష్టంగా సూచించారని సీఎంవో పేర్కొంది.



### కరోనా కేసులు 20,522

- ఇప్పటి వరకు 426 మంది మృతి
- చైనాలో కొనసాగుతున్న వైరస్ విజృంభణ.. చైనా వెళ్లినవారి వీసాలను రద్దు చేసిన భారత్



- 5లో

### కొత్త రూట్లో మెట్రో కూత

- హైదరాబాద్ మెట్రో రైలు మరో కొత్త రూట్లో పరుగులు తీయడానికి సిద్ధమైంది. జేబీఎస్– ఎంజీబీఎస్ రూట్లో ఇది ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. 7వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జేబీఎస్ వద్ద జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జెండా ఊపి ఈ మూడవ మెట్రో రైలు కారిడార్‌ను ప్రారంభిస్తారు.



- 14లో

### హామీల వలలో ఢిల్లీ ఓటరు ఎటు?

- ఉచిత పథకాలు, దేశభక్తి పాఠాలతో ఆప్ ముందుకు
- ఎవరి మేనిఫెస్టోలో ఏముంది?
- మేనిఫెస్టోలు విడుదల చేసిన ఆప్, బీజేపీ, కాంగ్రెస్



- 5లో

# కేటుగాళ్ల టోల్‌మాల్!

టోల్ వసూలును తక్కువగా చూపి కోట్ల మేర స్వాహా

ఏటా రూ.100 కోట్లకు పైగా గుటుక్కు

వెలుగులోకి తెచ్చిన ఫాస్టాగ్

కొత్త విధానం వచ్చాక భారీగా రికార్డవుతున్న వసూళ్లు

ఇంతకాలం ఆ మొత్తం రికార్డుల్లోకి రాకుండా చేశారని అనుమానం



సాక్షి, హైదరాబాద్:

గుట్టుచప్పుడు కాకుండా గుటుక్కు మనిపించారు.. ఎవరూ చూడరు, చూసినా పట్టించుకోరు, పట్టించుకున్నా దొరికే అవకాశమే లేదని దర్జాగా నొక్కేశారు.. రూ.వందలు, వేలు, లక్షలు కాదు.. ఏకంగా కోట్ల రూపాయలను లెక్కల్లోకి రాకుండా గప్‌చుప్‌గా కొట్టేశారు.. ఇంతకాలం వారనుకున్నట్టే జరిగింది. కానీ ఫాస్టాగ్ వచ్చిన తర్వాత వారి పప్పులు ఉడకలేదు. టోల్‌గేట్ల వద్ద కొన్నేళ్లుగా జరుగుతున్న దందాను అది వచ్చిన కొన్ని రోజుల్లోనే పట్టిచ్చేసింది. ఏటా దాదాపు రూ.75 కోట్ల మేర ఇలా లెక్కాపత్రం లేకుండా పోతోందనే విషయం వెలుగు చూసింది. ప్రస్తుతం అన్ని వాహనాలు ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపు విధానంలోకి వెళ్లలేదు. వంద శాతం వాహనాలు ఫాస్టాగ్ పరిధిలోకి వస్తే ఆ మొత్తం రూ.100 కోట్లు దాటేస్తుందని అంచనా.

**తక్కువ చూపించి.. ఎక్కువ కొట్టేస్తున్నారు..**

ప్రస్తుతం రాష్ట్రంలో జాతీయ రహదారులపై 18 చోట్ల టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటిలో ఏడు ప్లాజాలు బీఓటీ పద్ధతిలో నిర్మించిన రహదారులపై ఉండగా.. మిగిలినవి పబ్లిక్ ఫండెడ్/యాన్యుటీ పద్ధతిలో నిర్వహిస్తున్న రోడ్లపై ఉన్నాయి. సాధారణంగా యాన్యుటీ పద్ధతిలో నిర్వహించే రోడ్ల వ్యవహారం రెండు కాంట్రాక్టు సంస్థలతో ముడిపడి ఉంటుంది. రోడ్డు నిర్మించేటప్పుడు మొత్తం వ్యయాన్ని సంస్థ సొంతంగా భరిస్తుంది. ఆ తర్వాత ఆ మొత్తాన్ని సంవత్సరానికి కొంత చొప్పున నిర్ధారిత కాలపరిమితిలో ప్రభుత్వం నుంచి వసూలు చేసుకుంటుంది. అప్పటి వరకు రోడ్డు నిర్వహణ వ్యయాన్ని కూడా ఆ సంస్థే భరిస్తుంది. ఇక ఆ రోడ్డుపై టోల్ వసూలు కోసం ప్రభుత్వం మరో సంస్థతో టెండర్ ద్వారా ఒప్పందం చేసుకుంటుంది. ఆ రోడ్డు మీదుగా ఎన్ని వాహనాలు తిరుగుతాయో ఓ అంచనాతో టోల్ వసూలుకు సంబంధించిన బిడ్‌ను ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఆ మొత్తానికంటే ఎక్కువ కోట్ చేసే సంస్థకు టెండర్ దక్కుతుంది. ఏటా ఈ టెండర్ ప్రక్రియ ఉంటుంది. తొలి ఏడాది వసూలైన టోల్ మొత్తం ఆధారంగా తదుపరి సంవత్సరం బిడ్ మొత్తాన్ని సర్కారు మారుస్తూ ఉంటుంది. ఇక్కడే మతలబు చోటు

మిగతా 2వ పేజీలో ▶

## మిర్చికి కరోనా ఘాటు!

- ప్రాణాంతక వైరస్ నేపథ్యంలో చైనాకు ఎగుమతుల నిలిపివేత
- వ్యాపారులు ధర తగ్గించడంతో ధర పతనం

రూ.20,000 నుంచి రూ.13,000కు పడిపోయిన క్వింటా మిర్చి ధర

3లో











ఇదండీ జగత్



అలా ఎందుకన్నార్సార్! భయపడి మనవాళ్లెవరూ ఆయనకు వ్యతిరేకంగా ప్రచారానికి వెళ్లడం లేదు!




## పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకిస్తూనే ఉంటాం: కేకే



సాక్షి, న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వ్యతిరేకిస్తూనే ఉంటామని టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'మేం ఆర్టికల్ 370 రద్దుకు మద్దతు ఇచ్చాం. కానీ పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాం. వ్యతిరేకిస్తూనే ఉంటాం. మీరు రాజ్యాంగాన్నే మార్చేలా చట్టాలు చేస్తున్నారు. ముస్లింలు కాకుండా ఇతర అన్ని వర్గాల వారికి పౌరసత్వం ఇస్తామని ప్రకటించారు. ఇదెలా సమంజసం? ముస్లింలను మాత్రమే ఎందుకు వేరు చేసి చూస్తున్నారు. ఇలాంటి విభజన సరికాదు. మతం ఆధారంగా పౌరసత్వం ఇచ్చే ఆలోచనను మేం వ్యతిరేకిస్తున్నాం'అని పేర్కొన్నారు.

## పన్నుల్లో కోత ఎందుకు?

### కేంద్రాన్ని ప్రశ్నించిన టీఆర్‌ఎస్ ఎంపీ జి.రంజిత్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తెలంగాణ ఏం తప్పు చేసిందని పన్నుల వాటాలో కోత విధించారని టీఆర్‌ఎస్ ఎంపీ జి.రంజిత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ గురించి ప్రస్తావన లేదు. రైతుల కోసం మా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక భారీ ప్రాజెక్టులు చేపట్టారు. ఎకరాకు రూ. 10 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రైతులకు రూ.5 లక్షల బీమా పథకం అందిస్తున్నారు. ఉచిత నీరు, ఉచిత విద్యుత్తు, పెట్టుబడి సాయం, బీమా అందిస్తున్నారు. రాష్ట్రంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే మాకు రావాల్సిన పన్ను ఆదాయం నుంచి కోతపెట్టారు. దాదాపు రూ.2,400 కోట్ల వరకూ ఆదాయం తగ్గనుంది'అని ఆందోళన వ్యక్తం చేశారు.

## సహకారం అందించండి: నామా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామ స్వరాజ్యం కోసం కృషిచేస్తున్నారని, కేంద్రం దీనికి అండగా నిలవాలని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు కేంద్రాన్ని కోరారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'తెలంగాణలో కేసీఆర్ పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. 70 ఏళ్ల స్వతంత్ర భారతంలో గ్రామాల్లో కనీస వసతులు లేవు. గ్రామాల్లో శ్మశాన వాటికలు కూడా లేకపోవడం బాధాకరం. తెలంగాణలో వైకుంఠధామం పేరుతో శ్మశాన వాటికలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో ఒక నర్సరీ ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా 10.78 కోట్ల మొక్కలు నాటారు. గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న 9,954 బోర్లను మూసేశాం' అని వివరించారు.

## ఎన్‌హెచ్-163లో అభివృద్ధి పనులు చేపట్టండి

### నేషనల్ హైవే సభ్యుడికి ఎంపీ కోమటిరెడ్డి వినతిపత్రం



సాక్షి, హైదరాబాద్: తన భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో దాదాపు వంద కి.మీ. సాగే జాతీయ రహదారి 163 (పాత నెం.202)లోని వివిధ ప్రాంతాల్లో రోడ్డు భద్రత కోసం చేపట్టే ఆయా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాల్సిందిగా మంగళవారం ఢిల్లీలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యుడు (ప్రాజెక్ట్స్) ఆర్‌కే పాండేకు ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించిన వివిధ ప్రతిపాదనలు ఇదివరకే నేషనల్ హైవే అథారిటీ ప్రాంతీయ కార్యాలయం నుంచి ఢిల్లీకి చేరాయని తెలిపారు. తాను సమర్పించిన వినతిపత్రంపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సానుకూలంగా స్పందించారని, వారం రోజుల్లో ఈ ప్రతిపాదనలపై ఆర్థిక అనుమతులు ఇవ్వడానికి అంగీకరించినట్లు చెప్పారు. కాగా, నమామీ గంగే తరహాలో మూసీ నదిని పరిరక్షించాలని, కాలుష్యాన్ని తొలగించి నదిని కాపాడాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి జాతీయ నదీ సంరక్షణ విభాగం డైరెక్టర్ జనరల్ రాజీవ్‌రంజన్ మిశ్రాకు నివేదించారు. జాతీయ జలశక్తి మంత్రిత్వ శాఖ సలహాదారు శ్రీరాం వెదిరెతో కలిసి ఆయన మంగళవారం ఢిల్లీలో మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు.

## రాష్ట్రానికి 111 మెట్రిక్ టన్నుల విదేశీ ఉల్లిపాయలు



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఉల్లిపాయలను వివిధ రాష్ట్రాలకు మార్కెట్ ధరల ప్రకారం సరఫరా చేస్తోందని వినిమయ వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖ సహాయ మంత్రి రావుసాహెబ్ దాదారావు ధాన్వే లోక్‌సభకు తెలిపారు. ఈ సంవత్సరం జనవరి ఆఖరి వరకు తెలంగాణకు 111.68 మెట్రిక్ టన్నులు, ఏపీకి 893.18 మెట్రిక్ టన్నుల ఉల్లిపాయలను అందజేసినట్లు ఆయన చెప్పారు.

## ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లపై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ముస్లిం మైనారిటీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ల కేటాయింపు అంశంపై ఉమ్మడి హైకోర్టులో ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వారం రోజులపాటు వాయిదా వేసింది. తీర్పును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం, మాజీ మంత్రి షబ్బీర్ అలీ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్, షబ్బీర్ అలీ తరఫున సల్మాన్ ఖుర్షీద్, షకీల్ అహ్మద్‌లు విచారణకు హాజరయ్యారు. వారం రోజులపాటు విచారణ వాయిదా వేయాలన్న పిటిషనర్ల అభ్యర్థన మేరకు ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.



మంగళవారం మేడారంలోని జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

# ...జాతర పోదమా

### నేటి నుంచి మేడారం మహాజాతర • సాయంత్రం గద్దెలపైకి సారలమ్మ

సాక్షి ప్రతినిధి, వరంగల్: దక్షిణాది కుంభమేళా.. మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర అసలు ఘట్టం కొన్ని గంటల్లో మొదలుకానుంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు.. మేడారం అటవీ ప్రాంతం ఇప్పటికే భక్తజన గుడారంగా మారింది. కార్లు, బస్సులు, వ్యాన్లు, ఆటోలు, ఎడ్ల బండ్లు.. అన్ని మేడారం బాటపడుతున్నాయి. తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు మేడారానికి చేరుకుంటున్నారు. కొన్ని గంటల్లో మొదలయ్యే మేడారం జాతరకు భారీగా ప్రజలు తరలివస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే సారలమ్మ.. మేడారంలోని గద్దెపై కొలువుదీరే ఘడియలు దగ్గరపడుతున్నాయి.

**కన్నెపల్లి నుంచి సారలమ్మ ఆగమనం..**

వనదేవత సారలమ్మ బుధవారం సాయంత్రం మేడారంలోని గద్దెపై కొలువు తీరనుంది. పూజారులు ఇందుకోసం వారం రోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మేడారం సమీపంలోని కన్నెపల్లిలో ఉన్న సారలమ్మ గుడిలో మంగళవారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం గిరిజన పూజారులు సారలమ్మను



బండెనక బండి కట్టి...

కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలపైకి తెచ్చే ప్రక్రియ బుధవారం ఉదయం మొదలవుతుంది. సాయంత్రం 6 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ తర్వాత కన్నెపల్లి నుంచి గిరిజన పూజారులు, జిల్లా అధికారులు సారలమ్మను తీసుకొస్తారు. సారలమ్మ గద్దెపైకి వచ్చేలోపే ఏటూరునాగారం మండలం కొండాయిలో కొలువైన గోవిందరాజులు, గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైన పగిడిద్దరాజును సైతం మేడారం గద్దెల వద్దకు తీసుకొస్తారు. మంగళవారమే పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు పయనమయ్యాడు. పూనుగొండ్ల నుంచి కాలిబాటన 50 కిలోమీటర్లు ఉండటంతో వడ్డెలు ముందుగానే బయల్దేరారు. మేడారానికి సారలమ్మను కన్నెపల్లి నుంచి తీసుకొచ్చే వేడుకను చూసేందుకు లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఇప్పటికే 50 లక్షల మందికి పైగా భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు.

**సీసీ కెమెరాల నిఘా**

ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ ఉత్సవంగా ప్రసిద్ధి గాంచిన మేడారం జాతరకు ఈసారి 1.4 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసింది. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ప్రత్యేకాధికారులు వీపీ గౌతమ్, వరంగల్ పోలీస్ కమిషనర్ విశ్వనాథ రవీందర్, ములుగు ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ నేతృత్వంలో యంత్రాంగం భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసింది. జాతరలో సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్లు ఖర్చు చేస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి టీఎస్‌ఆర్టీసీ 4,105 బస్సుల నడుపుతోంది. గతంలో జాతరకు వెళ్లి వచ్చేందుకు రెండే ప్రధాన మార్గాలు ఉండేవి. ఈసారి ఆరు మార్గాలను ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెళ్లి రావచ్చు. మేడారం జాతర ప్రదేశంలో 300 సీసీ కెమెరాలతో భద్రతా చర్యలు, జాతర నిర్వహణ కోసం 12 వేల మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు సాంకేతికంగా ఉపయోగపడేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. జాతరకు వచ్చే భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు జంపన్న వాగుకు ఇరువైపులా 3.6 కిలోమీటర్ల పొడవునా స్నాన ఘట్టాలు నిర్మించారు. వైద్య సేవల కోసం ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. వన దేవతల గద్దెల పక్కనే ఉన్న వైద్య శాఖ భవనంలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. అత్యవసర వైద్య సేవల కోసం 108, 104 వాహనాలను సిద్ధంగా ఉంచారు.

# మందుల ప్రకటనలు ఇక బంద్!

- 78 రకాల జబ్బుల ఔషధ ప్రచారంపై కేంద్రం నిషేధం
- డ్రగ్స్, మ్యాజిక్ రెమిడీస్ సవరణ ముసాయిదా బిల్లు

సాక్షి, హైదరాబాద్: ఎయిడ్స్‌ను తగ్గించేందుకు మా వద్ద ఫలానా మందు ఉంది. డయాబెటిస్‌ను ఆ మందుతో చెక్ పెట్టేస్తాం. ఫలానా మందుతో నెల రోజుల్లో 10 కేజీల బరువు తగ్గిస్తాం. ఇలాంటి ప్రకటనలను మనం చూస్తుంటాం. వీటన్నింటినీ నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం నూతన సవరణ ముసాయిదా బిల్లును రూపొందించింది. ఆ బిల్లును మంగళవారం ప్రజాభిప్రాయం కోసం విడుదల చేసింది. ఇప్పటికే కొన్ని రకాల జబ్బులకు సంబంధించిన మందులను ప్రచారం చేయకూడదన్న నిబంధన ఉండగా, తాజాగా మరికొన్నింటినీ కేంద్రం ప్రకటించింది. మొత్తంగా 78 రకాల జబ్బులకు ఫలానా మందు వాడితే తగ్గుతుందంటూ ప్రకటనలు చేయకూడదని, ఆ మేరకు ముసాయిదా బిల్లులో పేర్కొంది. ఒకవేళ ఎవరైనా ఆ జబ్బులకు మందులను సూచిస్తూ ప్రచారం చేస్తే రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తామని తెలిపింది. మళ్లీ అదే తప్పు చేస్తే ఐదేళ్ల జైలు, రూ.50 లక్షల వరకు జరిమానా విధించేలా నిబంధనను కేంద్రం ముసాయిదాలో ప్రవేశపెట్టింది. ఈ జబ్బుల జాబితాలో ఎయిడ్స్, క్యాన్సర్, డయాబెటిస్, డిజార్డర్స్, హెర్నియా, హైడ్రోసిల్, బ్రెయిన్ సామర్థ్యాన్ని పెంచడం, లుకేమియా, స్థూలకాయం, పక్షవాతం, పార్కిన్సన్, పైల్స్, గుండె జబ్బులు, లైంగిక సామర్థ్యం, కిడ్నీలో రాళ్లు, లెప్రసీ, ప్లేగ్, న్యుమోనియా, టీబీ, టైఫాయిడ్ ఫీవర్, అపెండిసైటిస్, అంధత్వం, బ్లడ్ పాయిజనింగ్, చెవుడు, స్కిన్ ఫెయిర్‌నెస్, కంటి చూపు పెంపుదల, కామెర్లు, స్పాండిలైటిస్, మహిళలకు వచ్చే కొన్ని రకాల వ్యాధులు, అల్సర్లు తదితర జబ్బులకు మందులు సూచించకూడదని పేర్కొంది.

**డాక్టర్లను సంప్రదించకుండానే**

ఇలాంటి ప్రకటనల వల్ల చాలామంది డాక్టర్లను సంప్రదించకుండానే నేరుగా మందుల షాపుల్లో వీటిని కొనుగోలు చేసి వాడుతున్నారు. దీంతో సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయి. అలాగే కొందరు మందులను ప్రచారం చేస్తూ వాటిని అమ్ముకుంటూ దండుకుంటున్నారు. ప్రసార మాధ్యమాల్లో ప్రచారం చేయడం వల్ల చాలామంది వాటికి ప్రభావితులై నష్టపోతున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలనే కేంద్రం నిర్ణయించి ఈ మేరకు ముసాయిదా బిల్లు తీసుకొచ్చింది.

# కేటుగాళ్ల 'టోల్'మాల్!

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకుంటోందని అధికారులు అంచనాకు వచ్చారు. టోల్ వసూలు విషయంలో చాలా చోట్ల పాత సంస్థలే పోటీ పడుతుంటాయి. ఈ నేపథ్యంలో బిడ్ మొత్తం పెరగకుండా ఉండాలంటే, అంతకుముందు సంవత్సరం వసూలైన టోల్ మొత్తం తక్కువగా కనిపించాలి. అంటే వాస్తవంగా వసూలు చేసిన మొత్తం కంటే రికార్డు చేసే మొత్తం తక్కువగా ఉండాలి. కొన్ని సంస్థలు ఇలా మాయ చేసి ఉండటంవల్లే ఫాస్టాగ్ వచ్చాక టోల్ పెరిగిందని అధికారులు భావిస్తున్నారు.

**బీఓటీలోనూ మతలబు..**

బీఓటీ పద్ధతిలో రోడ్లు నిర్మించేప్పుడు యాన్యుటీ విధానంలాగా కాకుండా టోల్‌తో ముడిపెట్టి కొన్ని సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటాయి. అంటే, ఆ రోడ్డును పూర్తిగా సొంత ఖర్చుతో నిర్మించి ఆ మొత్తాన్ని టోల్ వసూలు ద్వారా రికవరీ చేసుకుంటాయి. రోడ్డును నిర్మించిన సంస్థే టోల్ కూడా చూసుకుంటుంది. ఒకవేళ టోల్ వసూలు తక్కువగా ఉంటే, ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న గడువులోపు నిర్మాణ మొత్తం రికవరీ కాదని, టోల్ నిర్వహణ గడువు పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుంటాయి. అన్ని సంస్థలూ ఇలా చేసే అవకాశం లేకపోయినా.. కొన్ని సంస్థలు ఇలాంటి అవకతవకలకు పాల్పడి ఉంటాయని అధికారులు అనుమానిస్తున్నారు.

**ఫాస్టాగ్ రాకతో దందా బట్టబయలు..**

టోల్‌ప్లాజాల వద్ద జరుగుతున్న ఈ దందా.. ఎలక్ట్రానిక్ పద్ధతిలో టోల్ వసూలు చేసే ఫాస్టాగ్ విధానం అమల్లోకి రావడంతో బట్టబయలైంది. గతేడాది డిసెంబర్‌లో ఈ విధానం అందుబాటులోకి వచ్చింది. జనవరి 15 నుంచి ఒక్క లేన్ మినహా అన్ని లైన్లూ ఫాస్టాగ్ లైన్లుగా మార్చారు. దీంతో వాహనదారులు కూడా ఫాస్టాగ్ తీసుకోక తప్పలేదు. ఫాస్టాగ్ రావడానికి ముందు రాష్ట్రంలో ప్రతినెలా సగటున రూ.85 కోట్ల మేర టోల్ వసూలు కాగా.. జనవరిలో అది రూ.91.25 కోట్లకు పెరిగింది. అంటే కొత్త విధానం అందుబాటులోకి వచ్చాక నెలకు రూ.6.25 కోట్ల మేర ఆదాయం పెరిగింది. ఇదే సగటుతో కొనసాగితే సాలీనా ఆ మొత్తం రూ.75 కోట్లు అవుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 38 శాతం వాహనాలు ఇంకా ఫాస్టాగ్ పరిధిలోకి రాలేదు. అవి కూడా ఫాస్టాగ్ పరిధిలోకి వస్తే.. నెలకు మరో రూ.3 కోట్లకు పైగా ఆదాయం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే నెలకు అధికంగా వచ్చే మొత్తం రూ.9.25 కోట్లకు పెరుగుతుంది. సాలీనా ఆ మొత్తం రూ.111 కోట్లు అవుతుంది. ఎలా చూసినా ఆ మొత్తం రూ.100 కోట్లకు తగ్గదు. ఈ నేపథ్యంలో యాన్యుటీ పద్ధతిలో ఉన్న టోల్ గేట్లకు సంబంధించి ప్రభుత్వం తదుపరి టెండర్లలో బిడ్ మొత్తాన్ని ఆ మేరకు పెంచి చూపించే అవకాశం ఉంది. దీంతో అంత మొత్తం అదనంగా సమకూరుతుంది. అలాగే బీఓటీ రోడ్లకు సంబంధించిన టోల్ వసూలు గడువు పెంచుకునే వెసులుబాటు లేకుండా చేస్తే.. ఆ మేరకు కూడా ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్టే అవుతుంది.



మంగళవారం రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

# రాజ్‌భవన్‌లో గిరిజన నృత్యోత్సవం

### కళాకారులతో కలిసి నృత్యం చేసిన గవర్నర్

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న 26 కోయ, గోండి, బంజారా, తోటి, ప్రధాన్, డోలి తదితర గిరిజన బృందాలు మంగళవారం రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఎదుట సంప్రదాయ నృత్య ప్రదర్శనలిచ్చాయి. రేలా రే రేలా రాగంలో గుస్సాడీ, కొమ్ము కోయ నృత్యాలను సంప్రదాయ వస్త్రధారణలో ప్రదర్శించి ఆహూతుల్ని అలరించాయి. కళాకారుల ప్రదర్శనను చూసి తన్మయత్వం చెందిన గవర్నర్ తమిళిసై కళాకారులతో కలిసి కొంతసేపు నృత్యం చేశారు. రాష్ట్రంలో గిరిజనుల సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఇది తన బాధ్యతగా తీసుకున్నానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. తెలంగాణ కుంభమేళాగా కీర్తించబడుతున్న సమ్మక్క–సారమ్మ జాతరకు జనవరి 7న తాను హాజరవుతానన్నారు. ఢిల్లీ పరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర దినోత్సవం రోజున గిరిజన కళాకారులు ప్రదర్శించిన గుస్సాడీ, కొమ్ము కోయ నృత్య ప్రదర్శనలకు నాల్గవ బహుమతి లభించిందని కోయ గిరిజన అధ్యయన సంస్థ అధ్యక్షుడు, ప్రొ. జయధీర్ తిరుమలరావు తెలిపారు. దేశ నలుమూలల నుంచి మొత్తం 23 గిరిజన బృందాలు ఈ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై గిరిజన కళాకారులందరినీ జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో గిరిజన అధ్యయన సంస్థ తరఫున ప్రొ. జి.మనోజ, సోయం సుగుణాబాయి, పద్దం అనసూయ, జల్లి దామయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో సుగంధ ద్రవ్యాల బోర్డు ప్రాంతీయ కార్యాలయం

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సెంటర్ అండగా ఉంటుంది' అని వివరించారు.

**పంటకు ఎక్కువ ధరే లక్ష్యం...**

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ... 'స్పైసెస్ బోర్డు రీజినల్ సెంటర్ కమ్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ప్రకటన హర్షణీయం. ట్రైస్ స్కీమ్ కింద ఎగుమతుల వృద్ధి, మౌలిక వసతులు పెంచడానికి, క్లస్టర్ స్కీమ్ కింద విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ఉపయోగపడుతుంది. పసుపు బోర్డు కోసం నిజామాబాద్ రైతులు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. అయితే ఆ బోర్డు వాణిజ్య శాఖకు మాత్రమే పరిమితమవుతుంది. వివిధ శాఖలతో సమన్వయం చేసే అధికారాలు ఉండవు. రైతుల ఆదాయం రెట్టింపయ్యేందుకు మోదీ ప్రభుత్వం తెచ్చిన పథకాలే ట్రైస్, క్లస్టర్. పసుపు ఎగుమతులకు అవకాశం పెరగడంతో డిమాండ్ అధికం అవుతుంది. దీంతో రానున్న రోజుల్లో ఎక్కువ ధర వచ్చే అవకాశం ఉంటుంది. అంతిమంగా రైతుకు పంట మీద ధర ఎక్కువ రావాలన్నదే మన లక్ష్యం. రైతులు డిమాండ్ చేసిన దానికంటే కేంద్రం ఎక్కువే ఇచ్చింది' అని పేర్కొన్నారు. రైతులు.. పసుపు బోర్డు అడిగితే సుగంధ ద్రవ్యాల బోర్డు ఇవ్వడాన్ని ఎలా చూడాలని మీడియా ప్రశ్నించగా.. 'అంబాసిడర్ కారు కావాలా, మెర్సిడెస్ బెంజి కారు కావాలా? అని ఆలోచించి బెంజి కారు ఇచ్చింది. పసుపు బోర్డు డిమాండ్ చాలా కాలంనాటిది. అది ఇప్పుడు ఇచ్చినా ప్రభావవంతంగా ఉండదు' అని పేర్కొన్నారు.

**నోటిఫికేషన్ విడుదల...**

నిజామాబాద్‌లోని స్పైసెస్ బోర్డు డివిజనల్ ఆఫీస్‌ను రీజినల్ ఆఫీస్ కమ్ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంగళవారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు ఆ శాఖ అదనపు డైరెక్టర్ ఆర్.పి.కంచన్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ సెంటర్‌కు డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారని, ఎగుమతుల వృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తా రని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఉత్పత్తులు, సంబంధిత అంశాలను సమన్వయం చేస్తారన్నారు. అలాగే సుగంధ ద్రవ్యాల బోర్డు డైరెక్టర్(మార్కెటింగ్) రెండేళ్లపాటు ఈ ప్రాంతీయ కార్యాలయం కార్యక్రమాలను ప్రతి నెలా పర్యవేక్షిస్తారని అన్నారు. దానిపై మంత్రిత్వ శాఖకు నివేదిక ఇస్తారని వివరించారు.

# రైతులను మభ్యపెడుతున్నారు

- పసుపు రీజనల్ సెంటర్‌తో ఏం ప్రయోజనం లేదు
- పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ

ఆర్మూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పసుపు రైతులను మభ్యపెడుతూ మరోసారి మోసం చేయడానికి ఎత్తుగడ వేస్తోందని పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఆరోపించారు. నిజామాబాద్ కేంద్రంగా మసాల దినుసులు, సుగంధ ద్రవ్యాల ప్రాంతీయ బోర్డు ఏర్పాటుపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేసిన ప్రకటనపై మంగళవారం జిల్లాలోని ఆర్మూర్‌లో కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తామని, పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే గెలిచిన తర్వాత ఇప్పుడు పసుపు బోర్డు కాదంటూ స్పైసెస్ బోర్డు రీజనల్ కార్యాలయాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయిస్తామని ప్రకటించడం రైతులను మోసం చేయడమే అవుతుందని స్పష్టంచేశారు. వరంగల్‌లో ఉన్న ఈ కార్యాలయాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్రానికి మార్చడం తప్ప కొత్తగా వారు చేసేది ఏమీ లేదన్నారు. ఎన్నికల సమయంలో పసుపు పంటకు క్వింటాలుకు రూ.9 వేలు మద్దతు ధర ఇవ్వాలంటూ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని ఎంపీ అర్వింద్ ఎన్నోసార్లు చెప్పారని, ఇప్పుడు కేంద్రం నుంచి పసుపు గిట్టుబాటు ధరపై ఎలాంటి ప్రకటన రాకపోవడం ఆయన వైఫల్యమేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎంపీ అర్వింద్‌కు, బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని, క్వింటాలుకు రూ.15 వేలు మద్దతు ధర ప్రకటించాలని పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది.

## రాష్ట్రం కోసం కాళ్లు పట్టుకుంటే తప్పేంటి?

**పదవి పోతుందనే కేటీఆర్‌పై లక్ష్మణ్ విమర్శలు:ఎమ్మెల్సీ భానుప్రసాద్**



**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలపై బీజేపీ నేతలు మతిలేని మాటలు మాట్లాడుతున్నారని, తన ఉనికి చాటుకునేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తలాతోక లేని విమర్శలు చేస్తున్నారని శాసన మండలి సభ్యుడు, ప్రభుత్వ విప్ టి.భానుప్రసాద్ విమర్శించారు. అసెంబ్లీలోని టీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన పదవీకాలం ముగుస్తుందనే అసహనంతోనే లక్ష్మణ్ టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. ఢిల్లీలో కేటీఆర్ కొందరి కాళ్లు పట్టుకున్నారని లక్ష్మణ్ చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ 'రాష్ట్ర ప్రయోజనాల కోసం కాళ్లు పట్టుకుంటే తప్పేంటని'భానుప్రసాద్ ప్రశ్నించారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోనే రాష్ట్ర అప్పులు ఉండగా, కేంద్రం అప్పులు మాత్రం ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మించాయని, రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలమేంటో తేలిపోయిందని, బీజేపీ నేతలు కేంద్రం నుంచి నిధులు రాబట్టడంపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఓ వైపు కేంద్ర మంత్రులు ప్రశంసిస్తుండగా, మరోవైపు బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శలు చేయడాన్ని భానుప్రసాద్ ప్రశ్నించారు.

## ఎంపీ హెగ్డేను తొలగించాలి: మల్లు రవి



**సాక్షి, హైదరాబాద్:** మహాత్మా గాంధీని దూషించిన బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డేను ఆయన సభ్యత్వం నుంచి తొలగించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి డిమాండ్‌చేశారు. గాంధీజీ చేపట్టిన స్వాతంత్ర్య పోరాటాన్ని అవమానపరచడమే కాకుండా ఆయన బ్రిటిష్ వారితో కుమ్మక్కయ్యారని అనంతకుమార్ వ్యాఖ్యానించడం దేశాన్ని అగౌరవపరచడమేనని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతిపితగా, మహాత్ముడిగా మనం కొనియాడే గాంధీ పట్ల బీజేపీ మొదటి నుంచీ అనుచితంగా ప్రవర్తిస్తోందన్నారు. ఒకవైపు గాంధీ సంకల్పయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ.. మరోవైపు ఆయన్ను అగౌరవపరిచేలా మాట్లాడుతూ అవమానిస్తోందని ఆరోపించారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే హెగ్డేను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

## 17 నుంచి ఓబీసీ ధ్రువపత్రాల హెల్ప్‌డెస్క్

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల సహాయార్థం ఈ నెల 17 నుంచి ఓబీసీ ధ్రువపత్రాల జారీ సహాయ కేంద్రాన్ని (హెల్ప్‌డెస్క్) ప్రారంభించాలని టీపీసీసీ ఓబీసీ విభాగం తీర్మానించింది. మంగళవారం గాంధీభవన్‌లో ఈ విభాగం రాష్ట్ర చైర్మన్ ప్రొ. కత్తి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో నల్సార్ వర్సిటీలో ఓబీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. ఈ నెల 29లోగా అన్ని జిల్లా, మండల ఓబీసీ కమిటీల నియామకం జరగాలని, మార్చిలో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి సదస్సులకు సన్నద్ధం కావాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి ప్రొ. ప్రకాశ్ సోనావనే హాజరుకాగా, జాతీయ సమన్వయకర్తలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారంలో రాజీ లేదు: గోవింద్‌సింగ్

**సాక్షి, హైదరాబాద్:** క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) కేసుల పరిష్కారంలో ఎక్కడా రాజీలేదని, అత్యున్నత పనితీరుతో ముందుకెళ్తున్నామని సీఐడీ ఏడీజీ గోవింద్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. 2017లో తాను సీఐడీ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించేనాటికి 506 పెండింగ్ కేసులు అప్పటికే దర్యాప్తులో ఉన్నాయన్నారు. ఏటేటా తమ సిబ్బంది కేసుల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారని, డిసెంబర్ 31 నాటికి 221 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2014–2019 వరకు మొత్తం 726 కేసులను సీఐడీ దర్యాప్తు చేయగా.. వాటిలో 473 పరిష్కారమయ్యాయన్నారు. ఆయన నేతృత్వంలో 506 కేసులకుగాను 337 కేసులు డిస్పోజ్ చేసినట్లు వివరించారు. సీఐడీకి వాస్తవంగా మంజూరైన 820 పోస్టుల్లో 484 మంది సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారని, ప్రస్తుతం 336 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. 41 శాతం సిబ్బంది కొరత ఉన్నా.. తాము అత్యున్నత పనితీరుతో ముందుకెళ్తున్నామని చాలా కేసులకు కోర్టులో సీసీ నంబర్లు కూడా వచ్చాయని తెలిపారు. ఎంసెట్–2 మెడికల్ పేపర్ స్కాం, వేదగాయత్రి, అగ్రహారం, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మాల్‌ప్రాక్టీస్ స్కాంల కేసులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. ఇటీవల సీఐడీలో కేసులు పెరిగిపోతున్నాయంటూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) సంస్థ ఆరోపణలు చేసిన నేపథ్యంలో సీఐడీ ఈ ప్రకటన విడుదల చేయడం గమనార్హం.

## ఢిల్లీకి వెళ్లిపోయిన 'దిశ' కమిషన్

**సాక్షి, హైదరాబాద్:** దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య కమిషన్ ఢిల్లీ వెళ్లిపోయింది. ముగ్గురు సభ్యుల ఈ కమిషన్‌కి సుప్రీంకోర్టు జడ్జి వీఎస్ సిర్పూర్కర్ నేతృత్వం వహిస్తుండగా, బాంబే హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి రేఖా బాల్డోత, సీబీఐ మాజీ డైరెక్టర్ డీఆర్ కార్తికేయన్ సభ్యులుగా ఉన్నారు. ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తులో భాగంగా కమిషన్ సోమవారం నగరానికి వచ్చిన విషయం తెలిసిందే. ఎన్‌కౌంటర్‌పై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన దర్యాప్తు నివేదికను, రీపోస్టుమార్టం రిపోర్టులను కమిషన్ సభ్యులు తమతో పాటు తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ రిపోర్టుల అధ్యయనం తరువాత త్వరలోనే మరోసారి కమిషన్ హైదరాబాద్‌కు రానుంది.

## రఘునందన్ వల్ల నాకు ప్రాణహాని

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిపై ఓ మహిళ ఆరోపణలు**

**హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, న్యాయవాది రఘునందన్‌రావు వ ల్ల తనకు ప్రాణహాని ఉందని, ఆయన తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఓ మహిళ ఆరోపించింది. రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌ను, సైబరాబాద్ కమిషనర్ సజ్జనార్‌ను కలిశానని, వారి ఆదేశాల మేరకు ఆర్‌సీపురం పోలీసులు అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులసమావేశంలో పటాన్‌చెరు, జ్యోతినగర్‌కు చెందిన బాధిత మహిళ (47) మాట్లాడుతూ.. తన మొదటి భర్త వెంకటేశ్వర్‌రావుతో మనస్పర్థల కారణంగా 2003లో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నామని, ఆర్‌సీపురం పోలీసులే న్యాయవాది రఘునందన్‌రావు పేరును సూచించడంతో తాను అతన్ని కలిశానన్నారు. 2007లో కేసు విషయమై రఘునందన్ ఇంటికి వెళ్లగా తన భర్త వెంకటేశ్వర్‌రావు, రఘునందన్ ఇద్దరూ తనపై అత్యాచారానికి పాల్పడ్డారని వాపోయింది. 2012లో కూడా తన మొదటి భర్త వెంకటేశ్వర్‌రావు, రెండో భర్త శ్రీనివాస్, రఘునందన్ మరి కొంతమంది తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించింది.

## మఖ్దూం జయంతి సందర్భంగా నివాళి

**సాక్షి, హైదరాబాద్:** నాటి హైదరాబాద్ రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేయాలని, భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం మఖ్దూం మొహియుద్దీన్ అలుపెరగని పోరాటం చేశారని స్వాతంత్ర్య సమరయోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని ఆరెస్సెస్, నేటి బీజేపీ (నాటి జనసంఘ్)లు మత ప్రాతిపదికన దేశ ప్రజల మధ్య వైషమ్యాలు, మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎదుర్కోవాలని, అలాంటి వారిని తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం మఖ్దూం భవన్‌లో మఖ్దూం మొహియుద్దీన్ 112వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ నేతలు ప్రతాపరెడ్డి, ఎన్.బాలమల్లేశ్, డా.సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి కార్యదర్శి ఇ.టి.నరసింహ, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# మిర్చికి కరోనా ఘాటు!

- ప్రాణాంతక వైరస్ నేపథ్యంలో చైనాకు ఎగుమతుల నిలిపివేత
- వ్యాపారులు ధర తగ్గించడంతో ధర పతనం
- రూ.20 వేల నుంచి రూ.13 వేలకు పడిపోయిన క్వింటా మిర్చి ధర



ఖమ్మం మార్కెట్‌కు వచ్చిన మిర్చి

**సాక్షి ప్రతినిధి, ఖమ్మం:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్.. మన మిర్చి రైతుపైనా ప్రభావం చూపిస్తోంది. ఆ ప్రాణాంతక వైరస్‌తో అతలాకుతలమవుతున్న చైనాకు ఎగుమతులు నిలిచిపోవడంతో మిర్చి ధర అమాంతంగా పడిపోయింది. మొన్నటివరకు క్వింటాలు మిర్చి రూ.20 వేల నుంచి రూ.16 వేల మధ్య పలకగా.. ప్రస్తుతం రూ.12 వేలకు పడిపోయింది. దీంతో రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది దాదాపు 19,292 హెక్టార్లలో తేజ రకం మిర్చిని సాగు చేశారు. ప్రతిరోజూ ఖమ్మం మార్కెట్‌కు దాదాపు 25 వేల బస్తాల నుంచి 30 వేల బస్తాల వరకు విక్రయానికి వస్తుంటాయి. తేజ రకం మిర్చికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ముఖ్యంగా చైనా, మలేసియా, థాయ్‌లాండ్, సింగపూర్ దేశాలకు మిర్చి ఎగుమతులు జరుగుతుంటాయి. పెద్ద వ్యాపారులు రైతుల నుంచి మిర్చిని కొనుగోలు చేసి, వాటి తొడిమెలు తీసేస్తారు. అనంతరం 20 కిలోల చొప్పున బ్యాగులుగా తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తారు. గతేడాది ఆయా దేశాల్లో తేజ రకం మిర్చి దిగుబడి ఆశించిన స్థాయిలో లేదు. దీంతో రాష్ట్రంలో మిర్చి పంటకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. కోల్డ్ స్టోరేజీల్లో ఉంచిన మిర్చికి కూడా డిమాండ్ ఉండటంతో విక్రయాలు జరిగాయి. గతేడాది నవంబర్‌లో అయితే ఇంతకు ముందెన్నడూ లేని రీతిలో రూ.21,600 ధర పలికింది. ఈ ఏడాది జనవరి 9వ తేదీ వరకు కూడా మంచి ధరే వచ్చింది. ఆ తర్వాత రేటు పడిపోవడం మొదలుపెట్టింది.

**కరోనాతో రైతన్న కుదేలు...**

మన దగ్గర నుంచి విదేశాలకు ఎగుమతి అయ్యే మిర్చిలో దాదాపు 30 శాతం చైనాకే వెళుతోంది. ఈ నేపథ్యంలో గతనెల 9న క్వింటాలు మిర్చికి రూ.21,500 ధర వచ్చింది. అప్పుడే చైనాలో కరో నా వైరస్ వెలుగులోకి రావడంతో భారత ప్రభుత్వం అక్కడకు ఎగుమతులు నిలిపివేసింది. దీంతో వ్యాపారులు కూడా మిర్చిని కొనుగోలు చేయడం తగ్గించారు. ఓవైపు ఎగుమతులు లేకపోవడం.. మరోవైపు ఖరీఫ్‌లో పండించిన మిర్చి కూడా మార్కెట్‌కు రావడంతో ధర పడిపోయింది. మంగళవారం క్వింటాలు మిర్చికి రూ.13,430 మాత్రమే లభించింది. ఇది గరిష్ట ధర కాగా, రైతులు నుంచి మాత్రం రూ.12 వేలకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో తమకు నష్టం వస్తోందని రైతన్నలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**మిర్చి ధర పతనమైంది**

| తేదీ | ధర (రూ.లలో) |
|---|---|
| జనవరి 9 | 21,500 |
| జనవరి 10 | 21,400 |
| జనవరి 13 | 21,100 |
| జనవరి 17 | 20,650 |
| జనవరి 18 | 20,000 |
| జనవరి 20 | 18,475 |
| జనవరి 21 | 17,300 |
| జనవరి 28 | 17,000 |
| జనవరి 29 | 16,500 |
| జనవరి 31 | 13,100 |

– అప్పటి నుంచి ప్రతిరోజూ రూ.13 వేల నుంచి రూ.13,500 మధ్య పలుకుతోంది

**ఎగుమతులు లేవని ధర తగ్గించారు**



విదేశాలకు మిర్చి ఎగుమతులు లేవని చెప్పి ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మొన్నటి వరకు రూ.20 వేలకుపైగా ధర రాగా, ప్రస్తుతం రూ.13 వేలు మాత్రమే వస్తోంది. దీంతో క్వింటాకు దాదాపు రూ.7వేల నుంచి రూ.8 వేల నష్టం జరుగుతోంది. *– గుంటూరు వెంకటకృష్ణ, మల్లుపల్లి, కొణిజర్ల మండలం*

**కరోనా కారణంగానే ధర పతనం**



చైనాలో వచ్చిన కరోనా వైరస్ కారణంగా మిర్చి ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో ధర పతనమైంది. ఎగుమతులు లేకపోవడంతో పంటకు ధర పెట్టలేని పరిస్థితి నెలకొంది. *– గీత వెంకన్న, మిర్చి వ్యాపారి, ఖమ్మం*

**రూ.12,900 ఇచ్చారు..**



21 బస్తాల మిర్చిని విక్రయానికి తీసుకొచ్చా. రూ.12,900 ధర పలికింది. చైనాలో సోకిన వ్యాధికి, మిర్చికి ముడి పెట్టడంతో ధర భారీగా తగ్గింది. *– ధరావత్ భాను, బచ్చోడు, తిరుమలాయపాలెం మండలం*



**గవర్నర్‌ను కలసిన కవిత**

మాజీ ఎంపీ కవిత మంగళవారం రాజ్ భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 12న జరగనున్న తన బంధువుల అమ్మాయి వివాహానికి రావాల్సిందిగా గవర్నర్‌ను కవిత ఆహ్వానించారు. – సాక్షి, హైదరాబాద్

# కేకే తెలంగాణ ఎంపీ కాదు

- ఏడుగురు రాజ్యసభ సభ్యుల జాబితా వెల్లడించిన అండర్ సెక్రటరీ
- రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో లేని కేకే పేరు: కె.లక్ష్మణ్



**సాక్షి, హైదరాబాద్:** టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు (కేకే) తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించట్లేదని స్పష్టమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వెల్లడించారు. తెలంగాణ నుంచి ఏడుగురు రాజ్యసభ సభ్యులున్నారని, వారి జాబితాను రాజ్యసభ అండర్ సెక్రటరీ దీపక్ కల్రా జనవరి 28న పంపించిన లేఖ మంగళవారం తనకు అందిందని తెలిపారు. అందులో కేకే పేరు లేదని, దీంతో కేకే తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించట్లేదనే విషయం తేలిందని పేర్కొన్నారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సమయంలో ఎక్స్ అఫీషియో సభ్యుడి హోదాలో టీఆర్ఎస్ తరపున కేకే ఓటేయడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. దీన్ని రాష్ట్ర బీజేపీ సీరియస్‌గా పరిగణించింది. ఏపీ నుంచి రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న కేకే.. తెలంగాణలో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం ఎలా ఓటేస్తారని బీజేపీ ప్రశ్నించింది. దీనిపై రాష్ట్ర బీజేపీ నాయకత్వం.. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ గత జనవరి 27న ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. దీంతో తెలంగాణ నుంచి రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీల జాబితాను లక్ష్మణ్‌కు రాజ్యసభ అండర్ సెక్రటరీ దీపక్ కల్రా పంపారు. అందులో టీఆర్ఎస్ ఎంపీలుగా బండ ప్రకాశ్, జోగినపల్లి సంతోష్‌కుమార్, వి.లక్ష్మీకాంతారావు, ధర్మపురి శ్రీనివాస్, బి.లింగయ్య యాదవ్, బీజేపీ నుంచి గరికపాటి మోహన్‌రావు, కాంగ్రెస్ నుంచి కేవీపీ రామచంద్రరావు తెలంగాణ ఎంపీలని స్పష్టం చేసినట్లు లక్ష్మణ్ తెలిపారు. అలాగే రాష్ట్రాల వారీగా ఎంపీల జాబితాను తమ వెబ్‌సైట్‌లోనూ (http://rajyasabha.nic.in) అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

**'తుక్కుగూడ'చైర్మన్ ఎన్నికపై కోర్టుకు..**

తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక విషయంలో కె.కేశవరావుతో (కేకే) దొంగ ఓటు వేయించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ చైర్మన్ నుంచి అందిన లేఖ ప్రకారం ఏపీకి చెందిన ఎంపీ కేకేతో దొంగ ఓటు వేయించడంపై కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో అడ్డదారిలో గెలిచి.. కేటీఆర్ నీతులు వల్లిస్తున్నారని లక్ష్మణ్ మండిపడ్డారు.

## రాజ్యసభ నుంచి ఇంకా స్పష్టత రాలేదు..

**మున్సిపల్ ఎన్నికల్లో ఎంపీ కేకే ఓటు వివాదంలో ఎస్ఈసీ వెల్లడి**

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటేసిన టీఆర్ఎస్ ఎంపీ కేకేను ఏ రాష్ట్రానికి కేటాయించారనే అంశంపై రాజ్యసభ సెక్రటేరియట్ నుంచి ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికార వర్గాలు తెలిపాయి. తుక్కుగూడ మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎంపీ కేకే ఓటేయడం, నేరేడుచెర్లలో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావుకు తొలుత ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కును నిరాకరించడం, ఆ తర్వాత ఎస్ఈసీ జోక్యంతో ఓటు హక్కు కల్పించడం వంటి అంశాలపై రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. తదనం తర పరిణామాల నేపథ్యంలో వీరిలో ఎవరిని తెలంగాణకు, ఎవరిని ఏపీకి కేటాయించారో తెలపాలంటూ రాజ్యసభ సెక్రటేరియట్‌కు ఎస్ఈసీ లేఖతో పాటు ఈ–మెయిల్ పంపించింది. ఈ మేరకు తాము పంపిన లేఖపై రాజ్యసభ నుంచి ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని ఎస్ఈసీ వర్గాలు స్పష్టం చేశాయి.

# ఈస్ట్ లుక్‌కు 'మైస్' టచ్!

- ఉప్పల్‌లో మీటింగ్స్ అండ్ కాన్ఫరెన్స్ ఎగ్జిబిషన్ సెంటర్
- రూ.50 కోట్ల వ్యయంతో 16 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు
- ఢిల్లీ 'మైస్'తరహాలో పీపీపీ పద్ధతిలో నిర్మాణం, నిర్వహణ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లో తూర్పువైపునా అభివృద్ధి పరుగులు పెట్టాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలోకి తీసుకొచ్చిన 'ఈస్ట్ లుక్'కు మరింత ఆకర్షణీయమైన హంగులు సమకూరబోతున్నాయి. ఉప్పల్‌లో అతిపెద్ద మీటింగ్స్ అండ్ కాన్ఫరెన్స్ ఎగ్జిబిషన్ సెంటర్ ఏర్పాటు కాబోతోంది. ఇక్కడ అంతర్జాతీయ సదస్సులు నిర్వహించేలా మీటింగ్స్.. ఇన్సెంటివ్స్.. కాన్ఫరెన్సింగ్ అండ్ ఎగ్జిబిషన్ (మైస్)'గా దీన్ని తీర్చిదిద్దనున్నారు. ఢిల్లీ మైస్‌కు దీటుగా ఇప్పటికే హైటెక్స్‌లో ఉన్న లెవల్–1 స్థాయి మైస్‌ను మించి ఉప్పల్ భగాయత్‌లో 16 ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల వ్యయంతో హైటెక్ మైస్‌ను నిర్మించాలని హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది. గతంలో ఇజ్జత్‌నగర్‌లో 16 ఎకరాల విస్తీర్ణంలో మైస్‌ను నిర్మించాలని నిర్ణయించారు. అయితే, నగరం నలువైపులా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, ఉప్పల్ భగాయత్‌లో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఇందుకు అనుగుణంగా సాధ్యమైనంత త్వరగా క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలని భావిస్తున్నారు.

**మైస్‌లో సౌకర్యాలిలా...**

మైస్‌ను సువిశాల విస్తీర్ణంలో అంతర్జాతీయ సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా సకల సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దనున్నారు. కన్వెన్షన్‌లో మీటింగ్ రూమ్‌లు, బాల్ రూమ్‌లు ఉండనున్నాయి. అలాగే అంతర్జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లు నిర్వహించుకునేలా వసతులు కల్పించడంతో పాటు ఏకకాలంలో 400 కార్లు పార్కింగ్ చేసేలా మైస్‌ను నిర్మించనున్నారు. రిటైల్, ఎఫ్ అండ్ బీ వసతులు, హోటల్, సర్వీస్డ్ అపార్ట్‌మెంట్లు, డార్మిటరీలు, ఎంటర్‌టైన్‌మెంట్, బిజినెస్ సెంటర్లు కూడా ఏర్పాటు చేస్తారు.

**వడివడిగా ఈస్ట్‌లుక్...**

'ఈస్ట్ లుక్'పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపడుతోంది. ఇప్పటికే ఉప్పల్ భగాయత్ లే అవుట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు సందర్శకులను ఆకట్టుకునేందుకు మినీ శిల్పారామాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే ఉప్పల్ నుంచి నారపల్లి వరకు కేంద్రం సహకారంతో ఫ్లైఓవర్‌ను కూడా నిర్మిస్తోంది. దీంతోపాటు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కొర్రెముల, ప్రతాపసింగారం గ్రామాల్లో వందల ఎకరాల్లో లే అవుట్ చేసి ప్రణాళికబద్ధ అభివృద్ధికి అడుగులు పడేలా చూస్తోంది. ఇప్పుడు మైస్ రాకతో ఈస్ట్‌లుక్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని హెచ్ఎండీఏ అధికారులు అంటున్నారు.



మంత్రి తలసానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సినీ నటులు నాగార్జున, చిరంజీవి

# ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నిర్మించండి

- సినిమా టికెట్ల ధరల ఖరారులో సరళీకృత విధానం ఉండాలి
- మంత్రి తలసానిని కోరిన చిరంజీవి, నాగార్జున

**సాక్షి, హైదరాబాద్:** సినిమా రంగంలోని 24 విభాగాల్లో పనిచేసే వారి నైపుణ్యాన్ని పెంచేందుకు వీలుగా అంతర్జాతీయ ప్రమాణాలతో శంషాబాద్ సమీపంలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని ప్రముఖ నటులు చిరంజీవి, నాగార్జున.. సినిమాటోగ్రఫీ మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు మంత్రి మంగళవారం చిరంజీవి ఇంట్లో వారితో భేటీ అయ్యారు. చలనచిత్ర పరిశ్రమకు సంబంధించి పలు అంశాలను సమావేశంలో చర్చించారు. ఆన్‌లైన్ టికెటింగ్ విధానం అమలు తీరు తెన్నులపై చర్చించారు. టికెట్ల ధరలను నిర్ణయించే విధానాన్ని సరళీకరించే విధానం ఉండాలని వారు మంత్రిని కోరారు. చిత్రపురికాలనీ పక్కనే సినీ కార్మికులకు ఇళ్ల నిర్మాణానికి మరో 10 ఎకరాల స్థలం కేటాయించాలని, సినీ కార్మికులు, కళాకారుల కోసం కల్చరల్ కేంద్రం ఏర్పాటుకు జూబ్లీహిల్స్ ప్రాంతంలో 2 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. సినీ, టీవీ కళాకారులకు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా గుర్తింపు కార్డులు అందజేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సినీ కార్మికులకు వర్తింప చేయాలని, వారికి ఈఎస్ ఐ సౌకర్యం కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని ప్రతిపాదించారు. సినిమా షూటింగ్ ప్రారంభం కంటే ముందే ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో రిజిస్టర్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిత్రపురి కాలనీలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థలంలో ఆసుపత్రి, పాఠశాల నిర్మాణా నికి దాతలు ముందుకు వస్తే ఆ నిధులతో ని ర్మించి వాటికి వారు సూచించిన పేర్లు పెట్టేం దుకు సిద్ధమని మంత్రి దృష్టికి తెచ్చారు. గతం లో చిత్రపురి కాలనీలో తాగునీరు, రోడ్లు, బస్సు వసతి కల్పించినట్లు మంత్రి గుర్తుచేశారు. ఇప్పటికే పలుమార్లు సినీ ప్రముఖులు, చిత్రపురి కాలనీ సభ్యులతో సమావేశమై సమ స్యలను తెలుసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నెల రెండో వారంలో మరోసారి సమావేశ మై మరిన్ని అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ రామ్మోహన్‌రావు, నిర్మాత నిరంజన్‌రెడ్డి, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

# 'సహకారం'లోనూ మనదే అధికారం కావాలి

- సహకార సంఘాల ఎన్నికలపై టీఆర్ఎస్ నజర్
- పీఏసీఎస్, డీసీసీబీ పీఠాలను చేజిక్కించుకునేందుకు వ్యూహాలు
- గత ఎన్నికల్లో అవకాశం లభించని పార్టీ కార్యకర్తలకు పోటీ చాన్స్

**సాక్షి, హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికలు మొదలుకుని అన్ని ఎన్నికల్లోనూ వరుస విజయాలు సాధిస్తున్న తెలంగాణ రాష్ట్ర సమితి త్వరలో జరిగే సహకార ఎన్నికల్లోనూ పీఏసీఎస్, డీసీసీబీ పీఠాలను కైవసం చేసుకోవడంపై దృష్టి సారించింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) పార్టీ మద్దతుదారులకే పదవులు దక్కేలా వ్యూహరచన చేస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల తరహాలో సహకార ఎన్నికలు కూడా పార్టీలకు అతీతంగా ఆయా పార్టీల గుర్తుల ప్రమేయం లేకుండా జరుగనున్నాయి. దీంతో 905 పీఏసీఎస్‌ల పరిధిలోని 12,100 డైరెక్టర్ స్థానాల్లో పార్టీ మద్దతుదారులే విజయం సాధించేలా చూడాలని పార్టీ ఎమ్మెల్యేలను టీఆర్ఎస్ అధిష్టానం ఆదేశించింది. స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ అవకాశం లభించని క్రియాశీల కార్యకర్తలు, క్షేత్ర స్థాయి నాయకులకు సహకార ఎన్నికల్లో రిజర్వేషన్లు తదితరాలు అనుకూలించిన చోట డైరెక్టర్లుగా పోటీ చేయించాలని సూచించింది. పీఏసీఎస్‌లతో పాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పదవుల్లో ఎలాంటి రిజర్వేషన్లు లేకున్నా సామాజిక వర్గాల సమతుల్యతను పాటించాలని నిర్ణయించింది. జిల్లాల పునర్విభజన జరిగినా పూర్వపు జిల్లా డీసీసీబీలకు పాలక మండలిని ఎన్నుకోవాల్సి ఉండటంతో డీసీసీబీ పీఠాలను ఆశిస్తున్న కొందరు టీఆర్ఎస్ ముఖ్య నేతలు సహకార ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**ఈ ఎన్నికల్లోనూ 'క్లీన్‌స్వీప్'వ్యూహం..**

2018లో అసెంబ్లీ ముందస్తు ఎన్నికల్లో 119 స్థానాలకు గాను 89 చోట్ల విజయం సాధించిన టీఆర్ఎస్, గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తొమ్మిది స్థానాలు గెలుపొంది రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. పార్టీలకు అతీతంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 85 శాతం పంచాయతీల్లో టీఆర్ఎస్ మద్దతుదారులే విజయం సాధించారు. గతేడాది జరిగిన మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ భారీ విజయాన్ని నమోదు చేసింది. 32 జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాలను కైవసం చేసుకోగా, 537 జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు (జెడ్పీటీసీ) గాను 448 స్థానాలు (83.42శాతం) టీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. 5,817 మండల పరిషత్ ప్రాదేశిక స్థానా (ఎంపీటీసీ)లకు గాను 3,556 చోట్ల టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ 112 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్ పీఠాలను టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఈ నెల రెండో వారంలో జరిగే సహకార ఎన్నికల్లోనూ పీఏసీఎస్, డీసీసీబీ పదవులను క్లీన్‌స్వీప్ చేసేలా టీఆర్ఎస్ వ్యూహం రూపొందించింది. సహకార ఎన్నికల తర్వాత రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకుల జాబితాను రూపొందించి పదవుల పందేరం చేయాలని పార్టీ భావిస్తోంది.

## 'అక్రమ మైనింగ్‌పై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలి'

**సాక్షి, హైదరాబాద్:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మద్దివంచలో చట్ట వ్యతిరేకంగా మైనింగ్ చేస్తున్న రామకృష్ణ గ్రానైట్స్ కార్యకలాపాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. గార్ల మాజీ ఎంపీపీ, ముల్కనూర్ ఎంపీటీసీ వెంకట్‌లాల్ ఈ పిల్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా రాష్ట్ర గనుల శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, జిల్లా సహాయ డైరెక్టర్, రామకృష్ణ గ్రానైట్స్ అధిపతి ఎస్.రామకృష్ణలను చేర్చారు.





మంగళవారం ఉదయం మేడారంలోని జంపన్న వాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


మంగళవారం రాత్రి విద్యుత్ లైట్ల వెలుతురులో సమ్మక్క - సారలమ్మ గద్దెల పరిసరాలు


జంపన్నను గద్దెపైకి తీసుకొస్తున్న పూజారులు

## గద్దెపైకి చేరిన జంపన్న

**ఎస్ఎస్ తాడ్వాయి:** మేడారం మహాజాతరలో భాగంగా కన్నెపల్లి నుంచి తీసుకొచ్చిన జంపన్నను పూజారులు మంగళవారం రాత్రి గద్దెపై ప్రతిష్ఠించారు. జంపన్న పడిగెను పూజారి పోలెబోయిన సత్యం, సాంబయ్య చేతుల మీదుగా సాయంత్రం 6 గంటకు గద్దెపై జంపన్న పడిగెను ప్రతిష్ఠించారు.

## మేడారంలో ఐఏఎస్ వర్సెస్ డీఎస్పీ

### వీవీఐపీ దర్శనంలో పోలీసులు ఎలా వెళ్తారని వాగ్వాదం

**సాక్షి, హైదరాబాద్:** మేడారం జాతరలో ఐఏఎస్ అధికారికి, ఓ డీఎస్పీ స్థాయి అధికారికి జరిగిన వాగ్వాదం పోలీస్ డిపార్ట్మెంట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం..జాతరలో కొన్ని రోజులుగా ఓ డీఎస్పీ విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆయన దైవదర్శనం కోసం వీవీఐపీ క్యూలో వెళ్లారు. అక్కడే విధుల్లో ఉన్న ఐఏఎస్ అధికారి అభ్యంతరం తెలిపారు. దీంతో తాను చాలా రోజుల నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నానని, డీఎస్పీ స్థాయి అధికారినైన తాను వీవీఐపీలో వెళ్తే తప్పేంటని ఆయన తిరిగి ప్రశ్నించారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటలు కాస్తా వాగ్వాదంగా మారింది.

## చిరస్థాయిగా నిలిచిపోవాలి

### ఏర్పాట్లపై సమీక్షలో సీఎస్ సోమేశ్‌కుమార్

**సాక్షి, హైదరాబాద్:** మేడారం జాతరకు వచ్చే భక్తుల మనసులో చిరస్థాయిగా నిలిచేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన జాతర ఏర్పాట్లపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిరంతర విద్యుత్, మంచినీటి సరఫరా, పూర్తి స్థాయిలో టాయిలెట్ల వినియోగం, బస్సుల ఏర్పాటు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, పార్కింగ్ లాట్స్ తదితర అంశాలపై సమీక్షించారు. ఏవైనా అవాంతరాలెదురైన పక్షంలో తక్షణం సమాచారం వచ్చేలా ఏర్పాట్లు చేసుకుని వాటిని వెంటనే సరిదిద్దాలని సూచించారు. యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్, భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

## మేడారంలో ఇద్దరు భక్తుల మృతి

**ఏటూరునాగారం:** ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు వచ్చిన ఇద్దరు భక్తులు మృతి చెందారు. జంపన్నవాగులో హైదరాబాద్‌కు చెందిన వినయ్ (25) స్నానం ఆచరించే క్రమంలో మృతి చెందాడు. అలాగే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంకు చెందిన వినోద్ (26)కు ఫిట్స్ రాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# పగిడిద్దరాజు పెల్లి కొడుకాయె..

## నేడు మేడారంలో సమ్మక్కతో వివాహం

**గంగారం:** గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ ఆరాధ్య దైవమైన సమ్మక్కను వివాహం చేసుకునేందుకు పెళ్లి కుమారుడిగా తయారైన పగిడిద్దరాజు మేడారానికి బయలుదేరాడు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామానికి చెందిన పగిడిద్దరాజుకు భక్తి శ్రద్ధల నడుమ పూజలు నిర్వహించిన పూజారులు.. కాలి నడకన మేడారం బయలుదేరారు. వరుడు పగిడిద్దరాజు ఇంటి వద్ద చేయాల్సిన కార్యక్రమాలను పెనక వంశీయుల వడ్డెలైన కల్తి వంశీయులు నిర్వహించారు. పూనుగొండ్లలో మొదట పగిడిద్దరాజు పాన్పును తీసుకువచ్చాక వడ్డె ఇంటి వద్ద మహిళలతో ముగ్గులు వేయించారు. అనంతరం మేక, పాన్పుతో గ్రామ పురవీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద మేకపోతును బలిచ్చి పగిడిద్దరాజుకు నైవేద్యం సమర్పించారు. దేవాలయంలో ఉన్న పడిగెను తీసి దేవుని గుట్ట నుంచి తీసుకువచ్చిన వెదురు కర్ర కట్టి గద్దెపై ప్రతిష్ఠించారు. దేవాలయంలో పగిడిద్దరాజు గద్దె వద్ద పసుపు, కుంకుమ చల్లి శుద్ధి చేశారు. అనంతరం పడిగెతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గ్రామం దాటే వరకు ఆదివాసీ సంప్రదాయాల నడుమ, డోలు, డప్పులు వాయిద్యాలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, వడ్డెలతో ర్యాలీ నిర్వహించారు. పగిడిద్దరాజు పడిగె వస్తుండగా.. పూజారుల కాళ్లు తడిపి తరించేందుకు గ్రామ మహిళలు బిందెలతో నీళ్లు ఆరబోశారు. పగిడిద్దరాజు వెళ్లేటప్పుడు అధిక సంఖ్యలో భక్తులు కాలి నడకన బయలుదేరి వెళ్లారు.

**కాలినడకనే బయలుదేరిన పగిడిద్దరాజు**

పగిడిద్దరాజు పడిగెతో పూజారులు పూనుగొండ్ల నుంచి అటవీ మార్గం గుండా 80 కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణించి ములుగు జిల్లా కర్లపల్లి సమీపంలోని లక్ష్మీపురానికి మంగళవారం రాత్రి చేరుకుంటారు. గ్రామంలోని పెనక వంశీయుల ఇంటి వద్ద సేద తీరి బుధవారం తెల్లవారుజామున స్నానమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కర్లపల్లి, నార్లాపూర్, వెంగ్లపూర నుంచి మేడారానికి సాయంత్రంలోగా చేరుతారు. అక్కడ సమ్మక్క – పగిడిద్దరాజు వివాహం జరిపిస్తారు. కాగా, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మేడారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అల్లెం రామ్మూర్తి తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.


శివసత్తుల పూనకాల నడుమ పగిడిద్దరాజు పడిగెతో పూజారులు

# తీరొక్క మొక్కులు

## అమ్మలకు ప్రత్యేక మొక్కుల చెల్లింపు

- కోరిన కోర్కెలు తీర్చాలని వనదేవతలకు వేడుకోలు
- కోళ్లు, ఎత్తు బంగారం, ఒడి బియ్యం సమర్పణ

*మేడారంలో ప్రారంభమైన సమ్మక్క-సారలమ్మ మహాజాతరలో భక్తులు తీరొక్క మొక్కులు చెల్లిస్తుంటారు. సంతానం కలగాలని, ప్రభుత్వ ఉద్యోగం రావాలని, వ్యాపారంలో బాగా స్థిరపడాలని, కూతురికి మంచి వివాహ సంబంధం రావాలని అమ్మలను భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. కోర్కెలు తీరిన వారు కోళ్లు, యాటలు, ఎత్తు బంగారం, ఒడి బియ్యం, చీర సారెలు సమర్పించి వనదేవతల ఆశీర్వాదం పొందుతారు. జాతరలో తీరొక్క మొక్కులపై ప్రత్యేక కథనం.*

– ఏటూరునాగారం


గద్దెల వద్ద చెట్టుకు ఊయల కడుతున్న భక్తురాలు

### జంపన్నవాగులో స్నానం

జంపన్నవాగుకు సర్వపాప హరిణిగా పేరుంది. ఒకప్పటి సంపెంగ వాగే నేటి జంపన్నవాగు. ఇప్పుడు స్నానమాచరిస్తే చేసిన పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. జంపన్న వాగులో స్నానాలు చేసిన తర్వాతనే తల్లుల దర్శనానికి వెళ్తారు. జంపన్న వాగు ఒడ్డున తలనీలాలు సమర్పిస్తారు.

### ఎదుర్కోళ్లు..

అమ్మలను గద్దెలకు తీసుకొచ్చే క్రమంలో భక్తులు ఎదుర్కోళ్లతో ఆహ్వానం పలుకుతారు. తమ చేతుల్లో ఉన్న కోడిని ఎదురునా చేస్తూ మనసారా మొక్కుతుంటారు.

### శివసత్తుల పూనకాలు

జంపన్నవాగులో శివసత్తుల పూనకాలు మేడారం జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మహిళలతో పాటు పురుషులు కూడా శివాలూగుతూ జాతరకు వస్తారు. వీరంతా తొలుత జంపన్నవాగులో స్నానం ఆచరిస్తారు. తర్వాత పసుపుతో అలంకరించుకుంటారు.

### ఆచార వ్యవహారాల్లో ప్రత్యేకం

సమ్మక్క తల్లిని నిష్ఠగా కొలిచే మగ భక్తుల్లో కొందరు శివసత్తులుగా మారుతారు. వీరి జీవితం తల్లులకే అంకితం. వీరు జాతర సమయంలో ఒళ్లంతా పసుపు రాసుకుంటారు. చీర సారె కట్టుకొని వచ్చి తల్లులను దర్శించుకుంటారు. వీరికి అమ్మవారు పూనినప్పుడు శివమెత్తుతారు.


అమ్మవార్లకు ఒడిబియ్యంతో మొక్కులు చెల్లిస్తున్న మహిళ

### ఒడి బియ్యం

భక్తులు తల్లులను ఆడపడుచులుగా భావిస్తూ ఒడిబియ్యం మొక్కులు చెల్లిస్తారు. తమ ఇళ్లలోనే నూతన వస్త్రం, జాకెట్, కొబ్బరి కుడుక, పోక, కజ్జుర, నాణంను ఒడిబియ్యంలో కలిపి శివసత్తులకు పోస్తారు. ఆ తర్వాత అమ్మవారికి సమర్పిస్తారు.

**మేకలు, కోళ్ల బలి**

మేడారం జాతరలో కోళ్లు, మేకలను తల్లులకు బలిస్తారు. అమ్మల దర్శనం అనంతరం వీటిని బలిచ్చి విందు చేసుకుంటారు. వనదేవతలకు దర్శించుకునే ముందు భక్తులు రెండు కొబ్బరి కాయలు కొడతారు. ఈ సమీపంలో పసుపు, కుంకుమతో పాటు అగరవత్తులు వెలిగించి దేవతలకు మొక్కుతారు.

### లక్ష్మీదేవర మొక్కు

లక్ష్మీదేవర గుర్రపు ముఖం ఆకృతిలో ఉంటుంది. నాయకపోడు పూజారి లక్ష్మీదేవరను ధరించి దారిపొడువునా నృత్యం చేస్తూ గద్దెలకు వస్తారు. ఆయనకు గద్దెల వద్ద డోలు, గజ్జెల మోతతో చప్పుళ్లు చేస్తారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం తల్లులకు పూజలు జరుపుతారు.

## బంగారం సమర్పణ



ప్రపంచలో ఏ జాతరలో లేని బెల్లం మొక్కు ఆనవాయితీ మేడారంలో ప్రత్యేకంగా కనిపిస్తుంది. సమ్మక్క తల్లికి బెల్లం అంటే ఇష్టం. తాము కోరిన కోర్కెలు నెరవేరితే నిలువెత్తు బంగారం సమర్పిస్తామని చాలా మంది మొక్కుతుంటారు. కోర్కెలు నెరవేరగానే తప్పనిసరిగా బెల్లం మొక్కు సమర్పిస్తారు.

## వరం పట్టుట

సంతానం లేని భక్తులు వచ్చే జాతర నాటికి సంతానం కలగాలని నిష్ఠతో మొక్కుతారు. ఈ మొక్కులను వరం పట్టడం అంటారు. ముందుగా జంపన్నవాగులో జంపన్న గద్దెకు కొబ్బరికాయ కొట్టి పూజలు చేస్తారు. అక్కడి నుంచి తడిబట్టలతో సారలమ్మ గుడికి చేరుకుంటారు. తల్లిని గద్దెలపైకి తీసుకొచ్చే క్రమంలో దారికి అడ్డంగా పడుకొని సాష్టాంగ నమస్కారం చేస్తారు. సారలమ్మ తల్లి మేడారంలోని గద్దెలపైకి వస్తున్నప్పుడు పూజారులు వీరిపై నుంచి దాటుతూ వెళ్తారు. సంతానం కలిగిన దంపతులు గద్దెల సమీపంలో ఊయలను కట్టి మొక్కు చెల్లిస్తారు.

# జన జాతరలు

## గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకం

### దేశవ్యాప్తంగా వందల జాతరలు • విభిన్నం ఆదివాసీల జాతరలు

**ఎస్ఎస్ తాడ్వాయి:** ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క – సారలమ్మ జాతరకు ములుగు జిల్లా ఎస్ఎస్.తాడ్వాయి మండలంలోని మేడారం ముస్తాబైంది. జాతర జరిగే నాలుగు రోజుల్లో కోట్లాది మంది భక్తులు వన దేవతలను దర్శించుకోనున్నారు. సమ్మక్క – సారలమ్మ జాతర తరహాలోనే బీరప్ప, కోట మైసమ్మ, రేణుకా ఎల్లమ్మ వంటి స్థానిక జాతరలు ఉన్నాయి. మన రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా అనేక జాతరలు ప్రతీ ఏటా జరుగుతుంటాయి. వీటిలో ప్రధానమైన కొన్ని జాతరల విశేషాలు.

**జంగూబాయి:** గోండు తెగకు చెందిన ఆదివాసీలు ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం సమీపానికి సరిహద్దు ప్రాంతంగా కలసి ఉన్న మహారాష్ట్రలో ఈ జాతర జరుపుకుంటారు. ఆదివాసీల ఆరాధ్య దైవమైన జంగూబాయి దేవతకు ప్రతిరూపమైన పెద్దపులిని పూజిస్తారు. గోండులంతా మాఘ శుద్ధ పౌర్ణమి మాసం రాగానే నెల రోజుల పాటు జంగూబాయి మాలలు వేస్తారు. జంగూమాతను టెంకాయలు మొక్కులుగా సమర్పిస్తారు. అక్కడి గుట్టలోని గుహలో ఉండే పెద్దపులికి జంగో లింగో అంటూ జేకొడుతూ దర్శనం చేసుకుంటారు.

**బీరమయ్య**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బీజీపూర్ జిల్లాలోని బస్తర్, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలోని వాజేడు మండల సరిహద్దు ప్రాంతంలో ఉన్న లొటపిట గండి కొండల్లో ఆదివాసీలు బీరమయ్య జాతర నిర్వహిస్తారు. పూర్వ కాలంలో ప్రజలను దోపిడీ దొంగలు దోచుకుపోతుంటే వారి నుంచి రక్షించేందుకు ముగ్గురు అన్నదమ్ములు పగిడిద్దరాజు, పాంబోయి, బీరమయ్య సిద్ధమవుతారు. ఈ దోపిడీ దొంగలను తరుముకుంటూ పగిడిద్దరాజు మేడారానికి, భూపాలపట్నం వైపు, బీరమయ్య లొటపిట గండికి వెళ్లి స్థిరపడతారు. అప్పటి నుంచి బీరమయ్యకు లొటపిట గండిలో, పాం బోయికి భూపాలపట్నం లో, పగిడిద్దరాజుకు మేడా రంలో జాతరలు నిర్వహిస్తారని అక్కడి పెద్దలు చెబుతారు.

**నాగోబా**

ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నాగోబా జాతర జరుగుతుంది. ఆదివాసీలకు ఇది ప్రధాన జాతర. మూడు రోజుల పాటు (ఇటీవలే జరిగింది) నిర్వహిస్తారు. నాగోబా జాతరను మెస్రం వంశస్తులు, గోండు ఆదివాసీలు జరుపుతారు. పుష్యమాసంలో నెలవంక చంద్రుడు కనిపించగానే.. మెస్రం వంశస్తులు హస్తిన మడుగు నుంచి కలశంతో నీరు తీసుకొచ్చి నాగులమ్మ దేవతను పూజిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నాగోబా జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించింది.

**ఈశాన్య రాష్ట్రాల్లో హర్నిబిల్**

భారత దేశంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఈశాన్య రాష్ట్రాలు అనేక ప్రత్యేకతలు కలిగి ఉన్నాయి. పూర్తిగా కొండలు, అడవులతో నిండిన ఈ ప్రాంతంలో గిరిజన జనాభా ఎక్కువ. వందల సంఖ్యలో గిరిజన తెగలు ఇక్కడ నివసిస్తున్నాయి. ఇక్కడున్న ఏడు రాష్ట్రాల్లో ప్రతి తెగకు సంబంధించి వేర్వేరుగా జాతరలు ఉన్నాయి. వీటిలో నాగాలాండ్‌లో జరిగే హర్నిబిల్ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఏటా డిసెంబర్ మొదటి వారంలో ఈ జాతర ప్రారంభమవుతుంది. ఈ జాతర ప్రధాన ఉద్దేశం గిరిజన తెగలకు సంబంధించిన ప్రత్యేక సంస్కృతి , సంప్రదాయాలను కాపాడుకోవడం. ఈ పండుగ సందర్భంగా ఇక్కడి గిరిజనులు ఆటపాటలతో ఆడిపాడుతారు. సంస్కృతికి సంబంధించిన వేడుక కావడంతో ఇది కనులపండువగా సాగుతుంది. హర్నిబిల్ జాతర తర్వాత జనవరిలో మణిపూర్‌లో థీసమ్ ఫణిత్ జాతరకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

**సర్హుల్**

ఆదివాసీల జనాభా ఎక్కువగా ఉన్న జార్ఖండ్ రాష్ట్రంలో సర్హుల్ జాతర జరుగుతుంది. ఈ జాతరలో భాగంగా ప్రకృతిని పూజిస్తారు. ఇక్కడ ఉండే సాల్ అనే చెట్టుకు ప్రత్యేక పూజలు జరుపుతారు. ధర్తీ మాతగా సీతాదేవి ఇక్కడ కొలుస్తారు. ప్రకృతి విపత్తులు ఇతర కష్టాల నుంచి తమను కాపాడుతారని ఇక్కడి గిరిజనుల విశ్వాసం.


నాగోబా జాతరలో భక్తులు (ఫైల్)

## దంతేశ్వరీ ఉత్సవాలు

ఆదివాసీ తెగ ప్రజలు అత్యధికంగా జీవించే ఛత్తీస్‌గఢ్‌లో దసరా పండుగ సమయంలో ఇక్కడ అన్నమదేవ్ రాజవంశీయులు దంతేశ్వరీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జగదల్‌పూర్ కేంద్రంగా జరిగే ఈ జాతరకు అత్యధికంగా గిరిజనులు హాజరవుతారు. రాజ వంశీయులు కీలక భూమిక పోషించినా ప్రధాన పాత్ర గిరిజనులదే. అదేవిధంగా రాయ్‌పూర్ సమీపంలో ఉన్న భోరమ్‌దేవ్ జాతర ప్రత్యేకతను సంతరించుకుంది.

## గరియ మాత

త్రిపుర రాష్ట్రంలో రీంగ్ తెగకు చెందిన ఆదివాసీలు గరియ పూజ జాతరను జరుపుకుంటారు. చైత్ర సంక్రాంతి రోజున ఒక వెదురు దండాన్ని ప్రత్యేకంగా కాటన్‌దారం, కాటన్‌తో తయారు చేసిన పూలతో అలంకరిస్తారు. దైవత్వానికి అంకితమైన కొందరు వ్యక్తులు ఈ దండాన్ని పట్టుకుని గ్రామంలో ఇంటింటికీ తిరుగుతారు.ఆ సమయంలో దేవతను స్తుతిస్తూ పాటలు పాడుకుంటూ నృత్యాలను చేస్తూ పంటలు బాగా పండాలని బాధలు నుంచి విముక్తి కలిగించాలని కోరుతారు.

**మఘేపరాబ్**

ఒడిశా రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాల్లో గిరిజనులకు ప్రత్యేక స్థానం ఉంది. ఏడాది పొడవునా అనేక జాతరలు జరుగుతాయి. ఇందులో ఏడు ప్రధానమైన జాతరలు ఉన్నాయి. వీటిలో మఘేపరాబ్ జాతర ఒకటి. ఈ జాతర సందర్భంగా తమ తెగ దేవతకు నల్లని పక్షులు బలిస్తారు. మద్యాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు.

## నేడు సమ్మక్క కల్యాణం

**సాక్షి ప్రతినిధి, వరంగల్:** లక్షలాది మంది భక్తుల సాక్షిగా వనదేవత సమ్మక్క-పగిడిద్దరాజుల కల్యాణం బుధవారం వైభవంగా జరగనుంది. ప్రతి రెండేళ్లకు మాఘశుద్ధ పౌర్ణమి రోజు సమ్మక్క-పగిడిద్దరాజుకు వివాహం జరిపించడం ఆదివాసీల సంప్రదాయం. ఇందుకోసం సమ్మక్క పూజారులు గ్రామాల్లో తిరిగేవారు. వారికి ఇచ్చేందుకు అప్పటి ఆదివాసీలు తమ పంటలో కొంత భాగాన్ని పక్కకు పెట్టేవారు. పంట లేని వారు కోళ్లు, మేకల వంటివి సమర్పించుకునేవారు. ఇలా సేకరించిన వస్తువులతో మాఘశుద్ధ పౌర్ణమి లేదా ఆ పౌర్ణమికి ముందు వచ్చే బుధవారం రోజు సమ్మక్క-పగిడిద్దరాజుకు వివాహం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ వివాహ వేడుక కాస్తా కాలక్రమేణా మేడారం జాతరగా మారిందని పరిశోధకులు చెబుతున్నారు.

**అమ్మవారి అలయమే కల్యాణ వేదిక**

పెళ్లి తంతులో భాగంగా ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పొనుగొండ్లలో ఉన్న పగిడిద్దరాజు ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో పడిగెను పగిడిద్దరాజుగా భావిస్తూ పెళ్లికొడుకుగా ముస్తాబు చేశారు. సమ్మక్క గుడిలో వడేరాల కుండల రూపంలో సమ్మక్క- పగిడిద్దరాజుకు కల్యాణం జరిపిస్తారు. అనంతరం గోవిందరాజు, సారలమ్మతో కలసి పగిడిద్దరాజు గద్దెలపై కొలువుదీరుతాడు.



ఆగ్రాలో తాజ్‌మహల్ ముందు ఫొటోలకు పోజిస్తున్న తృణమూల్ ఎంపీ నుస్రత్ జహాన్

## క్లుప్తంగా...

### 'నిర్భయ' కేసులో నేడు తీర్పు

**న్యూఢిల్లీ:** నిర్భయ కేసులో దోషుల ఉరిశిక్ష అమలును వాయిదా వేయడాన్ని సవాల్ చేస్తూ కేంద్రం, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్లపై నేడు ఢిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించనుంది. దోషులు ఉద్దేశపూర్వకంగానే శిక్ష అమలును వాయిదా వేస్తున్నారని, ఈ చర్య న్యాయ వ్యవస్థను అపహాస్యం చేయడమేనంటూ పిటిషనర్ల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించిన విషయం తెలిసిందే. ఈ నెల 2వ తేదీన వాదనలు ముగించిన జస్టిస్ సురేశ్ తీర్పును రిజర్వులో ఉంచారు. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న నలుగురు దోషులకు జనవరి 22వ తేదీన ఉరిశిక్షను అమలు చేయాలంటూ జనవరి 7వ తేదీన దిగువ కోర్టు తీర్పు వెలువరించింది. అయితే, దోషుల క్షమాభిక్ష పిటిషన్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటంతో శిక్ష అమలును కోర్టు ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదా వేసింది.

### నిలకడగా సోనియా ఆరోగ్యం

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆమె పరిస్థితి క్రమంగా మెరుగవుతోందని సర్ గంగారామ్ హాస్పిటల్ వైద్యులు ప్రకటించారు. ఆదివారం రాత్రి ఆమె ఆస్పత్రిలో జాయిన్ అయిన విషయం తెలిసిందే. పలు వైద్య పరీక్షలు చేపట్టిన వైద్యులు ఆమె పొట్టలో ఇన్ఫెక్షన్ అయినట్లు గుర్తించి, చికిత్స చేస్తున్నారు. 'ఆమె పరిస్థితిలో మెరుగుదల కనిపిస్తోంది. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉంది' అని ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ డీఎస్ రాణా మంగళవారం తెలిపారు.

### 'ఐఎంఏ'లో ఇద్దరు ఐపీఎస్‌లపై కేసు

**న్యూఢిల్లీ:** ఇస్లామిక్ బ్యాంకింగ్ పేరుతో బెంగళూరులో జరిగిన రూ. 4 వేల కోట్ల కుంభకోణం ఐ–మానిటరీ అడ్వైజరీ (ఐఎంఏ) కేసులో సీబీఐ ఇద్దరు ఐపీఎస్ అధికారుల పేర్లను చేర్చింది. ఐఎంఏ స్థాపకుడు మన్సూర్ ఖాన్‌కు సహాయం చేశారన్న అభియోగాలపై కేసు నమోదైనట్లు సీబీఐ అధికారులు మంగళవారం తెలిపారు. ఈ కేసులో ఐపీఎస్ ఆఫీసర్లు హేమంత్ నింబాల్కర్, అజయ్ హిలోరిలు ఉన్నారంటూ సీబీఐ కర్ణాటక ప్రభుత్వానికి ఇటీవల తెలిపింది. ఈ కేసులో ఇద్దరు ఐపీఎస్ అధికారులను విచారించేందుకు కర్ణాటక అనుమతి ఇవ్వడంతో 1998 బ్యాచ్‌కు చెందిన నింబాల్కర్, 2008 బ్యాచ్‌కు చెందిన హిలోరిలపై కేసు బుక్ అయింది.

### పదిలో ఒకరికి కేన్సర్!

**ఐక్యరాజ్య సమితి:** భారతదేశంలో 2018లో దాదాపు 11.6 లక్షల కేన్సర్ కేసులు కొత్తగా నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. ప్రతి పది మంది భారతీయుల్లో ఒకరు తమ జీవిత కాలంలో ప్రాణాంతక కేన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. కేన్సర్ బారిన పడిన వారిలో ప్రతి 15 మందిలో ఒకరు మరణించే అవకాశం ఉందని తెలిపింది. 2018లో దాదాపు 11.6 లక్షల కేన్సర్ కేసులు కొత్తగా నమోదైనట్లు పేర్కొంది. వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా డబ్ల్యూహెచ్‌వో, ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ కేన్సర్ (ఐఏఆర్‌సీ) సంస్థలు మంగళవారం రెండు నివేదికలు విడుదల చేశాయి. కేన్సర్ వ్యాధిపై ప్రపంచవ్యాప్తంగా ఎజెండా రూపొందించడంతో పాటు కేన్సర్‌పై పరిశోధన, నివారణలపై ఈ నివేదికలు ప్రధాన దృష్టి సారించాయి. సరైన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో రాబోయే 20 ఏళ్లలో మధ్య ఆదాయ దేశాల్లో కేన్సర్ మరణాల రేటు 60 శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది.

### త్వరలో ఎయిర్ డిఫెన్స్ కమాండ్

**న్యూఢిల్లీ:** భారత గగనతలంలో జరిగే వైమానిక దళ ఆపరేషన్లు అన్నింటినీ పర్యవేక్షించేలా ఎయిర్ డిఫెన్స్ కమాండ్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని భారత తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ వెల్లడించారు. హిందూ మహాసముద్రం పరిసర ప్రాంతాల్లో జరిగే నేవీ ఆపరేషన్ల కోసం ద్వీపకల్ప కమాండ్‌ను, సైనికులకు వసతి, ఆయుధాలు సమకూర్చడం వంటి అవసరాలు తీరుస్తూనే, వారి సేవల్ని వినియోగించుకునేలా లాజిస్టిక్ కమాండ్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. సాయుధ బలగాలన్నీ సంఘటితం కావడానికి, సమన్వయంతో పని చేయడానికి వైమానిక రక్షణ కమాండ్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వైమానిక దళానికి చెందిన విభాగాలన్నీ ఒకే కమాండ్ కిందకి వస్తే ఎదురయ్యే సమస్యల్ని నియంత్రించడం సులభం అవుతుందని అన్నారు. సిబ్బంది పని విభజన సక్రమంగా జరిగేలా లాజిస్టిక్స్ కమాండ్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు.

# హామీల వలలో ఓటరు ఎటు?

**ఉచిత పథకాలు, దేశభక్తి పాఠాలతో ఆప్ ముందుకు**

**ఎవరి మేనిఫెస్టోలో ఏముంది ?**

ఎన్నికల్లో ప్రచారం వేరు, ఇచ్చిన హామీలు వేరు. పోలింగ్‌కు కొద్ది రోజుల ముందు తటస్థ ఓటర్లను ఆకర్షించడానికి ప్రచారాంశాలు దోహద పడతాయి. కానీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే ఎప్పుడైనా అత్యంత కీలకం. ప్రచారంలో జాతీయ భావాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ మేనిఫెస్టో దగ్గరకి వచ్చేసరికి స్థానిక అంశాలకే పెద్ద పీట వేసింది. ప్రచార పర్వంలో వెనుకబడ్డ కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో యువత, మైనార్టీ ఓట్లపైనే దృష్టి కేంద్రీకరించింది. ఆప్ గురువారం మేనిఫెస్టో విడుదల చేసినప్పటికీ చాలా రోజుల కిందటే ఇచ్చిన గ్యారంటీ కార్డులతో పాటుగా దేశభక్తి అంశాన్ని చేర్చింది.

రాజధాని రణరంగం



**ఆప్**

యువత, మహిళా సాధికారత దిశగా ఆప్ ముందుకు వెళుతోంది. హిందూ ఓట్లు చేజారినా కష్టమేనని భావించిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సీఏఏ వ్యతిరేక ప్రదర్శనలపై చాలా సంయమనంతో వ్యవహరిస్తున్నారు. హిందుత్వపై కాస్త సానుకూలంగానే ఉంటూ బీజేపీ, కాంగ్రెస్‌కు మధ్యే మార్గంగా అడుగులు వేస్తున్నారు. ఇది మేనిఫెస్టోలో ప్రతిఫలించేలా చర్యలు తీసుకున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఢిల్లీ స్కూళ్లలో దేశభక్తికి సంబంధించిన పాఠ్యాంశాలను ప్రవేశపెడతామన్నారు. తనని అధికార అందలం ఎక్కిస్తాయనుకున్న ఉచిత పథకాల్ని కొనసాగిస్తానంటూ ఇప్పటికే 28 పాయింట్ల గ్యారంటీ కార్డులు ఇచ్చారు. నాణ్యమైన విద్య, నెలకి 200 యూనిట్ల ఉచిత కరెంట్, నెలకి 20 కిలోలీటర్ల ఉచిత నీరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటి వద్దకే రేషన్, 10 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు ఉచిత తీర్థయాత్ర, పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో మరణిస్తే కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం వంటి హామీలకే మేనిఫెస్టోలో ప్రధానంగా చోటు కల్పించారు. 24 గంటలు మార్కెట్లను తెరిచి ఉంచడాన్ని ప్రయోగాత్మకంగా చేపడతామని కూడా ఆప్ హామీ ఇచ్చింది.

**బీజేపీ**

ప్రచారంలో జాతీయ భావం ఎజెండాగా తీసుకొని మాటల తూటాలు పేలుస్తున్న బీజేపీ మేనిఫెస్టోలో స్థానిక అంశాలకే ప్రాధాన్యం ఇచ్చింది. అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకం పాటిస్తూ తూర్పు ఢిల్లీలో వలస కార్మికులు నివసిస్తున్న కాలనీల అభివృద్ధికి డెవలప్‌మెంట్ బోర్డు, ట్యాంకర్లపై ఆధారపడకుండా ఇంటింటికీ రక్షిత మంచినీరు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 10 కోట్లు కేటాయింపు, నిరుపేదలకు రూ.2 కే కిలో గోధుమ పిండి, ఆడపిల్ల పుడితే రూ. 2 లక్షల రూపాయలు, నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్లు వంటి హామీలు ఇచ్చింది.







**కాంగ్రెస్**

కాంగ్రెస్ పార్టీ ఈసారి ప్రచారంలోనూ, హామీలివ్వడంలో కూడా బీజేపీ, ఆప్ కంటే వెనుకబడింది. మైనార్టీల ఓటర్లనే అత్యధికంగా నమ్ముకున్న ఆ పార్టీ తాము అధికారంలోకి వస్తే సీఏఏకి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. యువ స్వాభిమాన్ యోజనకింద నిరుద్యోగులకు రూ.5 వేల నుంచి రూ.7,500 వరకు భృతి ఇస్తామని తన మేనిఫెస్టోలో వెల్లడించింది. అంతేకాకుండా యువత స్టార్టప్‌లు ప్రారంభించడం కోసం రూ.5 వేల కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. నెలకి 300 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇవ్వనుంది. ఇక ఢిల్లీ వార్షిక బడ్జెట్‌లో కాలుష్య నివారణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించనుంది. - న్యూఢిల్లీ

**ఎన్నికలకి ఎన్నికలకి మూడ్ మారిపోయే పేరున్న రాజధాని ఓటర్లు ఏ పార్టీ వైపు నిలుస్తారో కొద్ది రోజుల్లోనే తేలిపోనుంది.**

# సీఏఏకి మద్దతిచ్చే సర్కార్ కావాలి

**ఢిల్లీ ఎన్నికల సభలో మోదీ**

**న్యూఢిల్లీ:** జాతీయ భద్రత, ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టానికి మద్దతునిచ్చే ప్రభుత్వ అవసరమే ఢిల్లీకి ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ద్వారకలో సభలో మాట్లాడారు. ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు చేసే ప్రభుత్వాలు ఇప్పుడు రాజధానికి అవసరం లేదని, సరైన దిశానిర్దేశం చేసే ప్రభుత్వమే కావాలని ఆప్‌పై ఆరోపణలు గుప్పించారు. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ విద్వేష రాజకీయాలను ప్రేరేపిస్తోందని ప్రధాని ఆరోపించారు. శత్రువులు మనపై దాడి చేసేలా ప్రోత్సహించే ప్రభుత్వం ఢిల్లీకి ఇక అవసరం లేదని పిలుపునిచ్చారు. బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఉగ్రవాదుల కోసం కన్నీరు కార్చేవారు ఢిల్లీని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. అమెరికా జనాభా కంటే ఎక్కువ మంది పేదలకు బ్యాంకు ఖాతాలు ప్రారంభించామని, శ్రీలంకలో ఉండే జనాభా కంటే ఎక్కువగా ఇళ్లు కేంద్ర ప్రభుత్వం నిర్మించిందని మోదీ అన్నారు. ఢిల్లీలో ఆప్ సర్కార్ ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేయకపోవడాన్ని ప్రధాని తప్పుపట్టారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అత్యుత్తమమైనదని మోదీ వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని ఇప్పుడు విమర్శకులూ అంగీకరిస్తున్నారని అన్నారు. బడ్జెట్‌పై విపక్షాలు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. మంగళవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరై మోదీ ఎంపీలనుద్దేశించి మాట్లాడారు.



బీజేపీ అధ్యక్షుడయ్యాక జరిగిన తొలి పార్లమెంటరీ పార్టీ భేటీలో నడ్డాను సన్మానిస్తున్న మోదీ, ఇతర నేతలు

# ఆప్, బీజేపీ ద్వేషాన్ని పెంచుతున్నాయి

**పోయిన ఉద్యోగాల గురించి మోదీ మాట్లాడరు: రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ:** బీజేపీ, ఆప్‌లు ప్రజల్లో ద్వేషాన్ని పెంచుతున్నాయంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడారు. 'ప్రధాని మోదీ, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌లు యువతకు ఉద్యోగాలు ఇవ్వడం మానేసి, తాము అధికారంలో ఉండేందుకు పౌరుల మధ్యనే విభేదాలు సృష్టిస్తున్నారు. వీటి వల్ల బీజేపీ, మోదీ లాభపడి ఉండవచ్చు. కానీ దేశం లాభపడటం లేదు. పోయిన ఉద్యోగాలపై మోదీ మాట్లాడరు. హిందూయిజం గురించి, ఇస్లాం గురించి, సిక్కుల గురించి మాట్లాడతారు.. కానీ వీరికి ఆయా మతాల గురించి ఏమీ తెలియదు. మరొకరిపై దాడి చేయండంటూ ఎక్కడ రాసి ఉందో చూపించండి. ఇలాంటి ద్వేష రాజకీయాలను కాంగ్రెస్ ఎన్నటికీ చేయదు. దేశభక్తి కోసం ఒకరు మరొకరితో గొడవపడుతుంటే వారికి దేశభక్తి ఉన్నట్లా' అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడంపై స్పందిస్తూ ఆయన ఎర్రకోట, తాజ్‌మహల్‌లనూ అమ్మగలరని ఎద్దేవా చేశారు. దేశంలో నిరుద్యోగం ఆకాశాన్ని తాకుతోందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ చెప్పారు. కాంగ్రెస్ నేత రాహుల్‌తో కలసి ఆమె ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ నిరుద్యోగ పరిస్థితి అనుకోకుండా వచ్చిందా? లేక మోదీ ప్రభుత్వం చేసిన ప్రయోగం వల్ల వచ్చిందో చెప్పాలంటూ డిమాండ్ చేశారు.



# షహీన్‌బాగ్ షూటర్ ఆప్ సభ్యుడే

- కోర్టుకు తెలిపిన పోలీసులు
- దేశ భద్రతతో ఆప్ ఆడుకుంటోందన్న నడ్డా
- ఆరోపణలను తోసిపుచ్చిన షూటర్ కుటుంబీకులు

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు జరుగుతున్న ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో గతవారం గాలిలో కాల్పులు జరిపిన కపిల్ బైసలా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సభ్యుడేనని మంగళవారం పోలీసులు కోర్టులో వెల్లడించారు. కపిల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని, అందులోని వాట్సాప్ డేటాలో కపిల్ బైసలా, ఆయన తండ్రి ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిననాటి ఫొటోలున్నాయన్నారు. 'కపిల్, ఆయన తండ్రి 2019లో ఆప్‌లో చేరారు. ఆ సందర్భంగా దిగిన ఫొటోలు, వారిద్దరు స్థానిక ఆప్ నేతలతో దిగిన ఫొటోలు కపిల్ ఫోన్‌లో ఉన్నాయి' అని డీసీపీ రాజేశ్ దియొ తెలిపారు. ఆ ఫొటోలను పోలీసులు మీడియాకు అందించారు. దీనిపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించారు. 'ఎన్నికల కన్నా, ప్రభుత్వం కన్నా.. దేశం, దేశ భద్రత ముఖ్యమైనవి. దేశ భద్రతతో ఆటలాడుకునే వారిని దేశం ఎన్నటికీ క్షమించదు. ఢిల్లీ ప్రజలు ఆప్‌కు ఈ ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్తారు' అని నడ్డా ట్వీట్ చేశారు. అయితే, పోలీసుల వాదనను కపిల్ బైసలా కుటుంబ సభ్యులు తోసిపుచ్చారు. వారి కుటుంబానికి ఆప్‌తో కానీ, వేరే ఏ రాజకీయ పార్టీతో కానీ ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. 'ఈ ఫొటోలు ఎక్కడి నుంచి, ఎలా వచ్చాయో నాకు తెలియదు. కపిల్‌కు కానీ, ఇతర కుటుంబ సభ్యులకు కానీ ఏ పార్టీతో సంబంధం లేదు. కపిల్ తండ్రి గజేసింగ్ 2008 అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత వారు రాజకీయాలతో ఏ సంబంధం పెట్టుకోలేదు' అని గజేసింగ్ సోదరుడు తెలిపారు.

**పెద్ద కుట్రలో భాగం**

షహీన్‌బాగ్ కాల్పుల ఘటన వెనుక పెద్ద కుట్ర ఉండి ఉండొచ్చని మంగళవారం పోలీసులు కోర్టుకు తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు నాలుగు రోజుల పాటు నిందితుడైన కపిల్‌ను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు. 'కాల్పుల ఘటన జరిగిన సమయం, ప్రదేశం.. ఇది మరో పెద్ద కుట్రలో భాగమన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఆ కుట్రను ఛేదించాలి. వాట్సాప్‌లో వేర్వేరు గ్రూప్‌ల్లో కపిల్ సభ్యుడిగా ఉన్నాడు. ఆయా గ్రూప్‌ల్లోని ఇతర సభ్యులను, ఘటనాస్థలికి కపిల్‌తో పాటు వచ్చిన అతడి స్నేహితుడిని విచారించాల్సి ఉంది. అందుకు మరింత సమయం అవసరం' అని కోర్టును పోలీసులు కోరారు. అయితే, కపిల్ బైసలాను రెండు రోజుల కస్టడీకి అనుమతిస్తూ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ గుర్‌మోహిన కౌర్ ఆదేశాలిచ్చారు.



ఇటీవల షహీన్‌బాగ్‌లో కాల్పులు జరిపిన వ్యక్తి ఆప్ కార్యకర్త అంటూ ఢిల్లీ పోలీసులు విడుదల చేసిన ఫొటో

### ఆ విషయాన్ని సీజేఐ చూసుకుంటారు

**విచారణ ప్రక్రియను నేరుగా ప్రసారం చేయడంపై సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో జరిగే విచారణ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేసే విషయంలో పరిపాలన సంబంధ అంశాలను ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) పరిశీలిస్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశంలో న్యాయపరమైన ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వబోమని తెలిపింది. జాతీయ, రాజ్యాంగ ప్రాముఖ్యంగల అంశాలపై జరిగే విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలంటూ 2018లో వెలువరించిన తీర్పు అమలుపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ ప్రత్యక్ష ప్రసారానికి అవసరమైన వసతులను సమకూర్చుతున్నారని తెలిపారు. ఈ అంశంలో న్యాయపరమైన ఉత్తర్వులు ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది.



ఫొటోల్లో సింహం పిల్లను ఎత్తుకు పోతున్న కొండముచ్చును చూశారు కదా! అది ఆ కూనను చెట్టుపైకి తీసుకెళ్లి అటూఇటూ తిప్పింది. తన సొంతబిడ్డతో ఆడుకున్నట్లే దానితోనూ సరదాగా ఆడుకుంది. అరుదైన ఈ ఘటన దక్షిణాఫ్రికాలోని క్రూగర్ నేషనల్ పార్క్‌లో ఈ నెల 1న చోటుచేసుకుంది. ఇలాంటి అసాధారణ ఘటనను తన 20 ఏళ్ల సర్వీసులో ఎన్నడూ చూడలేదని పార్క్ రేంజర్ కుర్ట్ షుల్జ్ అన్నారు. ఆ తర్వాత ఆ కొండముచ్చు సింహం కూనను ఏం చేసిందో తెలియదని చెప్పారు.

### లవ్ జిహాద్‌కు నిర్వచనం లేదు

**న్యూఢిల్లీ:** 'లవ్ జిహాద్' అనే మాటకు ప్రస్తుత చట్టాల్లో ఎటువంటి నిర్వచనం లేదని, కేంద్ర సంస్థలేవీ లవ్ జిహాద్‌కు సంబంధించిన కేసులను విచారణ చేయడం లేదని కేంద్రం స్పష్టం చేసింది. లవ్ జిహాద్ కేసులకు సంబంధించి అడిగిన ఒక ప్రశ్నకు హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్ రెడ్డి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అదేవిధంగా, ఎన్నార్సీ అమలుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం మంగళవారం ఎయిర్‌క్రాఫ్ట్ చట్ట ఉల్లంఘనుల నుంచి భారీ జరిమానా వసూలు చేయడం సహా పలు ప్రతిపాదనలతో ఎయిర్‌క్రాఫ్ట్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీని ప్రకారం చట్టాన్ని ఉల్లంఘించిన వారికి విధించే జరిమానా మొత్తాన్ని రూ.10 లక్షల నుంచి రూ.1కోటికి ప్రభుత్వం పెంచింది.

### మావోయిస్టు నంబర్–2గా రంజిత్ బోస్

**న్యూఢిల్లీ:** సీపీఐ(మావోయిస్టు) పార్టీ అగ్రనాయకత్వంలో కీలక మార్పు చోటుచేసుకుంది. పార్టీ రెండో స్థానంలోకి బెంగాల్‌లోని హౌరా ప్రాంతానికి చెందిన రంజిత్ బోస్(63) అలియాస్ కబీర్‌ను ఎంపిక చేసుకుంది. గెరిల్లా యుద్ధతంత్రంతోపాటు భద్రతా బలగాలకు వ్యతిరేకంగా సామాన్య ప్రజలను ఏకం చేయడంలో ఈయన దిట్ట. రంజిత్ తలపై బెంగాల్, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రప్రభుత్వాలు ప్రకటించిన రివార్డు మొత్తం రూ.కోటి వరకు ఉంది. బిహార్, జార్ఖండ్‌లతోపాటు తూర్పు భారతంలో పార్టీ పట్టు పెంచడం, సంచలన ఘటనలకు కార్యరూపం ఇచ్చేందుకే పార్టీ ఈ మార్పు చేపట్టిందని భావిస్తున్నారు. పార్టీలో రెండో స్థానంలో ఉన్న బెంగాల్‌లోని మిద్నపూర్‌కు చెందిన ప్రశాంత్ బోస్(74)స్థానంలో రంజిత్ నియమితులయ్యారు.



అగ్ర నేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ సహా కీలక నేతలంతా ఇటీవల పశ్చిమబెంగాల్ అడవుల్లో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ అత్యున్నత విధాన నిర్ణాయక విభాగం పొలిట్‌బ్యూరోలో ప్రస్తుతం నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్, రంజిత్ బోస్, మాజీ అధిపతి గణపతి, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్, కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్, మిసిర్ బిస్రా అలియాస్ సాగర్ ఉన్నారు. బెంగాల్‌లో 2007లో నందిగ్రామ్‌లో నానో కార్ల ఫ్యాక్టరీని స్థాపించడంతో నాడు జరిగిన వ్యతిరేకోద్యమాన్ని రంజిత్ వెనక ఉండి నడిపించారు. దీంతోపాటు 44 గ్రామాలతో కూడిన లాల్‌గఢ్‌ను విముక్త ప్రాంతంగా ప్రకటించిన వ్యక్తిగా రంజిత్ బోస్‌కు పేరుంది.

# మృతులు 426 కేసులు 20,522



వుహాన్‌లో ఒక కన్వెన్షన్ సెంటర్‌ను తాత్కాలిక ఆస్పత్రిగా మార్చి పడకలను ఏర్పాటుచేసిన దృశ్యం

**చైనాలో కొనసాగుతున్న కరోనా విజృంభణ**

**చైనా వెళ్లినవారి వీసాలను రద్దు చేసిన భారత్**

**బీజింగ్/న్యూఢిల్లీ:** ప్రాణాంతక కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతోంది. చైనాలో ఈ వైరస్ బారిన పడి మరణించినవారి సంఖ్య 426కి చేరింది. సోమవారం ఒక్కరోజే చైనాలో 64 మంది చనిపోగా, 3235 కొత్త కేసులు, 5072 అనుమానిత కేసులు నమోదయ్యాయి. వైరస్ సోకిన వారిలో 492 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. 1,71,329 మంది అనుమానితులు ప్రస్తుతం వైద్యుల పరిశీలనలో ఉన్నారు. చైనాలో ఈ వైరస్ బాధితుల సంఖ్య సోమవారం నాటికి 20,522కి చేరింది. వైరస్ వ్యాప్తి, కట్టడిని సమీక్షించేందుకు సోమవారం అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధ్యక్షతన అధికార కమ్యూనిస్ట్ పార్టీ అత్యున్నత పొలిటికల్ బ్యూరో సమావేశం జరిగింది. బాధితులకు చికిత్స అందించే విషయంలో, వైరస్‌ను నిరోధించే విషయంలో నిర్లక్ష్యం చూపిన అధికారులను కఠినంగా శిక్షించాలని జిన్‌పింగ్ ఆదేశించారు.

**భారత్ ముందు జాగ్రత్త చర్యలు**

కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునే దిశగా భారత్ వీసా నిబంధనలను మరింత కఠినం చేసింది. గత రెండు వారాల్లో చైనా వెళ్లిన చైనీయులు, విదేశీయులకు ఇప్పటికే జారీ చేసిన వీసాలను రద్దు చేసింది. జనవరి 15 తరువాత చైనా వెళ్లి, ప్రస్తుతం సాధారణ వీసా లేదా 'ఈ–వీసా'పై భారత్‌లో ఉన్న వారు వెంటనే 011–23978046 హాట్‌లైన్ నంబర్‌లో కానీ, ncov2019@gmail.comకి ఈమెయిల్ చేసి ఆరోగ్య శాఖ అధికారులను సంప్రదించాలని కోరింది. చైనా, సింగపూర్, హాంకాంగ్, థాయిలాండ్ దేశాల నుంచి వస్తున్న ప్రయాణీకుల నుంచి వైరస్ వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తగా హైదరాబాద్ సహా దేశంలోని ఏడు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేశారు. వారిని ఆ ఏరోబ్రిడ్జిల ద్వారా తీసుకెళ్లి స్క్రీనింగ్ చేయాలని నిర్ణయించారు.

**వైరల్ అయిన విషాదం**

కరోనా వైరస్‌తో బాధపడుతున్న తండ్రి ప్రత్యేక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో.. సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతూ వీల్‌చెయిర్‌కే పరిమితమైన అతడి కుమారుడు, ఆహారం అందించి, సాయం చేసే వారు లేని పరిస్థితుల్లో మృత్యువాత పడిన విషాదం చైనాలో చోటు చేసుకుంది. కరోనా లక్షణాలతో బాధపడుతున్న యాన్ షియావోవెన్‌ను జనవరి 22న చికిత్సా కేంద్రానికి తరలించారు. జనవరి 27న అతడికి వైరస్ సోకినట్లు నిర్ధారించారు. ఆయన భార్య కొన్నేళ్ల క్రితం చనిపోయింది. గ్రామంలోని వారి ఇంటివద్ద సెరిబ్రల్ పాల్సీతో బాధపడ్తున్న ఆయన కుమారుడు యాన్ చెంగ్ మాత్రమే ఉన్నాడు. వీల్ చెయిర్‌కే పరిమితమైన చెంగ్ సొంతంగా ఏ పనులు చేసుకోలేడు. ఈ నేపథ్యంలో తన కుమారుడికి సాయం చేయాలని బంధువులను, గ్రామస్తులను కోరుతూ షియావోవెన్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. కానీ అప్పటికే ఆలస్యం అయింది. జనవరి 29న యాన్ చెంగ్ మృతి చెందాడు. ఆయన మృతికి ఇంకా కారణాలు తెలియరాలేదు. అయితే, ఈ ఘటనను హాంగన్ కౌంటీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. స్థానిక కమ్యూనిస్ట్ పార్టీ సెక్రటరీ, మేయర్‌లపై వేటు వేసింది. ఈ విషాద ఘటన చైనాలో వైరల్‌గా మారింది. ఆ తండ్రి సోషల్ మీడియాలో చేసిన పోస్ట్‌కు 27 కోట్ల వ్యూస్ వచ్చాయి.

సాక్షి
బుధవారం, ఫిబ్రవరి, 5

# అనంత్ 'చరిత్ర' పాఠాలు

నలుగురికీ ఆదర్శంగా ఉండాల్సిన రాజకీయ నేతలు తరచుగా కట్టు తప్పుతున్నారు. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అనంత్ కుమార్ హెగ్డే అలాంటివారిలో ఒకరు. పార్టీలో శరవేగంతో ఎదగడానికో...అధినేత దృష్టిలో పడితే ఇప్పుడున్న స్థానాన్ని మించిన అవకాశాలు వస్తాయనో భావించి ఇష్టానుసారం మాట్లాడే నేతలు మనకు నిత్యం తారసపడుతూనే ఉంటారు. కానీ అనంత్‌కుమార్ హెగ్డే ఆ కోవలోకి రారు. ఆయన కొత్తగా రాజకీయాల్లోకొచ్చినవారు కాదు. ఇప్పటికే ఆరుసార్లు ఎంపీగా పనిచేసినవారు. అలాంటి నాయకుడు బాధ్యతాయుతంగా మాట్లాడకపోతే, జవాబుదారీతనంతో వ్యవహరించకపోతే కొత్తగా వచ్చే నాయకులకు, సాధారణ ప్రజానీకానికి తప్పుడు సంకేతాలు పోతాయి. ఆ సంగతి ఆయన గ్రహిస్తున్నట్టు లేరు. ఇంతక్రితం కూడా పలు సందర్భాల్లో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వాటిపై నిరసనలు పెల్లుబికాయి. ఒకసారైతే నోరు జారారనుకోవచ్చు. కానీ పదే పదే అలాంటి వ్యాఖ్యలు చేస్తే వాటి వెనక నిర్దిష్టమైన ఉద్దేశాలున్నాయని, ప్రయోజనాలున్నాయని అనుకోవాల్సివస్తుంది. ఆయన తాజాగా దేశ స్వాతంత్ర్యోద్యమం గురించి మాట్లాడారు. మహాత్మా గాంధీ పేరెత్తకుండా, ఆయన్నుద్దేశించే అంటున్నట్టు అందరికీ అర్థమయ్యేలా నిందాపూర్వకంగా వ్యాఖ్యానించారు.

చరిత్ర గురించి, అది తీసుకున్న మలుపుల గురించి అందరూ ఒకే అభిప్రాయంతో ఉండాలని, ఉంటారని ఆశించలేం. అలాగే స్వాతంత్ర్యోద్యమంపైనా, దాని తీరుతెన్నులపైనా భిన్నాభిప్రాయం ఉండటం తప్పేం కాదు. ఆ ఉద్యమం జోరుగా సాగుతున్న సమయంలోనే షహీద్ భగత్‌సింగ్ వంటి వారికి గాంధీ అవలంబిస్తున్న విధానాలపై అసంతృప్తి ఉండేది. బలప్రయోగంతో ప్రజల స్వాతంత్ర్యేచ్ఛను అణిచివేయాలని చూస్తున్న బ్రిటిష్ పాలకులకు అదే భాషలో బదులీయాలని ఆయన వాదించేవారు. నేతాజీ సుభాస్‌చంద్ర బోస్ సైతం ఇలాంటి అభిప్రాయంతోనే ఇండియన్ నేషనల్ ఆర్మీ(ఐఎన్ఏ)ను స్థాపించి, యువతీయువకులను సమీకరించారు. అయితే హెగ్డే అభ్యంతరం పూర్తిగా వేరు. ఆయన దృష్టిలో స్వాతంత్ర్యోద్యమంలో రెండు రకాలవారున్నారు. ఆయుధాలతో పోరాడినవారు. మేధోశక్తితో అందరినీ ప్రేరేపితుల్ని చేసినవారు. వీరుగాక మరో రకం సమరయోధులున్నారు. ఈ సమరయోధులు బ్రిటిష్ పాలకులతో లాలూచీ పడి ఉద్యమాన్ని నడిపారు. ఈ ఉద్యమ సారథులు దాన్నెలా నడపాలో ఎప్పటికప్పుడు బ్రిటిష్ వారినుంచి సలహాలు తీసుకునేవారు. పాలకులు చెప్పినట్టల్లా చేస్తామన్న అవగాహనతో, సర్దుబాట్లతో ఆ ఉద్యమం సాగింది. తమ ఉద్యమాన్ని గుర్తించి, తమను అరెస్టు చేసి జైలుకు పంపమని ఈ ఉద్యమ సారథులు పాలకులను వేడుకునేవారు. జైళ్లలో తమను జాగ్రత్తగా చూసుకుంటే చాలని కోరేవారు. ఇలాంటి నాయకులపై బ్రిటిష్ పోలీసులు ఒక్కసారి కూడా చేయిచేసుకోలేదు. ఇంతవరకూ ఎవరి గురించి మాట్లాడుతున్నారో స్పష్టత లేకుండా ప్రసంగించిన అనంత్‌కుమార్ ఆ తర్వాత కాస్త స్పష్టతనిచ్చారు. కాంగ్రెస్‌ను సమర్థించేవారంతా ఆమరణ నిరాహార దీక్షల వల్లా, సత్యాగ్రహం వల్లా స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతుంటారని, కానీ అది పూర్తిగా అవాస్తవమని ఆయన తెలిపారు. సత్యాగ్రహం వల్ల బ్రిటిష్ పాలకులు ఈ దేశం వదిలిపోలేదని, వారు నిరాశానిస్పృహలకు లోనై స్వాతంత్ర్యం ప్రకటించారన్నది హెగ్డే అభిప్రాయం. ఇలా స్వాతంత్ర్యోద్యమ చరిత్రనంతా ఏకరువు పెట్టాక, ఈ ఉద్యమం నడిపించినవారు మన దేశంలో మహాత్ములయ్యారని వ్యాఖ్యానించారు. నిజంగా ఈ దేశం కోసం పనిచేసి, పెను మార్పులు తీసుకురావడానికి త్యాగాలు చేసినవారిని చరిత్ర చీకటి కోణాల్లోకి నెట్టేశారని ఆవేదన చెందారు. ఎవరికీ తెలియని ఈ చరిత్రనంతా తాను ఎక్కడ అధ్యయనం చేశారో ఆయన చెప్పలేదు. వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ అధినాయకత్వం ఆదేశించాక తన మాటల్ని మీడియా వక్రీకరించిందని ఆయనంటున్నారు. తాను గాంధీ, నెహ్రూ పేర్లెత్తలేదని చెబుతున్నారు. ఈ దేశంలో స్వాతంత్ర్యం కోసం సత్యాగ్రహ సమరం నడిపిందీ, ఆమరణ దీక్షలు చేసిందీ ఎవరో హెగ్డే చెప్పకపోయి ఉండొచ్చు. అలాగే ఈ ఉద్యమాలు సాగించినవారు మహాత్ములయ్యారన్నప్పుడు కూడా ఆయన ఎవరి పేరూ ప్రస్తావించి ఉండకపోవచ్చు. కానీ స్వాతంత్ర్యోద్యమం గురించి ఎంతో కొంత తెలిసినవారికి కూడా ఎవరినుద్దేశించి ఆయన ఆ మాటలన్నారో సులభంగా తెలుస్తుంది. నిజానికి అలా తెలియాలనే ఆయన అంత వివరంగా, అంత 'స్పష్టంగా' మాట్లాడారు. కాకపోతే పేర్లు నేరుగా వెల్లడించడానికి ఇంకా సమయం రాలేదని అనుకుని ఉండొచ్చు.

'పెదవి దాటని మాటలకు మనం యజమానులం. పెదవి దాటి బయటకు వచ్చిన మాటలకు మాత్రం మనమే బానిసలవుతామ'ని బ్రిటన్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. మహాత్ముణ్ణి గుర్తుకుతెచ్చేంతగా వ్యాఖ్యానించిన హెగ్డే...తమ మేధో శక్తితో అందరినీ ప్రేరేపితుల్ని చేసిన ఆ మహానుభావులెవరో కూడా స్పష్టంగా చెప్పివుండాల్సింది. అప్పట్లో ఈ దేశంలో పెను మార్పులు తీసుకురావడానికి పాటుబడి, చరిత్ర చీకటికోణాల్లో మగ్గిపోయిన వారెవరో కూడా వివరించి ఉండాల్సింది. ఆయన అలా చేసివుంటే ఈ చర్చ మొత్తం వేరుగా ఉండేది. అలాగే తన 'లాలూచీ' ఆరోపణలకు సమర్థనగా బ్రిటిష్ ప్రభుత్వ పత్రాలేమైనా వెల్లడించివుంటే అందరూ సంతోషించేవారు. బీజేపీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ కూడా గత నవంబర్‌లో ఇదేవిధంగా మహాత్మా గాంధీని ఏమనలేదు. కానీ ఆయన్ను పొట్టనబెట్టుకున్న నాథూరాం గాడ్సేను దేశ భక్తుడన్నారు. అప్పుడూ ఇప్పుడూ కూడా బీజేపీ మందలించింది. ఆ వ్యాఖ్యలతో ఏకీభవించడం లేదని చెప్పింది. స్వాతంత్ర్యోద్యమాన్ని పల్చన చేసి, దాని సారథుల్ని కించపరిచి సాధించదల్చుకున్నదేమిటో హెగ్డే చెప్పాలి. తమ పార్టీ వారినుంచే తరచు ఇలాంటి విపరీత వ్యాఖ్యానాలెందుకొస్తున్నాయో బీజేపీ కూడా ఆత్మవిమర్శ చేసుకోవాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి శు.ఏకాదశి సా.5.56 వరకు తదుపరి ద్వాదశి, నక్షత్రం మృగశిర రా.11.05 వరకు తదుపరి ఆరుద్ర, వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ప.11.50 నుంచి 12.36 వరకు, అమృతఘడియలు...ప.2.03 నుంచి 3.44 వరకు, భీష్మ ఏకాదశి.

**సూర్యోదయం :** 6.35
**సూర్యాస్తమయం:** 5.54
**రాహుకాలం :** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు

# వికేంద్రీకరణే ప్రగతికి చుక్కాని

**ఒకటి కంటే ఎక్కువ నగరాలు ఉనికిలో ఉంటున్న రాష్ట్రంలో, పలు రాజధానులు ఉండటం అనే భావన మరింత ప్రభావశీలమైన, అభివృద్ధి వ్యూహంతో కూడుకుని ఉంటుంది. ఎందుకంటే ఇలాంటి రాష్ట్రంలో సరళమైన, నిర్వహణాత్మకమైన అభివృద్ధికి చోటు ఉంటుంది. ఇప్పటికే ఉన్న పలు నగరాల ప్రాదేశిక స్వరూపాన్ని సమతుల్యం చేయడం ద్వారా రాష్ట్ర స్థాయిలో అభివృద్ధి నిర్వహణను కొనసాగించడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం లక్ష్యంగా పెట్టుకుంది. రాజధాని విధులను రాష్ట్రంలోని పలు నగరాల మధ్య పంపిణీ చేయడం అనేది విజయవంతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే రాష్ట్రంలోని ప్రాదేశిక చట్రాల అభివృద్ధి చరిత్రను ప్రత్యేకంగా నిర్మించడం అనే వైఖరిలోనే సంప్రదాయేతర దృక్పథం ఇమిడి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ఈ విశిష్ట ప్రయత్నం ఫలవంతమైతే, పలు ప్రధాన నగరాల అనుసంధానంతో కొనసాగుతున్న ఇతర రాష్ట్రాలకు కూడా భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ ఒక దీపస్తంభంలా దారి చూపుతుంది.**

సంప్రదాయకంగా చూస్తే భారతదేశంలోని రాష్ట్రాలకు చాలావరకు ఒకే నగరంలోనే రాజధాని ఉంటూవచ్చింది. ఒకే నగరంలో రాజధాని ఉండాలా లేక రాజధాని విధులను వివిధ నగరాలకు పంపిణీ చేయాలా అనేది ఒక రాష్ట్రంలో నగరాల అనుసంధానం ఏ రీతిలో అభివృద్ధి చెందింది అనే ప్రాతిపదికపై ఆధారపడి ఉంటుంది. ఈ సందర్భంగా భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో నగరాల ప్రత్యేక నిర్మాణ చట్రం ఎలా పరిణమించిందో తెలుసుకుందాం.

17వ శతాబ్ది తొలి భాగంలో, 18వ శతాబ్ది మలిభాగంలో భారత దేశం వస్తూత్పత్తి కేంద్రాలతో విలసిల్లింది. నాణ్యత, చౌకధర, హస్త నైపుణ్యం కారణంగా నాట భారతీయ చేతి ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా పేరుకెక్కాయి. బ్రిటిష్ వారి రాకతో ఆ వైభవం మొత్తంగా మారిపోయింది. భారతదేశంలోని లోతట్టు ప్రాంతాలనుంచి ముడిసరుకులను సేకరించి ఇంగ్లండుకు పంపి వాటినుంచి తయారు చేసిన సరుకులను అక్కడినుంచి భారత్‌కు పంపడమే బ్రిటిష్ వలసవాదపు ప్రధాన లక్ష్యంగా ఉండేది. వలసవాదపు ఈ ఆర్థిక తర్కం ప్రభావం వల్ల భారతీయ నగరాలు, పట్టణాలు తమను తాము మార్చుకున్నాయి, పునర్నిర్మాణ బాటలో సాగాయి. బ్రిటిష్ పాలనా కాలంలో భారతీయ నగరాల్లో జరిగిన ఈ పునర్వ్యవస్థీకరణ.. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటికి భారత్‌లో ఒక ప్రత్యేక ప్రాదేశిక చట్రాన్ని అనుసరించింది.

ఆనాడు ప్రధానమైన రేవు పట్టణాలతో కూడిన రాష్ట్రాలు (ఉదా. మద్రాసు, బొంబాయి, కలకత్తా) బ్రిటన్‌తో బలమైన అనుసంధానాన్ని కలిగి ఉండేవి. ఢిల్లీ దీనికి మినహాయింపు. ఇది భారత రాజధానిగానే అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఆనాడు రేవు పట్టణాలు రెండు ప్రయోజనాలను నెరవేర్చేవి. ఒకటి ఎగుమతి ప్రాంతాలుగా, ప్రధానంగా ముడిసరుకులను సేకరించి విదేశాలకు (ప్రధానంగా బ్రిటన్) ఎగుమతి చేయడానికి ఇవి ఉపయోగపడేవి. రెండు, ఆ ముడి సరుకుల నుంచి తయారు చేసిన సరుకులను బ్రిటన్‌నుంచి దిగుమతి చేసుకుని వాటిని దేశంలోని మారుమూల ప్రాంతాలకు పంపిణీ చేయడానికి దిగుమతి కేంద్రాలుగా వ్యవహరించేవి. క్రమక్రమంగా ఈ రేవు పట్టణ జనవాసాలు మార్కెట్ కేంద్రాలుగా పరిణమించి తక్కువ విలువ కలిగిన సరుకులను ఉత్పత్తి చేసేవి. లండన్ వంటి విదేశీ మహానగరంతో నిత్యం అనుసంధానంతో ఉండటంతో రేవుపట్టణాల్లో సాగిన నిత్య ఆర్థిక కార్యాచరణ ఫలితమే ఇది.

వ్యూహాత్మక నగరాల స్థాపన–రేవు పట్టణాలను లోతట్టులోని స్థానిక ప్రాంతాలతో అనుసంధించటం– అనేది దాదాపు దేశంలోని అన్ని రాష్ట్రాలలో అభివృద్ధి చెందింది. భారీ స్థాయి ఎగుమతుల కోసం, ప్రాథమిక ఉత్పత్తుల కొనుగోలును సంఘటితం చేయడం, చిన్న చిన్న మార్కెట్లలో పంపిణీ కోసం టోకున వినియోగ సరుకులను కొనుగోలు చేయడం ద్వారా రేవు పట్టణాలను వ్యూహాత్మక పట్టణాలకు అనుసంధానిస్తూ సుదీర్ఘమైన రవాణా లింకులను నిర్మించారు.

దీని ఫలితంగా దేశంలోని అన్ని రాష్ట్రాలూ.. వేరుపడిన అనేక స్థానిక మార్కెట్ల అభివృద్ధికి సాక్షీభూతమై నిలిచాయి. ఈ స్థానిక మార్కెట్లు రవాణా, ప్రాసెసింగ్, నిల్వ, భారీమొత్తంలోని సరుకులను వేరుపర్చడం, రుణ సౌకర్యం వంటివాటికోసం వ్యూహాత్మక పట్టణాలపై ఆధారపడేవి. ఈ స్థానిక మార్కెట్లలో చేతివృత్తుల ఉత్పత్తులు, వ్యవసాయ సరుకులు స్థానికంగానే పంపిణీ అయ్యేవి. ఎగుమతి అయ్యేవి కాదు. ఇక్కడ కూడా బ్రిటిష్ పాలకులు వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల కోసం రవాణా, కమ్యూనికేషన్ సౌకర్యాలు, పాలనా కేంద్రాలు (ఉదా, జిల్లా కేంద్రాలు, తాలుకాలు) నెలకొల్పడం, క్రమబద్ధీకరణ మార్కెట్లను సృష్టించడం వంటి అనుబంధ కార్యకలాపాలను చేపట్టేవారు. ఈ ప్రాదేశిక చట్రం అనేది స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా విస్తృతంగా కొనసాగింది. 1990లలో మాత్రమే సేవల ఔట్ సోర్సింగ్ వల్ల దేశంలోని నాలుగు ప్రధాన కేంద్రాలు– ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై–తోపాటు మొదటిసారిగా హైదరాబాద్, బెంగళూరు కూడా ప్రధాన నగరాల స్థాయికి ఎదిగాయి.



అందుచేత, భారతదేశంలోని రాష్ట్రాలు రెండు రకాల ప్రాదేశిక సంబంధమైన అభివృద్ధి చట్రాలను కలిగి ఉంటున్నాయి. మొదటి రకంలో కొన్ని ప్రధాన నగరాలు తమ చుట్టూ ఉన్న చిన్న పట్టణాలు, గ్రామాలకు సరుకులను, సేవలను అందిస్తూ ఉంటాయి. మొదటి విభాగంలోని కొన్ని రాష్ట్రాలు ఏవంటే– ఉత్తరప్రదేశ్ (కాన్పూర్, అలహాబాద్, వారణాసి, ఆగ్రా, లక్నో. వీటి ఇంగ్లిష్ పేర్లలోని తొలి అక్షరాలను కలిపి వీటిని కావల్ పట్టణాలు KAVAL అని పిలుస్తున్నారు); రాజస్తాన్ (జైపూర్, ఉదయ్‌పూర్); పంజాబ్ (లూథియానా, అమృత్‌సర్); హరియాణా; మధ్యప్రదేశ్ (భోపాల్, ఇండోర్), కేరళ. ఈ ప్రధాన పట్టణాలు వాటి సమీప ప్రాంతాలపై బలమైన ఆర్థిక ప్రభావం కలిగి ఉంటాయి.

ఇక రెండో రకం ప్రాదేశిక చట్రం పూర్తిగా విభిన్నంగా ఉంటోంది. ఈ నిర్మాణంలో అత్యంత ప్రధానమైన నగరం ఉంటుంది దీన్నే ప్రధాన నగర చట్రం అని పిలిచారు. ఈ ప్రధాన నగరం మొత్తం రాష్ట్రంపైన అత్యధిక స్థాయిలో ఆర్థిక ప్రభావం వేస్తూ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా కొనసాగుతూ ఉంటుంది. ఈ విభాగంలోకి తమిళనాడు (చెన్నై), మహారాష్ట్ర (ముంబై), పశ్చిమబెంగాల్ (కోల్‌కతా), ఢిల్లీ జాతీయ రాజధాని వస్తాయి. మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రత్యేకమైనది, అద్వితీయమైనది. రెండు వేర్వేరు ప్రాంతాలు కలిపి ఇది రూపొందింది. నిజాం ప్రాబల్యంలోని కొన్ని భాగాలు, మద్రాస్ ప్రెసిడెన్సీలోని కొన్ని ప్రాంతాలు కలిపి రూపొందిన రాష్ట్రమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్. ప్రాదేశికంగా చూస్తే ఈ రెండు ప్రాంతాలు పూర్తిగా విభిన్నమైనవి. నిజాం పరిధిలోని ప్రాంతంలో ఒకే ప్రధాన నగరం (హైదరాబాద్) ఉంటూండగా, మద్రాస్ ప్రెసిడెన్సీలో అనేక ప్రధాన నగరాల (విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు) నెట్‌వర్క్‌తో ఉంటూ వచ్చింది. 2014లో మునుపటి ఆంధ్రప్రదేశ్‌ను పునర్ వ్యవస్థీకరించిన తర్వాత తెలుగు వారికి మళ్లీ రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. హైదరాబాద్ ప్రధాన నగరంగా ఉంటున్న తెలంగాణ, రెండు మూడు ప్రధాన నగరాల అనుసంధానంతో కూడిన ఆంధ్రప్రదేశ్. ఒకటి కంటే ఎక్కువ నగరాలతో కూడిన రాష్ట్రంలో పలు రాజధానులు ఉండటం అనే భావన మరింత ప్రభావశీలమైన అభివృద్ధి వ్యూహంతో కూడుకుని ఉంటుంది. ఎందుకంటే ఇలాంటి రాష్ట్రంలో నిర్వహణాత్మకమైన అభివృద్ధి వ్యూహానికి చోటు ఉంటుంది.

అభివృద్ధి నిర్వహణకు సంబంధించిన సాంప్రదాయక సాధనాలు ఏవంటే భూమి (ఉపయోగం/భవననిర్మాణ) క్రమబద్ధీకరణలు, అభివృద్ధికి సంబంధించిన సరిహద్దులను నెలకొల్పడం, అద్భుతమైన పన్నుల ప్రభావం వంటివే. రాష్ట్రంలోని పలు నగరాలకు రాజధాని నగరం విధులను పంపిణీ చేయడం అనేది అభివృద్ధి నిర్వహణకు సంబంధించిన నూతన సాధనంగా ఉంటుంది. ఉనికిలో ఉన్న నగరాల ప్రాదేశిక చట్రాన్ని సమతుల్యం చేయడం ద్వారా రాష్ట్ర స్థాయిలో అభివృద్ధి నిర్వహణను కొనసాగించడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం లక్ష్యంగా పెట్టుకుంది. మూడు అంశాలు అంటే ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సమానత్వం అనే వాటి మధ్య సమతూకాన్ని సాధించగలగడానికి అభివృద్ధి నిర్వహణ వ్యూహం తోడ్పడుతుంది.

ప్రత్యేకించి, ఈ సాహసోపేతమైన, నూతన అభివృద్ధి నిర్వహణ వ్యూహం అనేది.. అభివృద్ధి పరిమాణానికి, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల్లో రవాణా, ఇంధనం, నీరు, వ్యర్థాల తొలగింపు, ప్రజాభద్రత, విద్య, ప్రజారోగ్యం తదితర ప్రధాన సేవలను అందించడానికి మధ్యన నిజమైన సమతూకాన్ని సాధించగలుగుతుంది. అంతకు మించి, ఆహార ఉత్పత్తి, నీటి పరిమాణం, నీటి నాణ్యత, గాలి నాణ్యత, మొక్కలు, జంతువుల ఆవాసం వంటి సహజ వ్యవస్థలు సమర్థంగా మనగలగడానికి ఈ నూతన అభివృద్ధి వ్యూహం ఇతోధికంగా తోడ్పడుతుంది. పైగా ఇప్పుడు పర్యావరణం తనకు తానుగా అభివృద్ధి కారకంగా ఉంటోందని మనం గుర్తించి తీరాలి.

రాజధాని నగరంలోని విధులను రాష్ట్రంలోని పలు నగరాల మధ్య పంపిణీ చేయడం అనేది విజయవంతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే రాష్ట్రంలోని ప్రాదేశిక చట్రాల అభివృద్ధి చరిత్రను ప్రత్యేకంగా నిర్మించడం అనే వైఖరిలోనే సంప్రదాయేతర దృక్పథం ఇమిడి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ఈ విశిష్ట ప్రయత్నం విజయవంతమైతే, పలు ప్రధాన నగరాల అనుసంధానంతో కొనసాగుతున్న ఇతర రాష్ట్రాలకు కూడా భవిష్యత్తులో ఏపీ ఒక దీపస్తంభంలా దారి చూపుతుంది.

(ది వైర్ సౌజన్యంతో)

సమీర్ శర్మ, పీహెచ్‌డీ స్కాలర్, అమెరికా:
డీలిట్, కంచి విశ్వవిద్యాలయం

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### అదృష్టం



"ఇప్పుడు నా వయసు 32 ఏళ్లు. ఇప్పటివరకు నాకున్న వారిలో ఎక్కువ మంది హిందూ స్నేహితులే. వాళ్లు లేకుండా మా ఈద్ పండుగ పూర్తికాదు. నేను, నా కొడుకు లేకుండా వాళ్ల దీపావళి పండుగ జరుగదు. రాజకీయ తప్పిదాల గురించి సంకోచం లేకుండా మాట్లాడుకుంటాం. మా మాటల్లో ఒక వెచ్చదనం, ఒక గుర్తింపు ఉండేది. ఇప్పుడు ఈ హిందూ, ముస్లిం వివాదం చాలా చిరాకు తెప్పిస్తోంది. విభజన సందర్భంలో ఘటనలను, రాజకీయాలను చర్చించుకుంటాం. కొన్నిటిపట్ల ఏకీభావం ఉంటుంది, కొన్నిటిపట్ల ఉండదు. ఎవరూ దేనికోసమూ తెగించని సందర్భంలో వాళ్లు నాతో ఉండటం నా అదృష్టం" – సిద్రాహ్, కవయిత్రి

### నవ్వులు



"నిజంగా బాగా అలిసిపోయాం. నిర్భయంగా చిందించిన నవ్వులు, కవిత్వం చదువుకోవడం, సూఫీయిజం, ఉర్దూ నవలలు.. అవన్నీ నాకు తిరిగి కావాలి. ఈ హిందూ, ముస్లిం వివాదం నుంచి బయటపడి గతంలోలా ప్రేమ, ఆహారం, పుస్తకాలు, సినిమాల గురించి మాట్లాడుకోవాలి"

– విర్లింగ్ దర్వేష్, న్యాయవాది

### అనుమతి



"నాకేమీ హిందూ, ముస్లిం అనే భేదాభిప్రాయాలు లేవు. నాకూ చాలామంది స్నేహితులు, పొరుగువారు ఉన్నారు. అంతమాత్రాన నిజం చెప్పడానికి నాకు ఇవేవీ అడ్డంకి కాదు. షహీన్‌బాగ్‌ను ముస్లింలు ఎందుకు దిగ్బంధించారు. వారికి అనుమతి ఎవరు ఇచ్చారు. వారికి సీఏఏ ఏవిధంగా వ్యతిరేకం?"

– ప్రశాంత్ మహాపాత్ర, బీజేపీ కార్యకర్త

### వైరస్



"మన జీవితంలో ఒకానొకప్పుడు అందరికీ హిందూ మిత్రులు ఉండేవారు. అవి అద్భుతమైన రోజులు. బొట్టు పెట్టుకోవడం, పట్టుపావడా కట్టుకోవడం, ముగ్గులేయడం, హోలీ జరుపుకోవడం ముస్లిం అమ్మాయిలకు చాలా సాధారణం. కానీ, ఇస్లామోఫోబియా వైరస్ అందరినీ పాడుచేసేసింది. అధికారం కోసం అర్రులుచాస్తున్నవారికి కృతజ్ఞతలు"

– జైనాబ్ ఖాన్, కార్యకర్త

### ఆశ



"చీకటి రోజులు వెళ్లిపోతాయి. మనం ఎప్పటికీ ఆశను వదులుకోవద్దు. మూడు నెలల క్రితం షహీన్ బాగ్ ఆలోచన ఎవరికైనా వచ్చిందా? ఏడాది క్రితం బీజేపీ ఒక్కొక్క రాష్ట్రం కోల్పోతుందని ఎవరైనా ఊహించారా? ఇరువైపుల నుంచి నష్టం జరగడం విషాదకరం. కానీ, ఆ సందర్భం వెళ్లిపోతుంది. కఠినమైన సందర్భాలే ధాన్యం నుంచి పొట్టును వేరు చేస్తాయి. మన స్నేహితులు పెరుగుతున్న కొద్దీ ఇచ్చిపుచ్చుకోవడం పెరుగుతుంది. మన పిల్లలు కూడా తమ ముందటి తరాలకంటే తెలివైనవారుగా ఎదుగుతారు"

– నమితా జైన్, రచయిత్రి

### కోటి



"పారిశుధ్య కార్మికులు మరణిస్తే కోటి రూపాయలు పరిహారం చెల్లిస్తామని అరవింద్ కేజ్రీవాల్ ఆప్ మేనిఫెస్టోలో పేర్కొనడం అద్భుతం. ఏ నగరంలోనైనా అతి ముఖ్యమైన పని చేస్తున్న వీరికి ఎవరైనా చేయాల్సిన కనీస సహాయం ఇది"

– ప్రీతి శర్మ మీనన్, ఆప్ నేత

## ఇన్‌బాక్స్

### బడ్జెట్‌లో కీలక రంగాలకు ప్రాధాన్యత

ప్రధాని నరేంద్ర మోదీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మొట్టమొదటి బడ్జెట్లో కీలక రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నాన్ని చేశారు, దేశానికి మూల రంగమైన వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ 2022 సంవత్సరం నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే విధంగా చర్యలను చేపట్టారు. గతేడాది ప్రవేశపెట్టిన కిసాన్ సమ్మాన్ నిధి పథకం కొనసాగిస్తూ ఈసారి రూ. 2,83,000 కోట్లను వ్యవసాయ రంగానికి దాని అనుబంధ రంగాలకు కేటాయించారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా దేశంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందివ్వాలనే లక్ష్యంతో ఈసారి బడ్జెట్లో 3.06 లక్షల కోట్ల రూపాయలను కేటాయించారు. ఆరోగ్యం, విద్యుత్, సేవ, రవాణా, బ్యాంకింగ్, మేకిన్ ఇండియా, ఆన్ లైన్ సేవలు తదితర ముఖ్యమైనటువంటి రంగాలకు అధిక నిధులను కేటాయిస్తూ దేశంలో లక్ష గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించాలనే లక్ష్యంతో 'భారత్ నెట్' అనే పథకాన్ని కొత్తగా తీసుకొచ్చారు.

ఈ బడ్జెట్లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. గతేడాదితో పోల్చితే 6 వేల కోట్ల రూపాయలను పెంచుతూ రూ. 99,300 కోట్లను విద్యారంగానికి కేటాయించారు. యూనివర్సిటీలలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం, డిగ్రీలో ఆన్ లైన్ క్లాసులను ప్రవేశపెట్టడం, పరిశోధనలకు అధిక ప్రాధాన్యతనివ్వడం, అంతర్జాతీయ స్థాయిలో మన దేశీయ యూనివర్సిటీలను తీర్చిదిద్దేందుకు ఈ బడ్జెట్లో ప్రణాళికలను ప్రకటించారు. బాలికా విద్యను పటిష్టం చేయడం కోసం భేటీ బచావో– బేటి పడావో పథకానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం కోసం స్కిల్ డెవలప్ మెంట్ పథకం కింద గతంలో కంటే అధికంగా మొత్తంగా మూడు వేల కోట్లు కేటాయించారు.

ఇప్పుడు ఉన్నటువంటి విద్యా వ్యవస్థను సమీక్షించుకుంటూ రాబోవు తరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థను మార్పు చేసే విధంగా నూతన విద్యా విధానాన్ని ఈ బడ్జెట్లో ప్రకటించారు. ఇవన్నీ కూడా విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసే అంశాలే. ఆర్థిక సర్వే తెలిపిన ప్రకారం ఈ సంవత్సరం 6.5 వృద్ధి రేటు కంటే ఎక్కువగా నమోదు అయ్యే విధంగా ఈ బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. మొత్తం మీద ఈ బడ్జెట్ మధ్యతరగతి బడ్జెట్‌గా చెప్పవచ్చు.

– చింత ఎల్లస్వామి, పరిశోధన విద్యార్థి, ఎకనామిక్స్, ఓయూ

# ఎగువ సభ ఎవరికోసం?

సందర్భం



ప్రొ.జి.లక్ష్మణ్

శాసనమండలి నిర్మాణాన్ని, దాని చారిత్రక నేపథ్యాన్ని, ఆశయాలను, అధికారాలను పరిశీలిస్తే అది అసలు అవసరమా అన్న సందేహం ఎవరికైనా కలుగక మానదు. గత ముప్పది సంవత్సరాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే అనేక ఉద్యమాలు, కొత్త సామాజిక శక్తులను తెరపైకి తీసుకొచ్చాయి. ముఖ్యంగా దళిత ఉద్యమాలు స్త్రీవాద, రైతుకూలీ, వెనుకబడిన కులాల పోరాటాలు రాజకీయ ప్రాతినిధ్యం కోరుతున్నాయి. నిర్మాణపరంగా ప్రస్తుతమున్న శాసనమండలి వీరికి ప్రాతినిధ్యం కల్పించలేదు. ప్రస్తుతమున్న కౌన్సిల్ ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు, స్థానిక సంస్థలకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తుంది. షెడ్యూల్డు కులాలు, తెగలవారికి శాసనసభ, లోక్‌సభలలో సముచిత ప్రాతినిధ్యం కల్పించే నిమిత్తం వారికి రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు కల్పించారు. శాసనమండలి విషయంలో అలాంటి రిజర్వేషన్లు ఏవీ లేకపోవడంతో వారికి ఎగువసభలో సముచిత ప్రాతినిధ్యం లభించుటలేదు. మొదటి నుండి ఎగువ సభ ఉన్నత వర్గాలవారికి మాత్రమే అందుబాటులో ఉంది తప్ప దళితులకు, బలహీనవర్గాలకు, మహిళలకు కాదన్నది చారిత్రక సత్యం. రాజ్యాంగం ప్రకారం ఎగువసభ సమాజంలోని వైవిధ్యతకు ప్రాతినిధ్యం కల్పించడానికి ఉద్దేశించింది. మరి ఈ ఆశయం ఏ మేరకు నెరవేరుతున్నట్లు అన్నది ప్రశ్న. ఈ ఆశయం నెరవేరాలంటే చరిత్రలో సుదీర్ఘకాలంపాటు అణచివేతకు, దోపిడీకి గురైన ఎస్.సి, ఎస్.టి, వెనుకబడిన కులాలు మరియు మహిళలకు రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు కల్పించి వారికి మండలిలో స్థానం కల్పించాల్సివుంది. గత 70 సంవత్సరాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే ఆ దిశలో ఎప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టిన ఉదంతాలు లేవు. అలాంటప్పుడు దాని కొనసాగింపు ఎవరికోసం, ఎందుకోసం? అన్నది ప్రశ్న.

ఎగువసభల ఏర్పాటు విషయంలో ఉన్న చారిత్రక నేపథ్యాలలో ఒకటి అక్షరాస్యత తక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఈ సభలను ఏర్పాటుచేసి అందులో సమాజంలో మేధావులుగా గుర్తింపబడ్డ పట్టభద్రులు, ఉపాధ్యాయులతోపాటు సాహిత్యం, కళలు, శాస్త్ర, సాంకేతిక రంగాలు, సాంఘికసేవ మొదలైన రాజకీయేతర రంగాలలో నిష్ణాతులైనవారికి ఇందులో ప్రాతినిధ్యం కల్పిస్తే జాతికి వారి సేవలు ఉపయోగపడతాయని. రాష్ట్ర గవర్నర్ ద్వారా నామనిర్దేశ పద్ధతిలో భర్తీ అయ్యేవారిలో నిష్ణాతులైన అర్హులకు ఏనాడుకూడా అవకాశం లభించలేదు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే పట్టభద్రుల నియోజకవర్గంలో పోటీచేయాలనుకునే అభ్యర్థి పట్టభద్రుడే కానవసరం లేదు. అదేవిధంగా ఉపాధ్యాయుల నియోజకవర్గంలో పోటీచేయాలనుకునే అభ్యర్థి ఉపాధ్యాయుడే కానవసరం లేదు. పోటీకి అందరూ అర్హులే. పోటీకి అర్హులే కానీ వారికి ఓటు హక్కుమాత్రం ఉండదు. ఒక వ్యక్తికి ఓటు హక్కులేకుండా పోటీచేసే హక్కు ఎలా లభిస్తుందో అర్థంకాదు. శాసన నిర్మాణంలో మండలి పాత్ర కేవలం సలహాలివ్వడానికే పరిమితం. ఆ సలహాలను శాసనసభ గౌరవించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. శాసన మండలి తాను ఆమోదించని బిల్లులను చట్టం కాకుండా కేవలం నాలుగు నెలలే జాప్యం చేయగలదు. ఏ బిల్లుకైనా శాసనమండలి ప్రతిపాదించే సవరణలకు సలహాపూర్వకమైన విలువ మాత్రమే ఉంటుంది. ఆర్థిక బిల్లుల విషయంలో ఈ మాత్రం స్వేచ్ఛ, అధికారం కూడా శాసన మండలికి లేదు. అంతేగాక రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనేందుకు కౌన్సిల్ సభ్యులకు కనీసం ఓటు హక్కు కూడా ఉండదు. అలాంటప్పుడు ఎగువ సభ కొనసాగింపు అవసరమా? అన్న సందేహం ఎవరికైనా కలుగక మానదు.

గత 70 సంవత్సరాలలో వివిధ రాష్ట్రాలలో ఉనికిలోవున్న ఎగువసభల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే అవి క్రమంగా ఏ విధంగా రాజకీయ పునరావాస కేంద్రాలుగా పరిణామం చెందినవో మనకు అర్థం అవుతుంది. ఏ అధికారాలు లేని ఈ ఎగువసభల నిర్వహణకు ప్రజాధనం పెద్ద మొత్తంలో దుర్వినియోగం అవుతుంది. క్రమంగా దిగజారుతున్న కౌన్సిల్ ప్రమాణాలను మరియు అది పనిచేస్తున్న తీరుతెన్నులను పరిశీలించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాసనసభ ఆ రాష్ట్రంలోని ఎగువసభ రద్దు విషయంలో తీసుకున్న నిర్ణయం సహేతుకమేకాదు. ముమ్మాటికీ హర్షణీయం.

వ్యాసకర్త ప్రొఫెసర్, ఓయూ
మొబైల్ : 98491 36104

# భీష్ముడు

శీల సంపదలో, కర్తవ్య పాలనలో, ధర్మజ్ఞతలో భీష్మ పితామహుడికి సాటివచ్చే మహనీయుడు మరొకడు కనిపించడు. భీష్మ నిర్యాణం జరిగిన మాఘశుద్ధ అష్టమి తిథి తరువాత వచ్చే మొదటి ఏకాదశి భీష్మ ఏకాదశి (ఫిబ్రవరి 5) ఆ మహాత్ముడి సంస్మరణ సందర్భం. యుద్ధం ముగిసిన వెంటనే తొట్టతొలి కర్తవ్యంగా రాజధర్మాలనూ, సామాన్య ధర్మాలనూ, ధర్మసూక్ష్మాలనూ భీష్ముడి దగ్గర తెలుసుకొని రమ్మని ధర్మరాజుకు శ్రీకృష్ణుడే సలహా ఇస్తాడు. అంపశయ్యమీద బలహీన స్థితిలో ఉండి కూడా ధర్మజుడి ధర్మ సందేహాలన్నీ నివృత్తి చేశాడు భీష్ముడు.

ఆపైన యాభై రోజులు గడిచి, ఉత్తరాయణం వచ్చిన తరువాత, ధర్మరాజు తన బంధుగణం అందరినీ వెంటబెట్టుకొని, మళ్లీ ముత్తాతని కలిశాడు. శ్రీకృష్ణుడి అనుమతి తీసుకొని, భీష్ముడు తన ప్రాణవాయువులను నిరోధించాడు. భీష్ముడు పూర్వజన్మలో దివ్య పురుషులైన అష్ట వసువులలో ఒకడు. ఈ జన్మలో సకలలోక పావని గంగానది ఆయనను కన్నతల్లి. భగవత్స్వరూపుడైన పరశురాముడు ఆయనకు ఆచార్యుడు. కఠోరమైన బ్రహ్మచర్య వ్రతం యావజ్జీవం అనుష్ఠించిన దేవవ్రతుడు ఆయన. వీర మరణం పొందినప్పుడు కూడా నేలను తాకక, అంపశయ్యమీద విశ్రమించాడు.

జ్యోతిర్మయం

'ఈ రోజు ఈ భీష్ముడిని చంపుతాను, నిన్ను రక్షిస్తాను' అని అర్జునుడితో అంటూ, తన మీదికి సింహంలా లంఘిస్తున్న శ్రీకృష్ణుడికి నిర్వికారంగా అంజలి ఘటించి, ఆనందభాష్పాలు రాలుస్తూ 'చంపు స్వామీ!' అంటూ సభక్తికంగా స్వాగతించగలిగిన సత్త్వ సంపన్నుడు. అటు ధర్మశాస్త్రంలోనూ, ఇటు శస్త్రాస్త్ర విద్యలలోనూ ఆరితేరినవాడు.

ఆయన చెప్పిన అన్ని ధర్మాలూ ఆచరించే శక్తి అందరికీ ఉండదని తెలిసి కాబోలు, ఆఖరి మాటగా ఆయన 'ఆనృశంస్యంబును, సత్యంబును నిత్యంబులుగా పాటించి బ్రతుకు'డని సూచించాడు. 'ఆనృశంస్యం' అంటే క్రూరత్వరాహిత్యం. అహింస. ఆ రెండు ధర్మాలనూ అయినంతవరకూ ఆచరించే ప్రయత్నం చేయటం అమర నదీ నందనుడికి సనాతన సంప్రదాయ ప్రేమికులు సమర్పించవలసిన అసలు శ్రద్ధాంజలి.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 5-2-2020



1970 ప్రేమకథ – సినిమా పేజీలో



రవివర్మ బొమ్మల్లా..! – సినిమా పేజీలో



'ద ట్రాన్స్ ఇండియా ఛాలెంజ్' లో భాగంగా మోర్గన్ కారులో హైదరాబాద్ చేరుకున్న అలన్, పాట్ బ్రాత్ వెయిట్ దంపతులు



# క్రేజీ కపుల్ భారత యాత్ర!

**వయసేమో డెబ్బయ్ మూడు.**
**గుండె ఆపరేషన్ జరిగి నెలలు కూడా కాలేదు.**
**ఇంతలోనే... మూడు చక్రాల కారేసుకుని...**
**దేశం కాని దేశమంతా తిరిగేస్తానని**
**ఎవరైనా అంటే మీరేమంటారు?**
**మతిగానీ పోయిందా? అనేస్తాం.**
**ఒకరు కాకుండా ఓ జంట ఇలా బయలుదేరితే..**
**క్రేజీ కపుల్ అనాల్సిందే.**
**వాళ్లే..**
**అలన్ బ్రాత్‌వెయిట్, పాట్ బ్రాత్‌వెయిట్!**

అరవై ఏళ్ల తరువాత జీవితం చివరకు వచ్చేసినట్లే అని భూమికి ఒక దిక్కున ఉన్న వాళ్లు అనుకుంటారు. కానీ మరో దిక్కున ఉన్న వాళ్లకు మాత్రం అప్పుడే అసలైన జీవితం మొదలైనట్లు. ఇందుకు ప్రత్యక్ష తార్కాణం అలన్, పాట్ బ్రాత్ వెయిట్ దంపతులు. బ్రిటన్‌కు చెందిన వీరు నాలుగు రోజుల క్రితం భారత్‌లో ఓ సాహస యాత్ర మొదలుపెట్టారు. సాహసయాత్ర అని ఎందుకు అనాల్సి వస్తుందంటే.. కచ్చితంగా మూడు నెలల క్రితమే ఆలన్‌కు ఓపెన్‌హార్ట్ సర్జరీ జరిగింది. విమానం ఎక్కవచ్చు అని డాక్టర్లు సర్టిఫై చేయడమే తడవు.. రెండేళ్లుగా వీరు చాలా జాగ్రత్తగా, ప్రణాళికా బద్ధంగా సిద్ధం చేసుకున్న 'ద ట్రాన్స్ ఇండియా ఛాలెంజ్' కోసం భారత్‌కు విచ్చేశారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ వీరి సాహస యాత్రకు కావాల్సిన మూడు చక్రాల కారు ముంబైకి చేరుకుంది. మీరు చదివింది కరెక్టే.. ఎప్పుడో 1909లో నిర్మించి.. 2011లో మళ్లీ లాంచ్ చేసిన మూడు చక్రాల 'మోర్గన్' కారులోనే వీరు భారత్ మొత్తం తిరిగేయనున్నారు. ముంబై నుంచి బయలుదేరిన అలన్, పాట్‌లు సోమవారం ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ క్రేజీ కపుల్ తమ సాహస యాత్ర తాలూకూ ఉద్దేశాలు.. వివరాలు వెల్లడించారు.

**మోర్గన్‌ను చూపించాలనే..!**

నిజానికి అలన్, పాట్‌లకు భారత్ కొత్తేమీ కాదు. అలన్ వాళ్ల అమ్మ కర్ణాటకలోని బెల్గామ్‌లో జన్మిస్తే అమ్మమ్మ పుట్టింది మైసూరులో. తాత, అమ్మమ్మల పెళ్లి జరిగింది ముంబైలోనైతే.. అలన్ తల్లిదండ్రులు పెళ్లి చేసుకుంది సిమ్లాలో. అప్పట్లో అలన్ తండ్రి బ్రిటిష్ సివిల్ సర్వీసెస్ అధికారి. ఈ నేపథ్యంలో తాము గతంలో రెండు సార్లు (2013, 2017) ఇండియాకు.. మరీ ముఖ్యంగా బెల్గామ్‌కు వచ్చామని అలన్ తెలిపారు. 2017లో బెల్గామ్ నుంచి కేరళకు వెళుతూండగా.. బెంగళూరుకు చెందిన కొందరు హ్యార్లీ డేవిడ్‌సన్ మోటర్‌బైక్‌లలో ఆయనకు ఎదురయ్యారు. ''ఆ మోటర్ బైక్‌ల చేస్తున్న ధ్వనులు.. నడుపుతున్న వారి ఉత్సాహం చూసిన నాకు.. అకస్మాత్తుగా వీళ్లకు.. బ్రిటన్‌లో తయారైన మోర్గన్ కార్లు చూపించాలి అనిపించింది'' అంటారు అలన్. అలా ఈ ట్రాన్స్ ఇండియా ఛాలెంజ్‌కు బీజం పడిందన్నమాట!

**స్వచ్ఛంద సంస్థ గూంజ్ కోసం**

మోర్గన్ కారులో భారత్‌లో తిరగాలన్న ఆలోచన మొదలైన తరువాత ఈ యాత్రకు ఏదైనా ఒక లక్ష్యం ఉండాలని అలన్ నిర్ణయించుకున్నారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ 'గూంజ్' ఆయన కళ్లల్లో పడింది. నగరాలు వ్యర్థాలుగా పారబోసే వస్తువుల సాయంతో గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు, గ్రామీణులకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించేందుకు కృషి చేస్తున్న 'గూంజ్' కోసం రెండు లక్షల పౌండ్ల (1.86 కోట్ల రూపాయలు) నిధులు సేకరించాలని అలన్, పాట్‌లు నిర్ధారించుకున్నారు. తమ సాహసయాత్రకు సంబంధించిన డాక్యుమెంటరీని తీసి దాన్ని అమెజాన్ ప్రైమ్ వంటి ప్లాట్‌ఫార్మ్‌లకు అమ్మగా వచ్చే డబ్బును గూంజ్‌కు ఇవ్వాలన్నది ప్లాన్. తద్వారా గూంజ్ చేస్తున్న పనుల గురించి భారత్‌తోపాటు ప్రపంచమంతా తెలుస్తుందని.. వాళ్లు తమ కార్యకలాపాలను మరింత విస్తరించవచ్చునని అలన్ తెలిపారు. దీంతోపాటు రాల్ఫ్ లారెన్, మోర్గన్ మోటర్ కంపెనీ, యూకే విదేశీ, కామన్వెల్త్ కార్యాలయాలు కూడా తమ వంతు సాయం చేస్తున్నాయి.

**ఇదీ ప్రస్థానం..!**

భారత్‌లో 34 రోజుల్లో 5600 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలన్నది అలన్, పాట్‌ల ప్రణాళిక. ముంబై నుంచి హైదరాబాద్... అక్కడి నుంచి ఖమ్మం మీదుగా రాజమండ్రి.. ఆ తరువాత విశాఖకు యాత్ర కొనసాగుతుంది. విశాఖ నుంచి కోల్‌కతా.. అక్కడి నుంచి న్యూఢిల్లీ వెళతారు. దేశ రాజధాని నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్ చేరుకుంటారు. అక్కడి నుంచి మహారాష్ట్రలోని పాల్‌గర్ వచ్చి ఆ తరువాత ముంబైకి చేరడంతో యాత్ర ముగుస్తుంది. యాత్రను చిత్రీకరించేందుకు అలన్, పాట్‌ల మోర్గన్ కారును మరి కొన్ని వాహనాలు అనుసరిస్తూంటాయి. నాలుగు రోజుల యాత్ర అనుభవాలేమిటన్న ప్రశ్నకు అలన్ సమాధానమిస్తూ.. ఆగిన ప్రతిచోట జనాలు బోలెడన్ని సెల్ఫీలు తీసుకుంటున్నారని ఈ లెక్కన చూస్తే తన యాత్ర సఫలమైనట్లేనని వ్యాఖ్యానించారు. రహదారులు కొన్నిచోట్ల ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ మొత్తమ్మీద యాత్ర సజావుగానే సాగుతోందని ముక్తాయించారు.

– గిళియార్ గోపాలకృష్ణ మయ్యా

స్వీట్ ఛాలెంజ్



ప్రతీకాత్మక చిత్రం

# చక్కర లేని తియ్యని బంధం

**బినోతా నాద్‌కర్ణి గోవాలో ఆర్కిటెక్టు. ఆమెకు సైక్లింగ్ అంటే ఇష్టం. ఏడాది కిందట ఆమె ఒక చాలెంజ్ చేశారు. ఆ చాలెంజ్‌ను ఈ ఏడాది జనవరి 31వ తేదీతో విజయవంతంగా పూర్తి చేశారు. 'నో షుగర్ చాలెంజ్' అది. ఏడాది పాటు చక్కెరకు దూరంగా గడపడం! వండర్ అనిపిస్తుంది మనకు.**

అయితే చక్కెర తినకుండా ఏడాది పాటు ఉండడం పెద్ద విషయమేమీ కాదని అంటారు బినోతా! స్వీట్లు, చాక్లెట్లు, క్రీమ్ బిస్కెట్లు, ఐస్‌క్రీములను దూరంగా ఉంచడం తనకు ఏ మాత్రం కష్టం కాలేదని చెబుతూ, ''చక్కెర లేని టీ తాగడానికి మాత్రం ఒక వారం రోజుల పాటు కష్టపడ్డాను'' అన్నారు బినోతా. ఆ కష్టం కూడా నాలుక మీదుండే రసన నాడులు (టేస్ట్‌బడ్స్) అలవాటు పడే వరకు మాత్రమేనట. ఛాలెంజ్ తీసుకున్న ఈ ఏడాదిలో నాలుగు కేజీల బరువు తగ్గడంతోపాటు దేహం తేలిగ్గా అనిపించడం కూడా తనను ఉల్లాసంగా ఉంచుతోందని ఆమె అంటున్నారు. ఇంతకీ ఆమె ఈ చాలెంజ్‌ని ఎందుకు తీసుకున్నారో తెలిస్తే మాత్రం మనసు కరిగిపోవడం ఖాయం.

**స్నేహితురాలి కోసం**

యాభై రెండేళ్ల బినోతా నాద్‌కర్ణి స్నేహితురాలు క్యాన్సర్ బారిన పడింది. ట్రీట్‌మెంట్ జరుగుతోంది. చక్కెర ఒక్క పలుకు కూడా తీసుకోకూడదని చెప్పేశారు డాక్టర్లు. క్యాన్సర్ వచ్చిందనే బాధ కంటే చక్కెర తినకూడదన్న మాటకే ఆమె ఎక్కువగా కదిలిపోయింది. తన జీవితంలో తీపి కరువైందని, ఇక ఏ రకంగానూ సంతోషాలు ఉండవని వాపోయింది. స్నేహితురాలికి ధైర్యం చెప్పారు బినోత. ఎంతగానో నచ్చచెప్పారు. క్యాన్సర్ బారిన పడిన బాధలో తన స్నేహితురాలికి ప్రతిదీ కొండంత కష్టంగా అనిపిస్తోందని కూడా అర్థమైంది బినోతకు. ''చక్కెర లేకుండా జీవితం గడపడం కష్టమేమీ కాదు. కావాలంటే చెప్పు, నీ కోసం నేను కూడా చక్కెర మానేస్తాను'' అని ఆ క్షణంలో స్నేహితురాలికి మాటిచ్చారు బినోత. ఇప్పటికీ ఆ మాటకు కట్టుబడే ఉన్నారు. మాటిచ్చి ఏడాది దాటింది. స్నేహితురాలు తన కోసం తన నాలుకను తియ్యదనానికి దూరం చేసుకోవడం ఆమెలో గొప్ప మార్పునే తెచ్చింది. ఆ మార్పు తను కూడా చక్కెరకు దూరం కావడం వరకే పరిమితం కాలేదు. వ్యాధితో పోరాడటానికి మానసికంగా సిద్ధమయ్యేటంతగా ప్రభావితం చేసింది.

**తన స్నేహితురాలి గురించి ఇన్ని సంగతులు చెప్పిన బినోతానాద్‌కర్ణి తన ఫ్రెండ్ పేరు మాత్రం చెప్పడం లేదు. ఆమె గోప్యతను కాపాడడం కూడా స్నేహితురాలిగా నా ధర్మం" అంటారు బినోత.**

తన స్నేహితురాలి గురించి ఇన్ని సంగతులు చెప్పిన బినోతానాద్‌కర్ణి తన ఫ్రెండ్ పేరు మాత్రం చెప్పడం లేదు. ఆ స్నేహితురాలి ఫొటోను ఫేస్‌బుక్ కానీ ఇతరత్రా ఎక్కడా షేర్ చేయడం లేదు. ''అలా చేస్తే ఇక ఆమె ఎక్కడ కనిపించినా ఆమెను క్యాన్సర్ పేషెంట్‌గా చూస్తారు తప్ప, ఎవరూ ఆమెను మామూలు మనిషిగా చూడరు. ఆమె గోప్యతను కాపాడడం కూడా స్నేహితురాలిగా నా ధర్మం'' అంటారు బినోత.

**తల్లికి డయాబెటిస్**

దాదాపుగా ఇదే సమయంలో బినోత తల్లి కూడా డయాబెటిస్ బారిన పడ్డారు. ఆమెది కూడా చక్కెర మానేయాల్సిన అత్యవసర స్థితే. ''మా అమ్మకు కాఫీలో చక్కెర బదులు తేనె, బెల్లం వంటివి వాడడం కూడా ఇష్టం ఉండేది కాదు. 'తీపి లేకుండా నేను తాగుతున్నాను కదమ్మా, అంత కష్టమేమీ కాదు, నువ్వు ఒకసారి ప్రయత్నించు' అని చెప్పగలిగాను. ఇప్పుడు నా స్నేహితురాలికీ, మా అమ్మకు నేనొక వింత, విచిత్రం మాత్రమే కాదు.. మిగతావారికీ పెద్ద ఉదాహరణ కూడా. చక్కెర తినకుండా, ఆహారంలో ఉండే సహజమైన చక్కెరలతోనే దేహంలో షుగర్ లెవెల్స్ సమతూకంగా ఉంచుకోగలిగిన రోల్‌మోడల్‌ని'' అంటూ సైకిల్‌ని పరుగు తీయిస్తారు బినోతా నాద్‌కర్ణి. ఆమె గోవా వీధుల్లో వారంలో ఐదు రోజులు సైకిల్ మీదే కనిపిస్తారు.



బినోతా నాద్‌కర్ణి: కూతుళ్లతో... సైక్లింగ్ చేస్తూ...
స్నేహితురాలి కోసం తల్లి తీసుకున్న ఛాలెంజ్‌ను అభినందిస్తున్న బినోత కూతుళ్లు.

# అడవి బిడ్డలు ధీర వనితలు



నిలువెత్తు బంగారం (బెల్లంతో) తల్లుల దర్శనానికి వచ్చిన మహిళ

**సమ్మక్క, సారలమ్మ.. తల్లీకూతుళ్లు. గిరిజనుల అవస్థలు చూసి చలించిపోయారు. వారి కోసం పోరాడి రణభూమిలోనే ప్రాణాలొదిలారు. సమ్మక్క, సారలమ్మ తమకోసం చేసిన ఆ త్యాగానికి గిరిజనులు గుండెల్లోనే గుడి కట్టారు. వారినే ఆరాధ్య దైవాలుగా భావిస్తూ రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమి (సమ్మక్క పున్నమి) రోజుల్లో మేడారంలో అంగరంగ వైభవంగా జాతర చేస్తున్నారు. కోటి మందికిపైగా భక్తులు వచ్చే.. ఆసియాలోనే అతి పెద్దదైన ఈ గిరిజన వనజాతర ఈ ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు జరుగుతోంది. ఈ సందర్భంగా ఈ ఇద్దరు ధీర వనితల జీవిత విశేషాలు.. సంక్షిప్తంగా.. మీ కోసం.**



మేడారంలో సమ్మక్క తల్లి గద్దె



మేడారంలో సారలమ్మ తల్లి గద్దె

**నేటి నుంచి సమ్మక్క -సారలమ్మ మహాజాతర**

**జన్మ వృత్తాంతం**

సమ్మక్క పుట్టుక వెనుక ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. నేటి కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాంతంలోని 'పొలవాస'ను పాలించే గిరిజన దొర మేడరాజు వేటకు వెళ్లినప్పుడు ఒక పుట్ట మీద కేరింతలు కొడుతూ పాప కనిపించిందట. అలా దొరికిన పాపకే సమ్మక్క అని పేరు పెట్టి పెంచుకున్నారు. మేడరాజు ఆలన, పాలనలో పెరిగిన సమ్మక్క యుక్తవయస్సుకు వచ్చాక ఆయన మేనల్లుడైన మేడారం పాలకుడు, కాకతీయుల సామంతరాజు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్న సంతానం. సారలమ్మకు గోవిందరాజులుతో పెళ్లి జరిగింది.

**జాతర స్థల పురాణం**

మేడారాన్ని ఆక్రమించేందుకు దండెత్తిన కాతీయుల సైన్యాన్ని తిప్పికొట్టేందుకు గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించి పోరాడిన సమ్మక్క.. కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని సైతం ముప్పుతిప్పలు పెడుతుంది. భర్త, కుమారుడు, అల్లుడు, కుమార్తెల మరణవార్త విని కూడా ధైర్యం కోల్పోకుండా ముందుకు సాగుతుంది. శత్రువు వర్గంలో ఒకరు వెనుక నుంచి వచ్చి ఆమెను బల్లెంతో పొడుస్తారు. తన రక్తంతో తడిస్తే ఆ ప్రాంతమంతా కరువు కాటకాలతో నిండిపోతుందనే ఉద్దేశంతో తన గాయానికి కట్టు కట్టుకుని... శత్రువులను హతమార్చుతూ మేడారం సమీపంలో ఉన్న చిలుకలగుట్ట వైపు సాగుతూ మార్గమధ్యంలోనే సమ్మక్క అదృశ్యమౌతుంది. గిరిజనులు సమ్మక్క కోసం అరణ్యమంతా గాలించినా ప్రయోజనం ఉండదు. ఓ పాము పుట్ట దగ్గర పసుపు కుంకుమలున్న ఒక భరిణె కనిపిస్తుంది. గిరిజనులు ఈ భరిణనే సమ్మక్కగా భావించి తమ కోసం ప్రాణాలు అర్పించిన సమ్మక్కను, ఆమె కూతురు సారలమ్మను స్మరించుకుంటూ జాతర చేసుకుంటారు. అలా ఆ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. జాతరకు వచ్చే భక్తులు అక్కడి జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తారు.

**విగ్రహాలు ఉండవు!**

మేడారం గ్రామంలో సమ్మక్క సారలమ్మలకు ఎలాంటి విగ్రహాలూ ఉండవు. గద్దెలు నిర్మించి, వాటికి ఒక కర్ర నాటి ఉంటుంది. వీటిని 'సమ్మక్క, సారలమ్మల గద్దెలు' అంటారు. రెండు గద్దెలలో ఒకదాన్ని సమ్మక్క గద్దెగా, ఇంకో దాన్ని సారలమ్మ గద్దెగా పిలుస్తారు. వీటి మధ్య ఉండే చెట్టు కాండాలనే దేవతామూర్తులుగా కొలుస్తారు. సమ్మక్క సారలమ్మను దర్శించుకునే భక్తులు వనదేవతలకు ఎత్తు బంగారం (బెల్లం) సమర్పించుకుంటారు.

– గడ్డం రాజిరెడ్డి,
సాక్షి ప్రతినిధి, వరంగల్
ఫొటోలు : గుర్రం సంపత్‌గౌడ్




అఖిల్

# మోస్ట్ ఎలిజిబుల్!

ప్రస్తుతం తెలుగు పరిశ్రమలో ఉన్న మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌లో అఖిల్ ఒకరు. ఇప్పుడు 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో చేస్తున్న సినిమాలో కూడా అలాంటి పాత్రనే చేస్తున్నట్లున్నారు. అందుకే ఈ చిత్రానికి 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' అనే టైటిల్‌ను ఖరారు చేసి ఉంటారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే కథా నాయికగా నటిస్తున్నారు. జీఏ2 పిక్చర్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ'వాసు, వాసు వర్మ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ నెల 8న ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదల కానుంది. ఆమని, మురళీ శర్మ, జయప్రకాష్, ప్రగతి, 'సుడిగాలి' సుధీర్, 'గెటప్' శ్రీను, అభయ్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు గోపీసుందర్ సంగీతం అందించారు. ఈ చిత్రం వేసవిలో విడుదల కానుంది


శ్రుతీహాసన్


సమంత


లక్ష్మీ మంచు


రమ్యకృష్ణ

# రవివర్మ బొమ్మల్లా..!

తింటే గారెలే తినాలి.. వింటే భారతమే వినాలి.. బొమ్మ గీయించుకుంటే రవివర్మలాంటి కుంచెతోనే గీయించుకోవాలి. ఆయన కుంచెకి ఉన్న మ్యాజిక్ అది. రాజా రవివర్మ బొమ్మలు సజీవ రూపాల్లా అనిపిస్తాయి. ఇప్పుడు ఆయన గురించి ఎందుకంటే రవివర్మ గీసిన బొమ్మలను పోలినట్లుగా మన సినీ కథానాయికలు ముస్తాబయ్యారు. వాటిని ప్రముఖ ఫొటోగ్రాఫర్ వెంకట్ రామ్ తన కెమెరాలో బంధించారు. కథానాయికలు ఇలా ముస్తాబు కావడం వెనక ఒక మంచి ప్రయోజనం ఉంది. మహిళల కోసం ప్రముఖ నటి సుహాసిని నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ 'నామ్' (మనం) నిధుల సేకరణలో భాగంగా ఈ ఫొటోషూట్ జరిగింది. రమ్యకృష్ణ, ఖుష్బూ, లిజి, శోభన, నదియా, శ్రుతీహాసన్, సమంత, లక్ష్మీ మంచు, ఐశ్వర్యా రాజేష్ తదితరులు 'నామ్' క్యాలెండర్ కోసం జరిగిన ప్రత్యేక ఫొటోషూట్‌లో పాల్గొన్నారు. రవివర్మ గీసిన బొమ్మలకు ప్రతిరూపంలా ఉన్న ఈ ఫొటోలు మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

''అర్థవంతమైన కార్యక్రమం కోసం ఈ ఫొటో షూట్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది'' అని రవివర్మ బొమ్మల్లా మారిన తారలు పేర్కొన్నారు. ఫొటోలు చూసినవారు రవివర్మ మ్యాజిక్ రిపీట్ అయిందని అభినందిస్తున్నారు.

● ఇన్‌సెట్‌లో ఉన్న చిత్రాలు రవివర్మ గీసినవి


లిజి

# గౌరవం లేని చోట పని చేయలేను

శివ కందుకూరి హీరోగా శేష సింధు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చూసీ చూడంగానే'. ఈ చిత్రంలో వర్ష బొల్లమ్మ, మాళవిక హీరోయిన్లుగా నటించారు. రాజ్ కందుకూరి నిర్మించిన ఈ చిత్రం గత నెల 31న విడుదలైంది. తమ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని చెబుతున్నారు దర్శకురాలు శేష సింధు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో శేష మాట్లాడుతూ– ''నేను దుబాయ్‌లో పుట్టాను. హైదరాబాద్‌లో పెరిగాను. చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే చాలా ఇష్టం. క్రిష్, సుకుమార్ వంటి దర్శకుల వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశాను. కేవలం దర్శకత్వ విభాగంలోనే కాదు నాకు కెమెరా, కాస్ట్యూమ్, రైటింగ్ విభాగాల్లోనూ ప్రావీణ్యం ఉంది. దర్శకురాలిగా నా తొలి సినిమా 'చూసీ చూడంగానే'కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడం సంతోషాన్నిచ్చింది. ముఖ్యంగా సినిమాలోని శృతీ, ఐశ్వర్య పాత్రలకు అమ్మాయిలు బాగా కనెక్ట్ అయ్యారు. తమ లైఫ్‌లో నుంచి వెళ్లిపోయిన అబ్బాయిలు తిరిగి వచ్చాక అమ్మాయిలు తప్పక వారిని టెస్ట్ చేస్తారు. అదే ఈ సినిమాలో చూపించాం. కుటుంబ ప్రేక్షకులను కూడా ఈ చిత్రం మెప్పిస్తోంది. శివ కందుకూరి బాగా నటించాడు. ఈ సినిమా కథను కొంత మందికి వినిపించాను. అమ్మాయి కదా హ్యాండిల్ చేయగలదా? అని కొందరు అంటే... అమ్మాయిలైతే చెప్పిన మాట వింటారని అన్నవారూ లేకపోలేదు. రాజ్ కందుకూరి గారు ఇలాంటి ప్రశ్నలు అడగకుండా దర్శకురాలిగా చాన్స్ ఇచ్చారు. నాకైతే గౌరవం లేని చోట పని చేయడం ఇష్టం ఉండదు. మా ఇద్దరు సిస్టర్స్ కూడా సినిమా ఇండస్ట్రీలోనే ఉన్నారు. ఇండస్ట్రీలో నేను ఇబ్బందిపడే సందర్భాలు ఎదురు కాలేదు. కానీ కొందరు వారికి ఎదురైన కొన్ని ఇబ్బందికర సంఘటనలను చెప్పారు'' అని అన్నారు.


శేష సింధు


ఖుష్బూ


ఐశ్వర్యా రాజేశ్


నదియా


శోభన

# ప్రియమైన మిత్రులారా.. శత్రువులారా...

''మీరు నా పట్ల చూపించిన ప్రేమ, శ్రద్ధకు ధన్యవాదాలు.. నాకేం కాలేదు. బాగున్నాను'' అంటూ సీనియర్ నటుడు రిషీ కపూర్ తన ట్వీటర్‌లో పేర్కొన్నారు. విషయం ఏంటంటే.. స్వల్ప అనారోగ్యంతో రిషి ఆస్పత్రిలో చేరారు. అంతే.. ఆయనకేదో అయిందంటూ వార్తలు మొదలయ్యాయి. ఈ వార్తకు ఫుల్‌స్టాప్ పెట్టాలనుకున్నారు రిషి. ''ప్రియమైన మిత్రులారా.. శత్రువులారా.. ట్వీటర్‌లో నన్ను ఫాలో అవుతున్న అభిమానుల్లారా నా ఆరోగ్యం గురించి మీరు చూపించిన శ్రద్ధకు ధన్యవాదాలు. 18 రోజులుగా ఢిల్లీలో షూటింగ్ చేస్తున్నాను. పొల్యూషన్ వల్ల ఇన్‌ఫెక్షన్ బారిన పడ్డాను. అందుకని ఆస్పత్రిలో చేరాను. అంతకు మించి వేరే ఏమీ లేదు. నేను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి, ముంబై వచ్చేశాను. చాలామంది అల్లిన కథలకు ముగింపు ఇస్తున్నాను. ముంబైలో హాయిగా ఉన్నాను'' అని పేర్కొన్నారు రిషీ కపూర్. ప్రస్తుతం ఆయన 'షర్మాజీ నమ్‌కీన్' అనే సినిమాలో నటిస్తున్నారు.


రిషీ కపూర్


అమలాపాల్

# 1970 ప్రేమకథ

హిందీ భాషపై పట్టు సాధించే ప్రయత్నాలను మొదలుపెట్టారు హీరోయిన్ అమలాపాల్. ఎందుకంటే తొలిసారి ఆమె హిందీ డైలాగ్స్ చెప్పబోతున్నారు. కానీ సినిమాలో కాదు.. వెబ్ సిరీస్ కోసం. 'చిచోరే' ఫేమ్ తాహిర్ రాజ్ బాసిన్, అమృత ఇందులో కీలక పాత్రధారులు. పుష్పదీప్ భరద్వాజ్ ఈ వెబ్ సిరీస్‌ను డైరెక్ట్ చేస్తారు. బాలీవుడ్ ప్రముఖ దర్శక–నిర్మాత, రచయిత మహేశ్‌భట్ ప్రొడక్షన్‌లో ఈ వెబ్ సిరీస్ రూపుదిద్దుకోనుంది. 1970లో పెద్ద ఫిల్మ్ మేకర్ కావాలనుకున్న ఓ యువకుడు, ఓ అగ్ర హీరోయిన్ మధ్య కొనసాగిన రిలేషన్‌షిప్ ఆధారంగా ఈ వెబ్ సిరీస్ ఉంటుందని సమాచారం. దివంగత నటి పర్వీన్ బాబీ జీవితం నేపథ్యంలో అమలా పాల్ పాత్రను డిజైన్ చేశారట. ''1970 బ్యాక్‌డ్రాప్‌లోని ఓ బాలీవుడ్ లవ్‌స్టోరీ నేపథ్యం ఉన్న కథాంశంలో నటించబోతున్నాను. నా బాలీవుడ్ అండ్ డిజిటల్ ఎంట్రీ ఇవ్వడానికి ఇంతకన్నా నాకు ఏం కావాలి'' అన్నారు అమలాపాల్.


శేఖర్ కమ్ముల, నాగచైతన్య

**దర్శకుడు శేఖర్ కమ్ముల బర్త్‌డే వేడుక 'లవ్ స్టోరీ' సినిమా లొకేషన్‌లో మంగళవారం జరిగింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి, నిర్మాత సునీల్ నారంగ్‌లతో పాటు భరత్ నారంగ్, డిస్ట్రిబ్యూటర్ అభిషేక్ నామా శేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎమిగోస్ క్రియేషన్స్, సోనాలి నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై నారాయణ్ దాస్ కె. నారంగ్, పి. రామ్మోహన్‌రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సహనిర్మాత: భాస్కర్ కటకంశెట్టి.**

# నేనూ అక్కణ్ణుంచే వచ్చా - నందు

''ఫిలింనగర్‌లో సెటిల్ అవనీకి నేపథ్యం ముఖ్యం కాదు.. కథ ముఖ్యం. కార్తికేయ, విశ్వక్ సేన్‌లు అలాంటి కంటెంట్‌తో దిల్‌సుఖ్‌నగర్ నుంచి వచ్చారు. నేనూ అక్కణ్ణుంచే వచ్చా'' అన్నారు నందు. నూతన దర్శకుడు సాహిత్ మోత్కూరి తెరకెక్కించిన చిత్రం 'సవారి'. నందు, ప్రియాంకా శర్మ జంటగా నటించారు. కాల్వ నరసింహస్వామి ప్రొడక్షన్స్ పతాకంపై సంతోష్ మోత్కూరి, నిషాంక్ రెడ్డి కుడితి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో సినిమా బిగ్ టికెట్‌ను హీరోలు కార్తికేయ, విశ్వక్ సేన్ విడుదల చేసి, రూ. 10 వేలకు టికెట్లను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ– ''అర్హుడైన యాక్టర్‌కు ఒక మంచి కథ కుదరాలి.. 'సవారి'తో నాకు 100 శాతం మంచి కథ కుదిరిందని పక్కాగా చెబుతున్నా. సాహిత్ నాకు దేవుని లెక్క. కంటెంట్ బాగుంటే ఇండస్ట్రీ సపోర్ట్ చేస్తుందని మా సినిమా ట్రైలర్ నిరూపించింది'' అన్నారు. ''శేఖర్ చంద్ర చాలా మంచి సంగీతం ఇచ్చారు. నందు నటనకు నేను షాకై చాలాసార్లు క్లాప్స్ కొట్టాను'' అన్నారు సాహిత్ మోత్కూరి. చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర, ప్రియాంకా శర్మ, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, రాజ్ కందుకూరి, శరత్ మరార్, నటుడు, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, గేయ రచయిత కాసర్ల శ్యామ్, గాయకులు రాహుల్ సిప్లిగంజ్ తదితరులు మాట్లాడారు.


ప్రియాంకా శర్మ, కార్తికేయ, నందు, విశ్వక్ సేన్, సాహిత్ మోత్కూరి

# హవా సింగ్

బాక్సర్‌గా రింగ్‌లో పంచ్‌లు ఇవ్వడానికి ఫుల్‌గా పాలు తెగి రెడీ అవుతున్నారు బాలీవుడ్ యువ హీరో సూరజ్ పంచోలి. ఇదంతా సూరజ్ హీరోగా నటించనున్న తాజా చిత్రం 'హవా సింగ్' కోసమే. ప్రకాష్ నంబియార్ దర్శకత్వంలో కమ్‌లేష్ సింగ్, సామ్స్ ఫెర్నాండెజ్ నిర్మించనున్న ఈ చిత్రం త్వరలో ప్రారంభం కానుంది. 'హవా సింగ్' సినిమా ఫస్ట్ లుక్‌ను బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ విడుదల చేశారు. 2015లో సల్మాన్ ఓ నిర్మాతగా వ్యవహరించిన హిందీ చిత్రం 'హీరో'తోనే సూరజ్ సినీ ప్రస్థానం మొదలైన సంగతి తెలిసిందే. ఇక.. హవా సింగ్ విషయానికి వస్తే.. ఆయన హర్యానాకి చెందిన బాక్సర్. ఇండియన్ హెవీ వెయిట్ బాక్సర్‌గా ఆసియన్ గేమ్స్ (1966, 1970)లో గోల్డ్ మెడల్స్ సాధించారు. అంతేకాదు.. హెవీ వెయిట్ క్యాటగిరీలో పదకొండుసార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచి రికార్డు సృష్టించారు. ''హవా సింగ్' బయోపిక్‌లో నటించడం హ్యాపీగా ఉంది'' అన్నారు సూరజ్.


సూరజ్ పంచోలి

# ఆ వ్యత్యాసం తెలిసింది


'గెటప్' శ్రీను

''జబర్దస్త్'లో ఏడేళ్లుగా సుధీర్, రాంప్రసాద్, నేను కలిసి ఉన్నాం. మేం ముగ్గురం కలిసి '3 మంకీస్' సినిమాలో నటించడం గొప్ప అనుభూతి. అయితే మేం ముగ్గురం రాఘవేంద్ర రావుగారి 'ఓం నమో వెంకటేశాయ'లో మొదటిసారి ఒకే ఫ్రేమ్‌లో కనిపించాం'' అని 'గెటప్' శ్రీను అన్నారు. 'జబర్దస్త్' ఫేమ్ 'సుడిగాలి' సుధీర్, 'గెటప్' శ్రీను, రాంప్రసాద్ ప్రధాన పాత్రల్లో అనిల్ కుమార్.జి దర్శకత్వంలో తెరకెక్కిన '3 మంకీస్' ఈ నెల 7న రిలీజవుతోంది. 'గెటప్' శ్రీను మాట్లాడుతూ– ''ముగ్గురు మిత్రులు ఒక సమస్యలో చిక్కుకుంటారు. దాన్నుంచి ఎలా బయటపడ్డారు? అనేది మా సినిమా కథ. ఫస్టాఫ్ వినోదం, సెకండాఫ్ సీరియస్‌గా ఉంటుంది. టీవీ కామెడీ వేరు. సినిమా కామెడీ వేరు. ఈ సినిమా చేస్తున్నప్పుడు ఆ వ్యత్యాసం తెలిసింది. మంచి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎదగాలన్నదే నా కోరిక. ప్రస్తుతం 'ఫైటర్', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', బెల్లంకొండ సాయిశ్రీనివాస్ సినిమాలో నటిస్తున్నాను'' అన్నారు.

# ఇది ఒకటో భాగం మాత్రమే

వరుణ్, దివ్యారావు జంటగా నరసింహా నంది స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'డిగ్రీ కాలేజ్'. ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ–రిలీజ్ వేడుకలో నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''నరసింహా నంది కంటెంట్ ఉన్న సినిమాలను తీస్తాడు. బాపిరాజు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాడంటే ఈ సినిమా తప్పక విజయం సాధిస్తుంది'' అన్నారు. ''సినిమాలో మోతాదుకు మించిన రొమాంటిక్ సీన్స్ ఉన్నా మంచి కంటెంట్ కూడా ఉంది. ఈ చితాన్ని 105 రోజులు షూట్ చేశాం. 16గంటల రన్నింగ్ ఉంటే 8 గంటలకు తగ్గించాం. ఫైనల్‌గా రెండున్నర గంటలకు తగ్గించాం. ఇది 1వ భాగం మాత్రమే'' అన్నారు నరసింహా నంది. కాంగ్రెస్ నేత పొన్నాల లక్ష్మయ్య, దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు, చిత్ర సహనిర్మాత ఆలేటి శ్రీనివాసరావు, హీరో హీరోయిన్ వరుణ్, దివ్యారావు పాల్గొన్నారు.


దివ్యారావు, వరుణ్



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం
5-2-2020

రామదాసు ఆరాధనోత్సవాలు

# కంటి నేడు మా రాముని



ఫిబ్రవరి 2-3 తేదీలలో భద్రాచలంలో జరిగిన రామదాసు ఆరాధనోత్సవాలలో కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం.

శ్రీరామచంద్రుని గుణగణాలను కీర్తనల రూపంలో ఎంతో చక్కగా వర్ణించి చెప్పాడు రామదాసుగా పరిచితుడైన కంచర్ల గోపన్న. నేటికీ తెలుగు వారి గుండెలలో పదిలంగా ఉన్నాడు రామదాసు. అంతటి ఘనకీర్తి కల రామదాసుకు తగినంత ఆదరణ, గౌరవం దక్కడం లేదని భావించారు ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు నేదునూరి కృష్ణమూర్తి. రామదాసుని అందరికీ మరింత చేరువ చేయాలనే



నేదునూరి కృష్ణమూర్తి

మల్లాది రవి ఈ బాధ్యతను తమ భుజాల మీదకు ఎత్తుకున్నారు. ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ తదియ నుంచి ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుతున్నారు.

సామ గానలహరి కల్చరల్ ఆర్గనైజేషన్, నేంద్రగంటి కృష్ణమోహన్ గారి అలమేలుమంగ ట్రస్ట్ (శ్రీచక్ర సిమెంట్స్ ట్రస్టు) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. 'గతంలో ఇంటింటా రామదాసు కీర్తనలను

త్యాగరాజ పంచరత్న కీర్తనలు, సప్తగిరుల సంగీత రత్నాల విధంగానే రామదాసు 'నవ రత్నాలు' అని తొమ్మిది కీర్తనలు పాడుతున్నాం.

కీర్తన – రాగం

1. అదిగో భద్రాద్రి – వరాళి
2. శ్రీరామనామమే – అఠాణా
3. పలుకే బంగారం – ఆనంద భైరవి
4. శ్రీరాముల దివ్యనామం – సావేరి
5. రామ జోగిమందు – ఖమాస్
6. తారక మంత్రము ధన్యాసి
7. హరి హరి రామా – కానడ
8. తక్కువేమి మనకు – సౌరాష్ట్ర
9. కంటి నేడు మా రాముని – నాదనామక్రియ

వీటిని అందరూ కలిసి పాడుకునేలా భజన సంప్రదాయంలో రూపొందించారు గురువుగారు. భద్రాచలంలోని రామాలయానికి పక్కనే, 600 మంది కూర్చుని ఒకేసారి గానం చేయడానికి అనువుగా ఉన్న చిత్రకూట మండపంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. కార్యక్రమానికి విచ్చేసిన వారికి, లక్షలాది రూపాయలు వెచ్చించి మరీ భోజన, వసతి సౌకర్యాలను నేంద్రగంటి కృష్ణ మోహన్ స్వయంగా ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పంచమి నుంచి నవమి వరకు జరుగుతున్న ఈ ఉత్సవాలలో, భజన సంప్రదాయానికి పితామహుడైన రామదాసు విరచిత 'రామ భద్రా రారా' అంటూ ముందుగా స్మరిస్తారు. మొదటి రోజున విద్వాంసులు, సామాన్యులు అందరూ గోష్ఠిగా పాడతారు. ఇందులో భాగంగా మా తండ్రిగారు మల్లాది సూరిబాబు... కంచర్ల గోపన్న రచించిన 'దాశరథీ శతకం' నుంచి మూడు పద్యాలను రాగయుక్తంగా పాడతారు. మిగిలిన నాలుగు రోజులు సంగీత కళాకారులందరికీ తలో అరగంట సమయం కేటాయిస్తారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో నివసించే భారతీయులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. 2007 ఫిబ్రవరి మాసంలో రామదాసు జన్మదినం పురస్కరించుకుని ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ పదమూడేళ్లుగా ఎటువంటి ఆటంకం లేకుండా విజయవంతంగా జరుగుతున్నాయి. తెల్లవారుజామున గోదావరి ఒడ్డున రామదాసు విగ్రహం ఎదుట నిలబడి రెండు కీర్తనలు గానం చేసి, అక్కడ నుంచి నుంచి నగర సంకీర్తన ప్రారంభిస్తారు.

– మల్లాది బ్రదర్స్

సంకల్పంతో 2007 సంవత్సరంలో భక్త రామదాసు ఆరాధనోత్సవాలకు రూపకల్పన చేశారు. స్వయంగా 108 సంకీర్తనలను స్వరపరచగా, వారి శిష్యులైన మల్లాది సూరిబాబు 58 సంకీర్తనలను స్వరపరిచారు. నేదునూరి కృష్ణమూర్తి కన్నుమూసిన దగ్గర నుంచి మల్లాది సూరిబాబు.. వారి కుమారులు మల్లాది ప్రసాద్, భజనలుగా పాడుకునేవారు. వాటికి పునర్వైభవం కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపు దిద్దుకుంది. ఈ కీర్తనలను మరింత విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురావటానికే ఈ ప్రయత్నం జరుగుతోంది' అంటారు మల్లాది సోదరులు మల్లాది ప్రసాద్, మల్లాది రవి కుమార్.

– సంభాషణ: వైజయంతి పురాణపండ

సినీ పరివారం

అమ్మ పాడిన పాట

# కాశీకి పోయాను రామా హరీ!



స్వర్ణలత, గాయని



**'కాశీకి పోయాను రామా హరీ! గంగ తీర్థము తెచ్చాను రామాహరీ!' ఇప్పటికీ రేడియోలో వినిపించే పాట. 'డివ్వీ డివ్వీ డివ్విట్టం నువ్వంటేనే నాకిట్టం' ఎప్పుడు విన్నా సరదాగానే ఉంటుంది. ఇవేనా... 'ఓ పంచ వన్నెల చిలుకా...', ' రాయబారమంపవే తడికో తడికో', 'రంజు భలే రాం చిలక' ఈ పాటలన్నీ తెలుగు సినీ స్వర్ణయుగపు ఆనవాళ్లు... మైలురాళ్లు. వీటిని పాడిన స్వర్ణలత, హాస్య గీతాల స్వర్ణలతగా ప్రసిద్ధి చెందారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో అసంఖ్యాక పాటలు పాడిన మెడతాటి స్వర్ణలత ఆఖరి కుమారుడు అనిల్‌రాజ్ తల్లిని స్మరిస్తూ ఎన్నో వివరాలు తెలిపారు.**

అమ్మకు మేం మొత్తం తొమ్మిది మంది పిల్లలం. ఆరుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు. మా చెల్లి అనారోగ్యంతో మరణించింది. నలుగురు అన్నయ్యలు, ఒక అక్క అమెరికాలో డాక్టర్లుగా పని చేస్తున్నారు. నేను డాన్స్ మాస్టర్‌గా పని చేస్తున్నాను. అన్నయ్య ఆనంద్ రాజ్ సినిమాలలో నటిస్తున్నారు. ఒక అక్క హైదరాబాద్‌లో ఉంటున్నారు. అందరి కంటె చిన్నవాడిని కావటం వల్ల అమ్మతో చనువుగా ఉండేవాడిని. మాకు అమ్మే స్వయంగా వంట చేసి పెట్టేది.

**అమ్మ గురించి...**

అమ్మ అసలు పేరు మహాలక్ష్మి. కర్నూలు జిల్లా చాగలమర్రిలో పుట్టింది. చదువుకునే రోజుల్లో (ఎస్ఎస్ఎల్‌సి వరకు చదువుకున్నారు) నాటకాలు వేసేది. చిన్నతనంలో కొన్ని సినిమాలలో నటించింది. ఆలిండియా రేడియోలో లలిత గీతాలు పాడేది. అమ్మ పాడిన ఒక హిందీ పాట విన్న షోలాపూర్ రాజు అమ్మను ఆహ్వానించి స్వయంగా బంగారు కంకణం తొడిగారు. అమ్మ వాళ్ల ఇంటి దగ్గరే డా.అమర్‌నాథ్ అనే సివిల్ సర్జన్ ఉండేవారు. ఆయన అమ్మను ఇష్టపడటంతో 1955లో వారి ప్రేమ పరిణయంగా మారింది. ముప్పై సినిమాలలో నటించాక, నాన్నకు ఇష్టం లేకపోవటంతో నటన మానేసి, పాటలకే పరిమితమైపోయింది.

**అమ్మ పేరును ఆయనే మార్చారు..**

కస్తూరి శివరావుతో కలిసి మొట్టమొదటగా 'మాయారంభ' సినిమాలో 'రాత్రనక పగలనక' పాట పాడినప్పుడు అమ్మ పేరును మహాలక్ష్మి నుంచి 'బాలస్వర్ణలత'గా మార్చారు. కామెడీ పాటలు ఎక్కువగా పాడి, తిరుగు లేని హాస్య గాయనిగా నిలబడింది అమ్మ. వందలాది పాటలు పాడింది. నాకు చదువు మీద కంటె డాన్స్ మీదే శ్రద్ధ ఉండటంతో, సలీమ్ మాస్టర్ దగ్గర చేర్పించింది. నాలుగో తరగతి చదువుతున్నప్పుడే అమ్మ దగ్గర నాట్యం ప్రారంభించాను. ఆ తల్లి కడుపున పుట్టటం నా అదృష్టం.

**పేరుకి తగ్గట్టుగానే..**

అమ్మ ఏడు వారాల నగలు వేసుకునేది. ఆవిడ బంగారం చూసే ఆవిడకు స్వర్ణలత అని పేరు పెట్టారేమో అనిపించేంత బంగారం ఉండేది. మమ్మల్ని బంగారం కంటె ఎక్కువగా చూసుకునేది. నాకు పప్పు చారు, కూరగాయల పులావు అంటే ఇష్టం. అద్భుతంగా చేసేది. ఘంటసాల గారి భార్య సావిత్రమ్మ గారి కోరిక మీద ఒకసారి వాళ్ల ఇంటికి వెళ్లి వండి పెట్టింది. 'పాటలోనే కాదు, ఆమె చేసిన కూరగాయల పలావులో కూడా మాధుర్యం ఉంది' అన్నారట ఘంటసాల. సంగీత దర్శకులు మాస్టర్ వేణు గారి అబ్బాయి భానుచందర్ అన్నం తినకుండా, నిద్రపోకుండా ఏడుస్తుంటే, అమ్మే పాట పాడుతూ, పెరుగన్నం తినిపిస్తూ నిద్రబుచ్చేదని భానుచందర్ చెబుతుంటే, నాకు చాలా ఆనందంగా ఉంటుంది.

**పుట్టినరోజుకి...**

ఆగస్టు 15న నా పుట్టినరోజున అమ్మ చాలా గొప్పగా జరిపేది. సేమ్యా పాయసం కాని, లడ్డు కాని చేసి పెట్టేది. పండుగలు వస్తే, తప్పనిసరిగా అరిసెలు చేసి పెట్టేది. అమ్మ చనిపోయేవరకు, ప్రతి పుట్టినరోజుకి నన్ను బట్టల షాపుకి తీసుకువెళ్లి, బట్టలతో పాటు, బంగారం కూడా కొనిపెట్టేది. ఆవిడ ఏది ఇస్తే అదే తీసుకునేవాడిని. అప్పట్లో అమ్మకు పాటకు 300 రూపాయలు పారితోషికం ఇచ్చేవారు. అందులో పది రూపాయలు పేదలకు ఇచ్చేది. 'నేను ఉన్నా లేకపోయినా, పేదవారికి సహాయం చేయాలి' అని అమ్మ చెప్పిన మాటలను నేటికీ అమలు పరుస్తున్నాను. అవన్నీ గుర్తు చేసుకుంటుంటే నా గొంతు దుఃఖంతో మూగబోతుంది.

**రాయలసీమ పులి బిడ్డ**

చాగలమర్రిలో జరిగే పీర్ల పండుగకు కావలసిన వస్తువులన్నీ అమ్మే కొని కమిటీ వారికి ఇచ్చేది. సంక్రాంతి పండుగకు అందరం అమ్మమ్మ దగ్గరకు వెళ్లేవాళ్లం. అమ్మ రాయలసీమ పులిబిడ్డ. ఆవిడ కోడి పందాలు ఆడేది. 'నేను ఒకరికి పెట్టాలే కాని, ఒకరి దగ్గర చేయి చాచకూడదు' అనేది. ఆవిడకు రోషం ఎక్కువ. 'ఎవరు మోసం చేసినా, మనం ఎవ్వరినీ మోసం చేయకూడదు, అందరికీ మంచి చేయాలి' అని చెప్పేది. పేరుకు తగ్గట్టుగానే బంగారమైన మనసు అమ్మది. ఆమెకు కుక్కలంటే చాలా ఇష్టం. పది కుక్కలు పెంచేది.

**ఆయన ప్రోత్సాహంతో...**

'సత్యహరిశ్చంద్ర' చిత్రంలోని 'ఆడ నీవు ఈడ నేను' పాటతో కలిపి మొత్తం 70 పాటలను హెచ్ఎంవి వారితో 2017లో సీడీగా చేయించి, వారి దగ్గరే 3000 క్యాసెట్లు కొని సినీ ప్రముఖులకి, అమ్మ అభిమానులకీ ఉచితంగా ఇచ్చాను. 'అందరికీ అమ్మ గురించి తెలియాలంటే, ఖర్చయినా పరవా లేదు, సీడీలు చేయించు' అని ప్రముఖ నటులు రావికొండలరావు గారు చెప్పటంతో ఈ పని చేశాను. అమ్మ పాటల సీడీ బాలమురళిగారికి అందచేయటానికి వెళ్లినప్పుడు, 'మీ అమ్మ పెద్ద సంగీత విద్వాంసురాలు, నాతో కూడా పాడింది' అన్నారు. అమ్మ పాటలు విన్న నారాయణరెడ్డి గారు 'తల్లిని ప్రేమిస్తున్న నిన్ను చూస్తే ఆనందంగా ఉంది' అంటూ 50 వేల రూపాయలు చెక్కు అందించారు. అమ్మ పాడిన తమిళ, కన్నడ పాటలను డెబ్బై చొప్పున రెండు సీడీలు చేస్తున్నాను. మా అమ్మ నాకు ఇచ్చిన ఎనిమిది ఎకరాల పొలం, బంగారం, సౌకర్యాలతో నా జీవితం ఇబ్బందులు లేకుండా ఉంది.

**కొరియోగ్రాఫర్‌గా**

'చిల్లరకొట్టు చిట్టెమ్మ' చిత్రంలో మాడా గారితో కలిసి డాన్స్ చేశాను. 'ఆల్‌రౌండర్' చిత్రంలోని అత్తరు సాయిబు పాటతో కోరియోగ్రాఫర్‌గా మారాను. 'జయం' చిత్రంలో 'రానురానంటూ నే చిన్నది' పాటతో కలిపి 70 పాటలకు కోరియోగ్రఫీ చేశాను. అమ్మ కోసం బ్రహ్మచారిగానే ఉండిపోయాను. నా తల్లి జ్ఞాపకాలు ఎప్పటికీ నాతోనే ఉంటాయి. ఆమె పాటలు వింటే చాలు నా పక్కనే ఉన్నట్లు అనిపిస్తుంది. 1997 మార్చి 10 వ తేదీన అమ్మ పుట్టినరోజు నాడే తన గొంతును అమరులకు అంకితం చేసిందని తలచుకున్నప్పుడల్లా నా గొంతు పూడుకుపోతుంది. మా అమ్మ బంగారు అమ్మ.



మరో కుమారుడు
ఆనంద్ రాజ్ (సినీ విలన్)

## అమ్మకు కానుక

అమ్మ దబ్బ పండు రంగులో ఉంటుంది. ఆవిడకు దొండ పండు రంగు చీరంటే చాలా ఇష్టం. అందుకని ఒకసారి అమ్మ పుట్టినరోజుకి ఆవిడకు తెలియకుండా పట్టుచీర కొన్నాను. నాకు తెలియకుండా అమ్మ బంగారం తెచ్చింది. 'నేను నీకు బహుమతి తెచ్చాను' అని చీర చూపించగానే, సంతోషపడింది. ఎంతైనా తల్లి ప్రేమ వేరు. మార్చి 10వ తేదీన అమ్మ జయంతి. అదే రోజున కన్ను మూసింది. 'స్వర్ణలత స్మారక అవార్డు' పేరున అవసరంలో ఉన్నవాళ్లకి పది వేల రూపాయలు అందిస్తున్నాను. మా అమ్మ మీద ఉండే అభిమానంతో ఆదిలాబాద్‌కు చెందిన గంగారాం అనే కుర్రాడు నిస్వార్థంగా ఎన్నో పాటలు సేకరించి ఇవ్వటం వల్ల సీడీ చేయగలిగాను. అతడికి ప్రత్యేక కృతజ్ఞతలు.



సీరియల్

# సనాగారి కోడలు

**'సమీర అంటే నాకు నేనుగా శాంటాక్లాజ్ అని చెప్పకుంటాను. మా ఇంట్లో అలాగే అంటారు. నా చుట్టూ ఉన్నవారు సంతోషంగా ఉండాలనుకుంటాను. వారిని సంతోషంగా ఉంచడానికి ఏమైనా చేస్తాను' అంటూ అంతే హ్యాపీగా తన గురించి వివరించింది సమీరా షరీఫ్. ఆడపిల్ల, భార్యామణి, ప్రతిబింబం, మనసు మమత వంటి వరుస సీరియల్స్‌తో తెలుగు బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకున్న సమీర ఇప్పుడు యాంకరింగ్‌లోనూ తనదైన ముద్ర వేస్తోంది. ఆమె గురించి ఆమె మాటల్లోనే..**

''నాకు చిన్నప్పటి నుంచి స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం. నేషనల్ ఛాంపియన్‌ని కావాలనే లక్ష్యంతో ఉండేదాన్ని. నా స్కూల్ వయసులో మ్యూజిక్ ఛానెల్స్ కొత్తగా స్టార్ట్ అయ్యాయి. ఆ షోస్ చూసి నేను కూడా యాంకరింగ్ చేయాలనుకున్నాను. అయితే, అనుకోకుండా సీరియల్ నటిగా బుల్లితెరకు వచ్చాను. ఒక్క సీరియల్‌తో ఆగిపోదామనుకున్నా కానీ వరుస సీరియల్స్ చేశాను. ఇప్పుడు జీ టీవీలో 'అదిరింది' షో ద్వారా మళ్లీ మీ ముందుకు వచ్చాను.

**గ్లామర్ ఫీల్డ్ అంటే దూరం**

మా నాన్నగారు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేసేవారు. వాళ్ల ఆఫీస్ ప్రోగ్రామ్‌లో హిందీ నాటకం వేయడానికి ప్లాన్ చేశారు. ఒక అమ్మాయి పాత్రకు హిందీలో డైలాగ్స్ చెప్పడానికి ఎవరూ లేరని నన్ను చేయమన్నారు. ఆ స్కిట్ చూసిన నాన్న ఫ్రెండ్స్ 'మీ అమ్మాయిని టీవీ లేదా సినిమాల్లో యాక్ట్ చేయించవచ్చు కదా' అన్నారట. నేనేమో బాగా ఆటలు ఆడి గొప్ప పేరు తెచ్చుకొని సి.ఎమ్ అయిపోవాలని కలలు కనేదాన్ని. 'స్పోర్ట్స్ కన్నా ఆన్‌స్క్రీన్ వెళితే అనుకున్నది ఇంకా ఈజీగా అనుకున్నది సాధించవచ్చు' అని నాన్న అంటే సరే అని టీవీ సీరియల్ ఆడిషన్స్ వెళ్లాను. అప్పటి వరకు నా డ్రెస్, కటింగ్ అంతా అబ్బాయిలా ఉండేది. అక్కడ మేకప్, అమ్మాయిలాగా ఉండటం.. నచ్చలేదు. ఈ ఫీల్డ్‌కి నేను సెట్ కాను అనుకున్నాను. కానీ, వేల మంది అమ్మాయిలు ఆడిషన్స్‌కి వస్తే నేనే సెలక్ట్ అయ్యాను. దాంతో సీరియల్‌కి ఒప్పుకున్నాను.

**మార్చేసిన పాత్రలు**

మగరాయుడిలా పెరిగిన నేను టీవీ సీరియల్స్‌లో పాత్రలు చేసీ చేసీ ఒక సంప్రదాయబద్ధమైన అమ్మాయిలా మారిపోయాను. ఇప్పటి వరకు టామ్‌బాయ్‌గా ఉండే క్యారెక్టరైతే చేయలేదు కానీ, బాగా కోపంతో ఉడికిపోయే మనస్తత్వం గల పాత్ర చేశాను. ఆ క్యారెక్టర్ చేస్తున్నప్పుడు నెగెటివ్ ఎనర్జీ అంతా నా శరీరంలోకి వచ్చేసినట్టు అనిపించేది. కొన్నాళ్లు ఏ పాత్రలో లీనమై చేస్తామో దాన్నుంచి అంత త్వరగా బయట పడటం సాధ్యం కాదు. అలా నన్ను మార్చేసిన పాత్రలు చాలా ఉన్నాయి.

**ఇంట్లో ముగ్గురం..**

ఇంట్లో ముగ్గురు అమ్మాయిల్లో నేను రెండవదాన్ని. మా అక్కకు, చెల్లికి ఓ బ్రదర్‌లా ఉండేదాన్ని. ఎవరైనా కామెంట్ చేశారని చెబితే చాలు గొడవకు వెళ్లిపోయే దాన్ని. ఇంటర్ చేస్తున్నప్పుడే ఇండస్ట్రీకి వచ్చాను. టీవీలో బిజీగా ఉండటంతో స్పోర్ట్స్‌కి దూరమయ్యాను. 'ఒకే ఒక్కడు' లాంటి సినిమాలు చూసి జర్నలిస్ట్‌ని అవ్వాలనుకున్నాను. ఆ ఆలోచనతోనే జర్నలిజంలో మాస్ కమ్యూనికేషన్స్ చేశాను. మొదట్లో పాపులారిటీ కోసం మూవీస్ అనుకున్నాను. కానీ, టీవీ అయితే రోజూ ప్రేక్షకుల ఇళ్లలో ఉండచ్చు. అదే సినిమా అయితే ప్రేక్షకులు అనుకుంటే తప్ప థియేటర్‌కి రారు. రోజంతా బిజీగా ఉంచే టీవీయే బెటర్ అనుకున్నాను.

**తప్పుడు సంపాదన అన్నట్టు..**

నేను ముస్లిమ్ అయినా చిన్నప్పటి నుంచి నాకు ముస్లిమ్ ఫ్రెండ్స్ లేరు. మా కుటుంబం మినహా మా బంధువుల్లో 'వినోదాన్ని పంచి సంపాదించిన డబ్బును తప్పుడు పని చేసి సంపాదించినట్టుగా చూసేవారు. మా వాళ్లు 'మీ జాబ్ ఎలాగో.. తనదీ జాబే అనేవారు.' మా కుటుంబం చాలా సందర్భాల్లో సపోర్ట్‌గా నిలిచింది. ఇప్పుడు మా బంధువుల్లోనూ నా వర్క్‌ని అర్థం చేసుకుంటున్నారు.

**ప్రేమగా మారిన పరిచయం**

సినిమా, టీవీ ఆర్టిస్ట్ సనగారితో కలిసి 'ప్రతిబింబం' సీరియల్ చేశాను. అందులో సనగారు నాకు అత్త. ఆవిడే నిజ జీవితంలో అత్తగారు అవుతారని అనుకోలేదు. తనకు ఒక కొడుకు ఉన్నాడనే విషయం మొదట్లో తెలియదు. నేను కొత్తగా కారు తీసుకున్న విషయం సన గారికి చెప్పినప్పుడు 'మా అబ్బాయిది కూడా ఇలాంటి కారే' అన్నప్పుడు తెలిసింది. ఆ తర్వాత ఒకసారి షాపింగ్ మాల్‌లో అన్వర్ గారు పరిచయం అయ్యారు. పరిచయం ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల ఆశీస్సులతో రెండున్నర నెలల క్రితం మా పెళ్లి అయ్యింది. అన్వర్ గారు ఇప్పటికే రెండు సీరియల్స్ ప్రొడ్యూస్ చేసి ఇదే ఫీల్డ్‌లో ఉన్నారు. ఇద్దరం తమిళ్ టీవీలో జంటగా వర్క్ చేశాం.



'ప్రతిబింబం' సీరియల్‌లో ఓ దృశ్యం

**అత్త.. అమ్మ**

సనగారు అత్తగా రావడం నా అదృష్టం. 'ఈ రోజు ఫ్రెండ్స్‌ని కలవాలి లేదా అమ్మవాళ్లంటికి వెళ్లాలి లేదా వేరే ఏదైనా తినాలి' అనుకుని.. 'ఇలాంటివి చెప్పాలా, వద్దా' అని సంశయిస్తుంటాను. అదే టైమ్‌లో తను 'నువ్వు ఈ రోజు ఫ్రెండ్స్‌ని కలవాలి కదా! ఫలానా ఫుడ్ నీకోసమే చేశాను..' అంటారు. నాకు చాలా ఆశ్చర్యమనిపిస్తుంది నేను మనసులో అనుకున్నవి ఎలా తెలిసిపోతాయి అని. అమ్మ దగ్గర ఎలా ఉన్నానో ఇప్పుడు అత్త దగ్గర అలా ఉంటున్నాను.

**కిండర్‌గార్డెన్ టీచర్!**

మా ఆడపడుచుకు ఒక బాబు, అక్కకు ఒక కొడుకు. కాస్త ఖాళీ టైమ్ దొరికితే వాళ్లతో ఆడుకోవడం, వారికోసం షాపింగ్ చేయడం.. ఇదే పనిగా ఉంటాను. రిపోర్టర్, అథ్లెట్ కావాలనుకున్నట్టుగానే కిండర్‌గార్డెన్ టీచర్ అవ్వాలని కూడా చిన్నప్పుడు అనుకున్నాను. ఇప్పుడు స్కూల్ పిల్లలకోసం ఒక బిల్డింగ్‌ని స్పాన్సర్ చేయాలని ఉంది. ఆ కల కూడా త్వరలోనే నెరవేర్చుకుంటాను. ఎంత కాదు... కూడదనుకున్నా ఒకసారి యాక్టింగ్ అనేది బుర్రలోకి చేరిందంటే మళ్లీ బయటకు రాదు అనేది నాకు ఇక్కడకు వచ్చాకే అర్థమయ్యింది. ఎప్పుడూ ఏదో ఒక రూపంలో మీడియా ముందుండడమే నా ముందున్న లక్ష్యం.''

– సంభాషణ: నిర్మలారెడ్డి





సమీర, సన

కిడ్నీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

# ఆల్కహాల్ అలవాటు లేకపోయినా లివర్ వ్యాధులు వస్తాయా?

**మా కుటుంబంలోని ఇద్దరు అతిముఖ్యమైన వ్యక్తుల్ని లివర్ డిసీజెస్ కారణంగా కోల్పోయాం. వీరిద్దరికీ ఆల్కహాల్ అవాటే లేదు. అసలీ కాలేయ వ్యాధులు ఎందుకొస్తాయి? వీటిని నివారించలేమా? చికిత్స ఏమిటి? వస్తే ట్రాన్స్‌ప్లాంటే శరణ్యమా? దయచేసి వివరంగా తెలపండి.**

**కె. రాజ్‌మనోహర్, పుప్పాలగూడ**

కాలేయ వ్యాధులు ఆల్కహాల్ కారణంగానే వస్తాయని చాలామంది అపోహపడుతుంటారు. ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బతింటుందన్నది వాస్తవమే గానీ... కాలేయ వ్యాధులకు అదొక్కటే కారణం కాదు. ఇన్ఫెక్షన్లు, జన్యుపరమైన వ్యాధులు కూడా కాలేయాన్ని దెబ్బతీస్తాయి. కాలేయానికి వచ్చే హెపటైటిస్–బి, హెపటైటిస్–సి ఇన్ఫెక్షన్లుకు సకాలంలో చికిత్స తీసుకోకపోతే క్రమేణా ఇవి కాలేయాన్ని పూర్తిగా పనిచేయకుండా చేస్తాయి. శరీరంలో కొవ్వు ఎక్కువగా పేరుకుపోయిన వాళ్లలో కాలేయం పాడయ్యే అవకాశం ఎక్కువ. ఇనుములోపం వల్ల కలిగే హీమోక్రొమటాసిస్, విల్సన్స్ డిసీజ్ (రాగిలోపం) లాంటి కొన్ని వ్యాధులు లివర్ సిర్రోసిస్‌కు దారితీస్తాయి. మనం వేసుకునే సాధారణ పారాసిటమాల్ నుంచి కొన్ని రకాల మందులు, సంప్రదాయ / నాటు మందులు, లేహ్యాలు, ఆటో–ఇమ్యూన్ వ్యాధులు, క్యాన్సర్లు, మెటబాలిక్ వ్యాధుల లాంటివి కూడా కాలేయాన్ని దెబ్బతీస్తాయి. ఫ్యాటీలివర్ సమస్య కూడా ఒక్కోసారి లివర్‌ను దెబ్బతీసి, సిర్రోసిస్ రావడానికి దారితీస్తుంది. కాలేయ వ్యాధుల్లో 40 – 50 శాతం వరకు క్రిప్టోజెనిక్ అంటే పైన పేర్కొన్న ఏ కారణమూ లేనివి ఉంటాయి. ఇలాంటివాటిని నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్ అంటారు.

కాలేయంలో సమస్య ఉందనగానే ఇక కొత్త కాలేయాన్ని అమర్చడం ఒక్కటే మార్గం అని భయపడవద్దు. కాలేయంలో సమస్య రావడానికి గల కారణానికి చికిత్స ఇస్తే సమస్య తొలగిపోతుంది. సమస్య ఏదైనప్పటికీ కాలేయం పూర్తిగా చెడిపోకముందే సరైన సమయంలో చికిత్స మొదలుపెడితే మందులతోనే సరిదిద్దవచ్చు. ఇక ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమయ్యే దశలో కూడా మందులు వాడుతూ ఉండటం సరికాదు. లక్షణాలను అదుపు చేయడానికే మందులు పనిచేస్తాయి. శరీరంలో పేరుకుపోయిన నీటిని తగ్గించడానికి డైయూరెటిక్స్ ఇస్తారు. ఇన్ఫెక్షన్లలను నివారించడానికి యాంటీబయాటిక్స్ ఇస్తారు. ఫ్యాటీలివర్ సమస్యను కూడా తొలిదశలో అయితే మందులతో కంట్రోల్ చేయవచ్చు. ఫ్యాటీలివర్ సమస్య లివర్ ఫైబ్రోసిస్‌కు దారితీస్తుంది. ఇది ఎఫ్1, ఎఫ్2, ఎఫ్3 అనే మూడు దశల్లో ఉంటుంది. ఎఫ్1, ఎఫ్2 దశల్లో మందులు, జీవనశైలి మార్పులు (లైఫ్‌స్టైల్ మాడిఫికేషన్లు), డయాబెటిస్‌ను అదుపులో పెట్టడం ద్వారా సమస్యను పోగొట్టి తిరిగి సాధారణ స్థితికి వచ్చేలా చేయవచ్చు. కానీ ఎఫ్3 దశకు చేరితే మాత్రం అది లివర్ సిర్రోసిస్‌కు దారితీస్తుంది. అందుకే ఫైబ్రోసిస్ దశలోనే ట్రాన్స్‌ప్లాంట్ చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

కారణం తెలియకుండా వచ్చే కాలేయం జబ్బులను క్రిప్టోజెనిక్ అంటారని ముందుగానే చెప్పుకున్నాం కదా. ఆ క్రిప్టోజెనిక్ జబ్బులకు మందులు ఉండవు. ఇలాంటి సమస్య వల్ల వచ్చే సిర్రోసిస్‌కు మందులు ఉండవు. అయితే మూలకణ చికిత్స వంటి విషయాలు ఇంకా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ అవింకా పరిశోధన దశలోనే ఉన్నాయి.

**కాలేయం అనారోగ్యం పాలు కాకుండా జాగ్రత్తలివే...**

కాలేయానికి జబ్బులేమీ రాకుండా ఉండటానికి మనం పాటించే కొన్ని జాగ్రత్తలు చాలావరకు మేలు చేస్తాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిని ఏర్పరచుకోవడం, అనారోగ్యకరమైన అలవాట్లు మానేయడం అందులో ముఖ్యమైనవి. అందులో భాగంగా జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవాలి. ఆల్కహాల తీసుకోవడం పూర్తిగా మానేయాలి. హెపటైటిస్– బి, సి కోసం హెచ్‌బీవీ, హెచ్‌సీవీ యాంటీబాడీ టెస్టులు చేయించుకోవాలి. ఫలితాలు పాజిటివ్ అని వస్తే వెంటనే చికిత్స తీసుకోవాలి. వీటికి మంచి చికిత్స అందుబాటులో ఉంది. మొదట్లోనే చికిత్స తీసుకుంటే లివర్ చెడిపోకుండా ఉంటుంది.

● నాన్ ఆల్కహాలిక్ లివర్ డిసీజ్ రాకుండా ఉండేందుకు వ్యాయామం చేయాలి ● డయాబెటిస్‌ను పూర్తిగా అదుపులో ఉంచుకోవాలి ● లివర్ వ్యాధుల నిర్ధారణ కోసం అల్ట్రాసౌండ్ పరీక్ష చేయించుకోవాలి ● బరువు పెరగకుండా చూసుకోవాలి ● కాలేయ వ్యాధులు వచ్చి అవి ముదరకుండానే బయటపడేందుకు తరచూ ఎల్ఎఫ్‌టీ, హెపటైటిస్ బి, సి పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు, ఫ్యామిలీ హిస్టరీలో లివర్ క్యాన్సర్ ఉంటే... క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఇలాంటి జాగ్రత్తలతో కాలేయాన్ని ఆరోగ్యంగా ఉండేలా చాలావరకు చూసుకోవచ్చు.





డాక్టర్ బాలచంద్రన్ మీనన్,
సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెపటాలజీ అండ్ లివర్ డిసీజెస్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
బుధవారం 5-2-2020




## బీఈసీఐఎల్-77

భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్).. న్యూఢిల్లీలోని ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీలో ఒప్పంద ప్రాతిపదికన 77 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సర్వేయర్స్-75, ప్రోగ్రామర్-2.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక:** టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 17, 2020
- **వెబ్‌సైట్:** www.becil.com

## ఎగ్జిమ్ బ్యాంక్-22

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎగ్జిమ్ బ్యాంక్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 22 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** చీఫ్ మేనేజర్-2, మేనేజర్-8, డిప్యూటీ మేనేజర్-5, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-4, ఐటీ-3.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈ/బీటెక్, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఫిబ్రవరి 7, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 22, 2020
- **పరీక్షతేదీ:** మార్చి 15, 2020
- **వెబ్‌సైట్:** www.eximbankindia.in

## ఈఐఎల్-17

న్యూఢిల్లీలోని ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్).. 17 ఎగ్జిక్యూటివ్ (కెమికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** కెమికల్ విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 37-45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తులు ప్రారంభం:** జనవరి 31, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 20, 2020
- **వెబ్‌సైట్:** https://engineersindia.com

## సాయ్-347

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 347 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** ఆంథ్రోపోమెట్రిస్ట్, బయోమెకనిస్ట్, సైకాలజిస్ట్, బయో కెమిస్ట్, ఫిజియో థెరపిస్ట్, ఫార్మసిస్ట్, నర్సింగ్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి ఇంటర్మీడియట్, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** కొన్ని పోస్టులకు 35 ఏళ్లు; మరికొన్ని పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 15, 2020
- **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.gov.in

## పవర్‌గ్రిడ్-53

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ 53 ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ 25వ బ్యాచ్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/బీఎస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణత.
- **ఎంపిక:** సంబంధిత పేపర్‌లో గేట్-2020 మార్కులు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 20, 2020
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

## సీపెట్-7

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ పోస్టులు:** సీనియర్ ఆఫీసర్-1, ఆఫీసర్-2, అసిస్టెంట్ ఆఫీసర్-4.
- **అర్హత:** పోస్టులను బట్టి బ్యాచిలర్ డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో ఎంబీఏ/పీజీ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ/రాతపరీక్ష, స్కిల్ టెస్ట్/ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 17, 2020
- **వెబ్‌సైట్:** www.cipet.gov.in

## ఎంఓఐఎల్-22

నాగ్‌పూర్‌లోని మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 22 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** చీఫ్ మేనేజర్ (మైన్స్)-3, సీనియర్ మేనేజర్ (మెకానికల్)-3, సివిల్ ఓవర్‌సీర్-4, వైండింగ్ ఇంజన్ డ్రైవర్-12.
- **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 38-42 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష/ట్రేడ్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 18, 2020
- **వెబ్‌సైట్:** www.moil.nic.in

## ఎంవోఎస్‌పీఐ-48

భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ 48 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సీనియర్ కన్సల్టెంట్-3, జూనియర్ కన్సల్టెంట్-25, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్-20
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 29, 2020
- **వెబ్‌సైట్:** http://mospi.nic.in

## టీఎస్ఎస్‌డీసీఎల్-20

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్రానికి చెందిన తెలంగాణ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎస్‌డీసీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన 20 సీడ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ఐకార్ గుర్తింపు పొందిన ఏదైనా యూనివర్సిటీ నుంచి బీఎస్సీ-అగ్రికల్చర్ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 22-44 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 17, 2020
- **వెబ్‌సైట్:** www.tssdcl.telangana.gov.in

## ఏపీ హైకోర్టు-111

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 111 ఆఫీస్ సబార్డినేట్, డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఆఫీస్ సబార్డినేట్-100, డ్రైవర్లు-11.
- **అర్హత:** ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు ఏడో తరగతి/తత్సమాన ఉత్తీర్ణత, పదోతరగతి ఫెయిలైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డ్రైవర్ పోస్టులకు తెలుగు/ఇంగ్లిష్/ హిందీ/ఉర్దూ చదవడం, రాయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, అనుభవం ఉండాలి.
- **వయసు:** ఆగస్టు 1, 2020 నాటికి 18-34 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఓరల్ ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 20, 2020
- **వెబ్‌సైట్:** http://hc.ap.nic.in

## ఎఫ్ఎస్ఎస్ఏఐ-26

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 26 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఫుడ్ సేఫ్టీ అండ్ న్యూట్రిషన్: సీనియర్ రీసెర్చ్ ఫెలో-10, జూనియర్ రీసెర్చ్ ఫెలో-16.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్/తత్సమాన పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణత, నెట్/గేట్ క్వాలిఫై కావడంతో పాటు అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 21, 2020
- **వెబ్‌సైట్:** www.fssai.gov.in

## అప్రెంటిస్

### ఐఆర్ఈఎల్-28

కేరళలోని ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ (ఐఆర్ఈఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 28 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ట్రేడ్-20, వొకేషనల్-2, గ్రాడ్యుయేట్-4, టెక్నీషియన్ అప్రెంటిస్-2.
- **అర్హత:** సంబంధిత ట్రేడ్/సబ్జెక్టుల్లో ఐటీఐ, వీహెచ్ఎస్సీ, డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయసు:** 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 15, 2020
- **వెబ్‌సైట్:** www.irel.co.in

### హెచ్‌సీఎల్-161

హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్‌కి చెందిన ఖేత్రి కాంప్లెక్స్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 161 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** మేట్ (మైన్స్)-30, బ్లాస్టర్ (మైన్స్)-30, ఫిట్టర్-25, టర్నర్-5, వెల్డర్-15, ఎలక్ట్రీషియన్-30, ఎలక్ట్రానిక్స్ మెకానిక్-6, డ్రాఫ్ట్స్‌మెన్-5, మెకానిక్ డీజిల్-10, పంప్ ఆపరేటర్ కమ్ మెకానిక్-1, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్-2, వైర్‌మెన్-2.
- **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.
- **వయసు:** జనవరి 28, 2020 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 15,2020
- **వెబ్‌సైట్:** https://hindustancopper.com

## ప్రవేశాలు

### టీఎస్ మోడల్ స్కూల్

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదర్శ పాఠశాలల్లో 2020-21 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- ఆరోతరగతి, ఏడు నుంచి పదోతరగతి వరకు మిగిలిన సీట్లకు ప్రవేశాలు
- **అర్హత:** సంబంధిత తరగతిలో ప్రవేశానికి ముందు ఏడాది చదివిన తరగతి ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్షతేదీ:** ఏప్రిల్ 12, 2020
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ప్రక్రియ:** ఆరో తరగతికి ఫిబ్రవరి 4, 2020 నుంచి ఫిబ్రవరి 29, 2020 వరకు; ఏడు నుంచి పదో తరగతి వరకు ఫిబ్రవరి 8, 2020 నుంచి మార్చి 2, 2020 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వెబ్‌సైట్:** https://telanganams.cgg.gov.in

### జేఎన్‌టీయూకేలో పీహెచ్‌డీ

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)-కాకినాడ..2020-21 విద్యా సంవత్సరానికి గాను వివిధ పీహెచ్‌డీ ప్రోగ్రాముల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్, బయో-టెక్నాలజీ, ఫిజిక్స్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్.
- **అర్హత:** ఏపీఆర్‌సీఈటీ-2019 క్వాలిఫై అయిన అభ్యర్థులు అర్హులు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **ఇంటర్వ్యూ తేదీలు:** 2020, ఫిబ్రవరి 5 నుంచి ఫిబ్రవరి 24 వరకు జరుగుతాయి.
- **చిరునామా:** జేఎన్‌టీయూ-కాకినాడ; ఆంధ్రప్రదేశ్.
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

### నాటా-2020

న్యూఢిల్లీలోని ది కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) 2020-21 విద్యా సంవత్సరానికి సంబంధించి నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిలో అర్హత సాధించిన వారు బ్యాచిలర్స్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) మొదటి ఏడాదిలో ప్రవేశం పొందొచ్చు.

- **నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా)-2020**
- **అర్హత:** ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్/10+2 లేదా మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఉన్న 10+3 డిప్లొమా ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రెండు దశల ప్రవేశ పరీక్షల్లో సాధించిన స్కోర్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **మొదటి దశ పరీక్షతేదీ:** ఏప్రిల్ 19, 2020
- **రెండో దశ పరీక్షతేదీ:** మే 31, 2020
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** మొదటి దశ పరీక్ష లేదా రెండో దశ పరీక్షకు విడివిడిగా అయితే రూ.2000; రెండింటికీ కలిపి అయితే రూ.3800 (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు విడివిడిగా అయితే రూ.1700; రెండింటికీ కలిపి అయితే రూ.3100).
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 16, 2020
- **వెబ్‌సైట్:** http://nata.in

ఎంసెట్ - ప్రత్యేకం
బిట్‌బ్యాంక్, ప్రాక్టీస్ టెస్టులు, ప్రీవియస్ పేపర్స్ క్విక్ రివ్యూ, ఆన్‌లైన్ టెస్టులు...మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
TELUGU

# స్మార్ట్ స్టడీ.. గెట్ రెడీ

**విద్యా సంవత్సరం చివరి దశకు చేరింది. పరీక్షలు దగ్గరబడుతున్నాయి. ఎలా చదవాలి, ఏం చదవాలి, ఎలా మంచి గ్రేడ్ సాధించాలి.. ఇదే ప్రస్తుతం పదోతరగతి, ఇంటర్‌తో పాటు వివిధ వార్షిక, పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థుల మానసిక స్థితి. అయితే మార్కులు, ర్యాంకులే విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలను నిర్దేశిస్తాయా..? ఒత్తిడితో కూడిన ప్రిపరేషన్‌తో ఎంత వరకు విజయం సాధించగలం..? మనిషి సామర్థ్యానికి పరీక్షలే కొలమానమా..? అయితే పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి..? ఒత్తిడిని ఎలా అధిగమించాలి..? తదితర అంశాలపై నిపుణుల సూచనలు, సలహాలు...**

### పరీక్ష అంటే..?

పరీక్ష అంటే వందకు వంద మార్కులు.. టాప్ ర్యాంకులు సాధించడం కాదు. ఒక విద్యార్థి ఆలోచన, విశ్లేషణాత్మక, జ్ఞాన, తార్కిక నైపుణ్యాలను అంచనా వేయడానికి నిర్దేశించిన మార్గం. విద్యార్థిలో దాగున్న నైపుణ్యాలను అంచనా వేయడానికి ప్రభుత్వాలు గ్రేడ్‌లు, మార్కులు అనే అంశాలను ప్రవేశపెట్టాయి. కానీ విద్యార్థులు టాప్ గ్రేడ్‌లు, టాప్ మార్కులే లక్ష్యంగా చదవటంతో తెలియకుండానే మెదడుపై భారాన్ని మోపుతున్నారు. దీని వల్ల సబ్జెక్ట్ నాలెడ్జ్ లోపించి ఉద్యోగాన్వేషణలో, ఇంటర్వ్యూ సమయంలో, మంచి నిర్ణయాలు తీసుకునే విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అయితే ఇక్కడ గ్రహించాల్సింది ఏమిటంటే.. మార్కులు, గ్రేడులు ప్రతిభకు నిదర్శనం కాదు. ఉన్నతస్థాయి ఉద్యోగాలకు టాప్ ర్యాంకులు, మార్కుల కంటే సబ్జెక్ట్ నాలెడ్జ్, ప్రజ్ఞ ముఖ్యం. కాబట్టి వీలైనంత వరకు ఒత్తిడి తగ్గించుకుని సరైన ప్రణాళికతో ప్రిపేరయితే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా చేరుకోవచ్చు. అయితే ఆ ప్రిపరేషన్ ఏ విధంగా ఉండాలంటే...

### ఎవరి శైలి వారిదే..!

చదువు విషయంలో ఒక్కో విద్యార్థి ఒక్కో విధానాన్ని అవలంభిస్తాడు. పక్క విద్యార్థి చదివే పద్ధతితో పోల్చుకోకుండా తనదైన శైలిలో చదివితేనే సబ్జెక్ట్‌పై పట్టు దొరుకుతుంది. చదవడం, ప్రాక్టీస్ చేయడం, తప్పులను సవరించుకోవడం వంటి విషయాలకు ఇలానే చేయాలనే ప్రత్యేక నియమ నిబంధనలు ఏమీలేవు. వీలైనంత వరకు రేపు, ఎల్లుండి అని వాయిదాలు వేయకుండా చదవడం ప్రధానం.

### అవగాహన ముఖ్యం

ప్రతీ విద్యార్థి తాను రాయబోయే పరీక్షా సరళి, సిలబస్ గురించి ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం ముఖ్యం. సిలబస్ ఏంటి..? పరీక్ష సమయం ఎంత..? ప్రశ్నలు ఏ విధంగా ఉంటాయి..? వంటి అంశాలను తప్పనిసరిగా తెలుసుకోవాలి. వీలైనంత వరకు పాత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి. గతేడాదితో పోల్చితే ప్రశ్న పత్రం, సిలబస్‌లో ఏమైనా మార్పులు జరిగాయా, లేదా అనే అంశాలను పరిశీలించాలి. సందేహం ఉంటే సంబంధిత ఉపాధ్యాయులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి.



### టైమ్ టేబుల్

ప్రిపరేషన్ ప్రారంభించే ముందు ప్రతి సబ్జెక్టును ఎంత సేపు చదవాలి, ఏయే అంశాలు ముఖ్యమైనవి, క్లిష్టమైన కాన్సెప్టులకు ఎంత టైమ్ కేటాయించాలి, ఎంత సమయానికి చదవడం ముగించాలి. ఏ సమయంలో విశ్రాంతి తీసుకోవాలి తదితర అంశాలపై నిర్దిష్ట టైమ్ టేబుల్ తయారు చేసుకోవాలి. ప్రతీసారి అందులో మార్పులు చేర్పులు చేయకుండా ఒకే టైమ్‌ను పాటించాలి.

### స్మార్ట్ స్టడీ

కష్టంగా చదవడం కాకుండా ఇష్టంగా, ఈజీగా చదవడానికి ప్రయత్నించాలి. చదివింది వెంటనే గుర్తుకు రావడానికి స్మార్ట్ స్టడీ ముఖ్యమని గమనించాలి. చదివిన సబ్జెక్టుకు సంబంధించి ప్రత్యేకంగా స్టడీ నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి. ముఖ్యమైన కాన్సెప్టులను షార్ట్‌కట్ పదాలతో క్లుప్తంగా, ఒక పదం చూడగానే మొత్తం కాన్సెప్ట్ గుర్తొచ్చే విధంగా స్టడీ నోట్స్‌లో రాసుకోవాలి. ఇలా రాయడం వల్ల సంబంధిత టాపిక్ ఈజీగా మెదడులో రిజిస్టరవుతుంది. అలాగే రాసుకున్న దాన్ని వీలైనప్పుడల్లా రివిజన్ చేసుకోవాలి.

### మోడల్ పేపర్ల సాధన

పరీక్షల సమయం దగ్గర పడుతున్న కొద్దీ వీలైనన్నీ ఎక్కువ మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయాలి. ఎన్ని ఎక్కువ మోడల్ పేపర్లు కవర్ చేస్తే అంత మంచిది. ప్రశ్నలు ఏ విధంగా అడిగినా, ప్రశ్న పత్రం ఎంత కఠినంగా వచ్చినా సులభంగా పరీక్ష రాయొచ్చు. మోడల్ పేపర్ల వల్ల సబ్జెక్టుల వారీ టాపిక్‌లు, కీలకమైన అంశాలు ఏమిటనే విషయం అవగతం అవుతుంది. అలాగే కొత్త టాపిక్ చదవడం ప్రారంభించే ముందు గడచిన రోజు చదివిన టాపిక్స్‌ను, ప్రిపేర్ చేసుకున్న షార్ట్‌నోట్స్‌ను ఒక సారి చూడటం వల్ల ఆ కాన్సెప్టులను మర్చిపోకుండా ఉంటారు.

### విశ్రాంతి ప్రధానం

పరీక్షలు దగ్గర పడుతున్నాయనే ఆందోళన చాలా మంది విద్యార్థులను విరామం లేకుండా సన్నద్ధమయ్యేలా చేస్తుంది. ఇలాంటి ప్రిపరేషన్ వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మెదడు మీద అధిక భారం మోపడం వల్ల చదివింది త్వరగా మర్చిపోయే ఆస్కారమే ఎక్కువ. ప్రతి గంటకొకసారి కొద్ది సేపు విశ్రాంతి తీసుకుని తిరిగి ప్రిపరేషన్ కొనసాగించడం మంచిది. దీని వల్ల ఫిజికల్‌గా, మెంటల్‌గా రీఫ్రెష్ కావొచ్చు.

### ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పరీక్ష రోజు ఉత్సాహంగా ఉండాలంటే సరైన సమయానికి తిండి, నిద్ర చాలా అవసరం. ఇవి రెండూ ఉంటేనే పరీక్ష అనుకున్న విధంగా రాయగలం. ప్రతీ రోజు ఉదయం అరగంట పాటు వ్యాయమం చేయడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి, ఆందోళన తొలగిపోయి నూతన ఉత్తేజం వస్తుంది.

### గైడెన్స్ తీసుకోండి

రాబోయే పరీక్షల గురించి ఆందోళనగా అనిపిస్తే, మీ తల్లిదండ్రులతో లేదా ఉపాధ్యాయులతో పంచుకోండి. వాళ్లిచ్చే భరోసా, ధైర్యం పునఃశక్తిని, నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది. అలాగే కొద్దిసేపు మంచి పాటలు, మోటివేషనల్ స్పీచ్‌లు వినడం, కామెడీ సీన్లు చూడటం కూడా ఒత్తిడిని, ఆందోళను దూరం చేస్తుంది. అలా కాకుండా ఆందోళనతో మీలో మీరే మథన పడుతూ ఉంటే దాని తాలూకు ప్రభావం పరీక్షపై పడుతుంది.

# పది వికెట్లతో పని పట్టారు



యశస్వి విజయ గర్జన

అసలే చిరకాల ప్రత్యర్థి. పైగా ఈ టోర్నీలో భారత్‌తో పాటు సమఉజ్జీ ప్రదర్శన ఇచ్చింది. కానీ భారత్‌తో ఆడేటప్పుడు మాత్రం అత్తెసరు జట్టుగా మారిపోయింది. పాక్ బ్యాట్స్‌మెన్‌ను మన బౌలర్లు వెంటాడితే... బౌలర్లనేమో భారత ఓపెనర్లిద్దరే గెలిచేదాకా వేటాడారు. ఫలితం... పాకిస్తాన్‌ను కసిదీరా ఓడించారు. యువ భారత్‌ను సమష్టిగా అంతిమ సమరానికి చేర్చారు.

## పాక్‌ను పాతరేసిన యువ భారత్

- సెమీస్‌లో 10 వికెట్లతో ఘన విజయం
- ఏడోసారి ఫైనల్‌కి చేరిన టీమిండియా
- యశస్వి జైస్వాల్ చిరస్మరణీయ శతకం
- మెరిసిన సుశాంత్, దివ్యాంశ్
- అండర్–19 ప్రపంచకప్



దివ్యాంశ్

పాచెఫ్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): న్యూజిలాండ్‌లో భారత సీనియర్ జట్టు కివీస్‌పై అన్నీ గెలిచింది. దక్షిణాఫ్రికాలో యువ భారత జట్టు అందరినీ ఓడిస్తోంది. ఇక ఒక్క ఫైనల్ పోరు మాత్రమే బాకీ ఉంది. అద్వితీయ ఆటతో అదరగొట్టిన యువ భారత జట్టు అండర్–19 ప్రపంచకప్‌లో ఏడోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట పాకిస్తాన్ 43.1 ఓవర్లలో 172 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ రొహైల్ నజీర్ (102 బంతుల్లో 62; 6 ఫోర్లు), ఓపెనర్ హైదర్ అలీ (77 బంతుల్లో 56; 9 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో సుశాంత్ మిశ్రా 3 వికెట్లు తీయగా... కార్తీక్ త్యాగి, రవి బిష్ణోయ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. తర్వాత భారత్ 35.2 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా 176 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (113 బంతుల్లో 105 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) 'శత'క్కొట్టాడు. దివ్యాంశ్ సక్సేనా (99 బంతుల్లో 59 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు.



యువ భారత్ విక్టరీ సెల్ఫీ

### స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: హైదర్ అలీ (సి) రవి బిష్ణోయ్ (బి) యశస్వి 56; హురైరా (సి) సక్సేనా (బి) సుశాంత్ 4; ఫహాద్ (సి) అథర్వ (బి) రవి బిష్ణోయ్ 0; నజీర్ (సి) తిలక్ వర్మ (బి) సుశాంత్ 62; ఖాసీమ్ (రనౌట్) 9; హ్యారిస్ (సి) సక్సేనా (బి) అథర్వ 21; ఇర్ఫాన్ (బి) కార్తీక్ 3; అబ్బాస్ ఎల్బీడబ్ల్యూ (బి) రవి 2; తాహిర్ (సి) జురేల్ (బి) కార్తీక్ త్యాగి 2; ఆమిర్ అలీ (సి) సిద్ధేశ్ వీర్ (బి) సుశాంత్ 1; అమిర్ ఖాన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (43.1 ఓవర్లలో ఆలౌట్) 172. వికెట్ల పతనం: 1–9, 2–34, 3–96, 4–118, 5–146, 6–156, 7–163, 8–169, 9–172, 10–172.

బౌలింగ్: కార్తీక్ త్యాగి 8–0–32–2, సుశాంత్ 8.1–0–28–3, రవి బిష్ణోయ్ 10–0–46–2, ఆకాశ్ సింగ్ 7–0–25–0, అథర్వ 7–0–29–1, యశస్వి జైస్వాల్ 3–0–11–1.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (నాటౌట్) 105, దివ్యాంశ్ (నాటౌట్) 59; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (35.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 176.

బౌలింగ్: తాహిర్ 6–1–17–0, ఖాసీమ్ 8–0–37–0, అమిర్ 5–1–20–0, అబ్బాస్ 7–0–50–0, ఆమిర్ అలీ 5.2–0–38–0, ఫహాద్ 4–0–12–0.

**7** అండర్–19 ప్రపంచకప్‌లో భారత్ ఏడోసారి ఫైనల్ చేరింది. నాలుగుసార్లు (2000, 2008, 2012, 2018) విజేతగా, రెండుసార్లు (2006, 2016) రన్నరప్‌గా నిలి చింది.

**10** అండర్–19 ప్రపంచకప్ చరిత్రలో ఛేజింగ్ చేస్తూ భారత్ వరుసగా సాధించిన పదో విజయమిది. 2010 నుంచి భారత్ ఈ టోర్నీలో ఛేజిం గ్ చేస్తూ ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు.

**11** ఈ టోర్నీ చరిత్రలో ప్రత్యర్థిని ఆలౌట్ చేయడం భారత్‌కిది వరుసగా 11వసారి.

**1** ఈ టోర్నీ చరిత్రలో ఓ జట్టు నాకౌట్ మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో నెగ్గడం ఇదే తొలిసారి.

**5** గత ఐదు అండర్–19 ప్రపంచకప్‌లలో సెమీఫైనల్ లేదా ఫైనల్స్‌లో ఐదు సెంచరీలు నమోదు కాగా... ఐదూ భారత ఆటగాళ్లే (2006 సెమీస్– పుజారా (129 నాటౌట్); 2012 ఫైనల్–ఉన్ముక్త్ చంద్ (111 నాటౌట్); 2018 సెమీస్–శుబ్‌మన్ గిల్ (102 నాటౌట్); 2018 ఫైనల్–మన్‌జ్యోత్ (101 నాటౌట్); 2020 సెమీస్–యశస్వి (105 నాటౌట్) చేశారు.

**వెంటాడిన బౌలర్లు...**

భారత బౌలర్లు పాక్ బ్యాట్స్‌మెన్ పాలిట కొదమ సింహాల్లా రెచ్చిపోయారు. దీంతో ముగ్గురు మినహా మిగతా వారు అంకెతోనే సరిపెట్టుకున్నారు. హురైరా (4), ఫహాద్ (0), ఖాసీమ్ (9), ఇర్ఫాన్ (3), అబ్బాస్ (2), తాహిర్ (2), ఆమిర్ అలీ (1) ఇలా 'టాప్ నుంచి టెయిలెండర్ల' దాకా అందరూ భారత బౌలింగ్ చెరలో చిక్కి శల్యమయ్యారు. ఓపెనర్ హైదర్ అలీ, కెప్టెన్ నజీర్ మూడో వికెట్‌కు 62 పరుగులు జోడించడమే పాక్ ఇన్నింగ్స్‌లో గొప్ప భాగస్వామ్యం. ఇద్దరు అర్ధ సెంచరీలతో జట్టును ఆదుకోగా... హ్యారిస్ 21 పరుగులు చేశాడు. ఇక 31వ ఓవర్ నుంచి భారత బౌలింగ్ మరింత పదునెక్కింది. దీంతో 13 ఓవర్ల వ్యవధిలో పాక్ చివరి 7 వికెట్లను కోల్పోయింది.

**చితగ్గొట్టిన ఓపెనింగ్ జోడీ...**

యశస్వి, దివ్యాంశ్ ఆట మొదలుపెట్టాక పరుగులు, అవి రాలేదంటే డాట్ బాల్స్, కుదిరితే ఫోర్లు, బాదితే సిక్సర్లు ఇలా అన్నీ వచ్చిపోయాయి. కానీ ఒక్క వికెట్ రాలితే ఒట్టు. ఈ యువ మెగా టోర్నీలో భారత్‌కు దీటుగా ఉన్న పాక్ బౌలింగ్... భారత్ ఎదురు పడితే మాత్రం బెదిరిపోయింది. ఓపెనర్లు యశస్వి, దివ్యాంశ్ మరొకరికి అవకాశం ఇవ్వకుండా లక్ష్యాన్ని ఛేదించేదాకా క్రీజు వదల్లేదు. అబేధ్యమైన తొలి వికెట్‌కు 176 పరుగులు జోడించి భారత్‌ను దర్జాగా ఫైనల్‌కు చేర్చారు. న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్ల మధ్య గురువారం జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో ఈనెల 9న జరిగే ఫైనల్లో భారత్ ఆడుతుంది.

# ప్రియదర్శినికి కాంస్యం



కోల్‌కతా: జాతీయ సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ వెయిట్‌లిఫ్టర్ ప్రియదర్శిని కాంస్య పతకం సాధించింది. మంగళవారం జరిగిన మహిళల 49 కేజీల విభాగంలో ప్రియదర్శిని మొత్తం 168 కేజీల (స్నాచ్‌లో 70+క్లీన్ అండ్ జెర్క్‌లో 98) బరువెత్తి మూడో స్థానంలో నిలిచింది.

**మీరాబాయి జాతీయ రికార్డు:** 49 కేజీల విభాగంలోనే భారత స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను కొత్త జాతీయ రికార్డు నెలకొల్పడంతోపాటు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. రైల్వేస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మణిపూర్‌కు చెందిన 25 ఏళ్ల మీరాబాయి మొత్తం 203 (స్నాచ్‌లో 88+ క్లీన్ అండ్ జెర్క్‌లో 115) కేజీలు బరువెత్తి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో 201 కేజీలతో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. రైల్వేస్‌కే చెందిన మరో వెయిట్‌లిఫ్టర్ సంజిత చాను మొత్తం 185 కేజీలు (స్నాచ్‌లో 80+క్లీన్ అండ్ జెర్క్‌లో 105) బరువెత్తి రజత పతకాన్ని దక్కించుకుంది.

# బెంగళూరు సెమీస్ ఆశలు సజీవం

సాక్షి, హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) సీజన్–5 సెమీఫైనల్ ఆశలను బెంగళూరు రాప్టర్స్ సజీవంగా నిలబెట్టుకుంది. ఇక్కడి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన పోరులో బెంగళూరు 5–0తో ముంబై రాకెట్స్‌పై విజయం సాధించింది. దాంతో ముంబైతో పాటు హైదరాబాద్ హంటర్స్ ప్లే ఆఫ్ ఆశలు ఆవిరయ్యాయి. తొలుత జరిగిన పురుషుల డబుల్స్‌లో మాత్రమే ఓడిన బెంగళూరు మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ జయకేతనం ఎగరవేసింది. పురుషుల తొలి సింగిల్స్ మ్యాచ్ ఈ పోరుకే హైలెట్‌గా నిలిచింది. హైదరాబాద్ షట్లర్లు సాయిప్రణీత్, పారుపల్లి కశ్యప్‌ల మధ్య జరిగిన ఈ మ్యాచ్ ప్రేక్షకులకు ఫుల్ జోష్‌ను ఇచ్చింది. సాయిప్రణీత్ 15–14, 14–15, 15–14తో పారుపల్లి కశ్యప్ (ముంబై)పై గెలుపొందాడు. అంతకుముందు నార్త్ ఈస్టర్న్ వారియర్స్ 4–3తో చెన్నై సూపర్‌స్టార్స్‌పై నెగ్గింది. నేటి మ్యాచ్‌లో పుణే సెవెన్ ఏసెస్‌తో హైదరాబాద్ హంటర్స్ తలపడుతుంది.

# తొలి రోజే 24 వికెట్లు

## ఆంధ్ర తడబాటు

- తొలి ఇన్నింగ్స్‌లో 97 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో 31/4
- సిద్ధార్థ్ కౌల్ 'హ్యాట్రిక్'
- పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 108 ఆలౌట్

పాటియాలా: ఇరు జట్ల బౌలర్లు హడలెత్తించడంతో... ఆంధ్ర, పంజాబ్ జట్ల మధ్య ఇక్కడి ధ్రువ్ పాండవ్ స్టేడియంలో మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ 'ఎ అండ్ బి' గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఏకంగా 24 వికెట్లు పడ్డాయి. తొలుత పంజాబ్ పేస్ బౌలర్ సిద్ధార్థ్ కౌల్ (5/24) హ్యాట్రిక్‌తో అదరగొట్టడం... వినయ్ చౌదరీ (3/28) కూడా రాణించడంతో... ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 39.4 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు జ్ఞానేశ్వర్ (0), ప్రశాంత్ (0)లు డకౌట్‌గా వెనుదిరగ్గా... ప్రణీత్ (5), కెప్టెన్ రికీ భుయ్ (23 బంతుల్లో 11; 2 ఫోర్లు) ఇలా వచ్చి అలా వెళ్లారు. జట్టు టాప్ స్కోరర్‌గా బోడపాటి సుమంత్ (51 బంతుల్లో 22; 4 ఫోర్లు) నిలిచాడు. ఇన్నింగ్స్ 40వ ఓవర్‌లోని రెండు, మూడు, నాలుగు బంతుల్లో వరుసగా శశికాంత్ (28 బంతుల్లో 20; 2 సిక్స్‌లు), స్వరూప్ (0), ఆశిష్ (0)లను అవుట్ చేసిన పంజాబ్ బౌలర్ సిద్ధార్థ్ కౌల్ హ్యాట్రిక్ నమోదు చేశాడు. అనంతరం ఆంధ్ర బౌలర్లు షోయబ్ మొహమ్మద్ ఖాన్ (5/46), ఆశిష్ (5/50) ధాటికి... పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 35.2 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటైంది. 11 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర ఆట ముగిసే సమయానికి 9.2 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 31 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆంధ్ర 20 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. రికీ భుయ్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.



సిద్ధార్థ్ కౌల్

# వన్డేలకు వేళాయె...

## నేడు న్యూజిలాండ్‌తో భారత్ తొలి పోరు

- కొత్త ఓపెనింగ్ జోడితో టీమిండియా
- విలియమ్సన్ లేకుండానే బరిలోకి కివీస్
- ఉదయం గం. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



వన్డే సిరీస్ ట్రోఫీతో లాథమ్, కోహ్లి

హామిల్టన్: భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనలో రెండో దశ పోరుకు రంగం సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా నేడు ఇరు జట్ల మధ్య తొలి పోరు జరగనుంది. 'పొట్టి ఫార్మాట్'లో అద్భుత ప్రదర్శన తర్వాత కోహ్లి సేన ఆత్మవిశ్వాసం అంబరాన్ని చుంబిస్తుండగా, అటు న్యూజిలాండ్ టి20 గాయాలను మరచి కొత్తగా ఆటను మొదలు పెట్టాలని భావిస్తోంది. భారత్ సొంతగడ్డపై ఇటీవలే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో విజయం సాధించగా... న్యూజిలాండ్‌కు ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్ చేతిలో 'బౌండరీ పరాజయం' తర్వాత ఇదే తొలి వన్డే కావడం విశేషం.

**షా, మయాంక్ అరంగేట్రం...**

సుదీర్ఘ కాలం తర్వాత విజయవంతమైన ఓపెనింగ్ జోడి రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు ఇద్దరూ లేకుండా కొత్త ఆటగాళ్లతో భారత జట్టు ఇన్నింగ్స్ ప్రారంభం కానుంది. రాహుల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నా సరే... వికెట్ కీపర్‌గా అదనపు బాధ్యత ఉంది కాబట్టి అతను ఐదో స్థానంలోనే ఆడతాడని కెప్టెన్ కోహ్లి ప్రకటించాడు. దాంతో మయాంక్, షా ఓపెనింగ్ చేయడం ఖాయమైపోయింది. ఆ తర్వాత కోహ్లి, అయ్యర్‌లతో బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. ఆరో స్థానంలో మరోసారి పాండే కీలక బాధ్యతను పోషించాల్సి ఉంటుంది. టి20 సిరీస్‌లో చక్కటి ఇన్నింగ్స్‌ల తర్వాత పాండే కూడా ఉత్సాహంతో ఉన్నాడు. ఆల్‌రౌండర్‌గా జడేజా స్థానానికి ఢోకా లేకపోగా, చహల్‌కు బదులుగా కుల్దీప్‌కు వన్డేల్లో ప్రాధాన్యత లభించడం ఖాయం. షమీ, బుమ్రా జోరు చూపిస్తే కివీస్‌కు ఇబ్బందులు తప్పవు.

> న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ టి20 ప్రపంచకప్‌కు సన్నాహకంగా పనికొస్తుందని మేం భావించడం లేదు. అందు కోసం ఐపీఎల్ ఉంది... తొలి మ్యాచ్‌కు ముందు రోజు భారత కెప్టెన్ విరాట్ కోహ్లి చేసిన ఈ వ్యాఖ్యతోనే ఈ పోరుకు ఏమాత్రం ప్రాధాన్యత ఉందో అర్థమవుతుంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను విజయవంతంగా క్లీన్‌స్వీప్ చేసిన జోరులో దానికి కొనసాగింపుగా భారత్ వన్డే సిరీస్ బరిలోకి దిగుతోంది. సొంత గడ్డపై టి20ల్లో కోల్పోయిన పరువును కివీస్ వన్డేల్లోనైనా కాపాడుకుంటుందా చూడాలి.

**విలియమ్సన్ అవుట్...**

న్యూజిలాండ్ కూడా గాయాలతో సతమతమవుతోంది. టి20ల్లో ఆడని బౌల్ట్, ఫెర్గూసన్, హెన్రీ ఇప్పటికీ కోలుకోకపోగా, కెప్టెన్ విలియమ్సన్ కూడా గాయంతో తొలి రెండు వన్డేల నుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో లాథమ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. కెప్టెన్సీతో పాటు విలియమ్సన్ బ్యాటింగ్ సేవలు కోల్పోవడం జట్టుకు పెద్ద లోటు. లాథమ్ అద్భుతమైన ఫామ్‌లో ఉండటం చెప్పుకోదగ్గ అంశం. వన్డేల్లో టేలర్ ప్రభావవంతమైన బ్యాట్స్‌మన్ కాబట్టి అతడిపై జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

తుది జట్ల వివరాలు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), పృథ్వీ షా, మయాంక్, అయ్యర్, రాహుల్, పాండే, జడేజా, శార్దూల్, షమీ, కుల్దీప్, బుమ్రా. **న్యూజిలాండ్:** లాథమ్ (కెప్టెన్), గప్టిల్, నికోల్స్, చాప్‌మన్, టేలర్, గ్రాండ్‌హోమ్, నీషమ్, సాన్‌ట్నర్/సోధి, జేమిసన్, బెన్నెట్, కుగ్‌లీన్.

# పృథ్వీ షా పునరాగమనం

ముంబై: న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో తలపడే భారత జట్టును సెలక్షన్ కమిటీ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. యువ ఆటగాడు పృథ్వీ షా టెస్టు జట్టులోకి పునరాగమనం చేశాడు. గాయపడిన రోహిత్ శర్మ స్థానంలో సెలక్టర్లు షాను ఎంపిక చేశారు. 2018 అక్టోబరులో అరంగేట్ర టెస్టులోనే సెంచరీతో ఆకట్టుకున్న పృథ్వీ ఆ తర్వాత మరో టెస్టు ఆడాడు. అయితే ఆ తర్వాత గాయాలతో పాటు డోపింగ్ నిషేధం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. మరో యువ బ్యాట్స్‌మన్ శుబ్‌మన్ గిల్ కూడా జట్టులో తన స్థానం నిలబెట్టుకున్నాడు.

# ప్రజ్నేశ్ శుభారంభం

## క్వార్టర్స్‌లో పేస్ జంట



పుణే: టాటా ఓపెన్ మహారాష్ట్ర ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రజ్నేశ్ 7–6 (7/4), 7–6 (7/5)తో యానిక్ మాడెన్ (జర్మనీ)పై గెలుపొందాడు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో అర్జున్ ఖడే (భారత్) 2–6, 4–6తో జిరీ వెసిలీ (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో లియాండర్ పేస్ (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6–2, 7–6 (7/5)తో రెండో సీడ్ దివిజ్ శరణ్ (భారత్)–ఆర్టెమ్ సితాక్ (న్యూజిలాండ్) జోడీపై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరింది.

**Department of Agriculture,
Government of Andhra Pradesh**
**REQUEST FOR PROPOSAL (RFP)**
Department of Agriculture, AP invites bids for selection of Agencies for Books Printing and Supply for Dr. YSR Polambadi & Rythu Bharosa Kendralu. For other details please visit **www.apagrisnet.gov.in** or **www.tender.apeprocurement.gov.in**
Sd/- Sri H. Arun Kumar, I.A.S.,
Special Commissioner of Agriculture
DIPR Ro. No.374-PP/CL/ADVT/1/1/2019-20, Dt: 04-02-2020

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**
**సమాచార మరియు పౌర సంబంధాల శాఖ**
**టెండరు ప్రకటన**
టెండరు ప్రకటన నం.006363/VE/DE/2019 తేది: 04.02.2020
వీడియో కెమేరాలు మరియు ఫొటో కెమెరాలు కొనుగోలు చేయుట కోసం ప్రముఖ కంపెనీలు/సంస్థల అధీకృత డీలర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి.
టెండరు డాక్యుమెంట్‌ను Dy EIE, కమిషనర్ కార్యాలయం, సమాచార & పౌర సంబంధాల శాఖ, 2వ అంతస్తు, NTR అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, RTC కాంప్లెక్స్, విజయవాడ నుండి 05.02.2020 నుండి 12.02.2020 వరకు అన్ని పని రోజులలో ఉ.10.00 గం. నుండి మ.3.30 గం. మధ్య పొందవచ్చును. అందుకుగాను అకౌంట్స్ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ & పబ్లిక్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్ విజయవాడ పేరున తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో వాపసురాని మొత్తం రూ.2000/– (రెండు వేల రూపాయలు మాత్రమే) చెల్లించాలి. టెండరు డాక్యుమెంట్ల దాఖలుకు ఆఖరి తేది: 13.02.2020న మ.3.30 గం. వరకు. టెండర్లు తెరుచు తేది: 14.02.2020 ఉ.11.30 గం. తదుపరి వివరాలకు సంప్రదించండి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్, I&PR డిపార్ట్‌మెంట్, (మొబైల్ నం.9121215334 & 9121215241)
సం/– టి. విజయ్‌కుమార్ రెడ్డి, కమిషనర్
DIPR Ro No.1813/CL/Advt/1/1/2019-20, Dt:04-02-2020

**ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్**
(భారత ప్రభుత్వ చట్టబద్ధమైన సంస్థ)
నెల్సన్ మండేలా మార్గ్, వసంత్‌కుంజ్, న్యూఢిల్లీ – 110 070. ఫోన్ : 011-26131578, 011-26131580, 011-29581000, వెబ్‌సైట్ : www.aicte-india.org

**ఆమోదిత ప్రక్రియ 2020-21 కోసం బహిరంగ ప్రకటన**

అకడమిక్ సెషన్ 2020–21 కోసం టెక్నికల్ ప్రోగ్రామ్స్ / కోర్సులు నిర్వహించడానికి ప్రస్తుతం ఉన్న మరియు కొత్త టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్స్ అన్నింటి నుంచి ఆమోదం కోసం AICTE దరఖాస్తులు కోరుతోంది. **వివరాలు www.aicte-india.org లో లభిస్తాయి.**

దరఖాస్తుదారులందరూ అకడమిక్ సెషన్ 2020–21 కోసం AICTE వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు దాఖలు చేయుటకు ముందు www.aicte-india.org లో లభించే AICTE అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్ బుక్ 2020–21 మరియు ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్‌కోసం ఆమోదం గ్రాంట్) నిబంధనలు, 2020ను జాగ్రత్తగా మరియు క్షుణ్ణంగా చదువుకోవలసిందిగా కోరబడుచున్నారు.

2020–21 సెషన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలు 6 ఫిబ్రవరి 2020న ప్రారంభమవుతుంది మరియు 29 ఫిబ్రవరి 2020న ముగించబడుతుంది. ప్రస్తుత సంస్థల కోసం సెల్ఫ్–డిస్‌క్లోజర్ ఆధారంగా ఆమోదం పొడిగింపు కోసం పెనాల్టీతో ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలుకు ఆఖరు తేదీ 5 మార్చి, 2020 వరకు అనుమతించబడును. తదుపరి తేదీ పొడిగింపు ఉండదని గమనించవలెను.

గమనిక : సంస్థలన్నీ ఆమోదిత ప్రక్రియ 2020–21కు సంబంధించిన అన్ని సాధారణ ప్రకటనలు, అప్‌డేటెడ్ సమాచారం మరియు అధికారిక సమాచారాల కోసం క్రమబద్ధంగా AICTE వెబ్‌సైట్ "www.aicte-india.org>Approval Process 2020-21 Quick link" చూడవలసిందిగా కోరబడుచున్నాయి. సంస్థలకు ఇండివిడ్యువల్‌గా ఎటువంటి ఇతర సమాచారం ఇవ్వబడదు.

AICTE దిగువ షెడ్యూలు ప్రకారం అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్ బుక్ 2020–21లో మార్పుల కోసం నిర్ధారణ స్టేక్ హోల్డర్స్ వర్క్‌షాప్స్ కూడా నిర్వహిస్తోంది. ఆసక్తి గల స్టేక్ హోల్డర్లు దాని కోసం పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చును.

10 ఫిబ్రవరి 2020 – ఉ. 10.00 గంటలు
సర్దార్ పటేల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, అంధేరి, ముంబయి
12 ఫిబ్రవరి 2020 – ఉ. 10.00 గంటలు
AICTE ఆడిటోరియం, న్యూఢిల్లీ
13 ఫిబ్రవరి 2020 – ఉ. 10.00 గంటలు
JNTU ఆడిటోరియం, అనంతపూర్

ప్రొఫెసర్ రాజీవ్ కుమార్
మెంబర్ సెక్రటరీ, AICTE
Advt. No. : Approval/02(02)/2020

సాక్షి బిజినెస్
బుధవారం
5-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 917 ▲ | 40,789 |
| నిఫ్టీ | 272 ▲ | 11,980 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు (తాజి రెండు రాత్రి 11.30కి) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,460 | ▲ 187 |
| డోజోన్స్ | 28,894 | ▲ 493 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,439 | ▲ 113 |
| డాక్స్ | 13,282 | ▲ 236 |
| షాంఘై | 2,783 | ▲ 37 |
| నికాయ్ | 23,085 | ▲ 113 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎపిఆడు | 70.50 | 72.14 |
| బ్రిటన్ పౌండ్ | ఎపిఆడు | 91.09 | 94.32 |
| యూరో | ఎపిఆడు | 77.41 | 80.33 |
| జపాన్ ఎన్ (100) | ఎపిఆడు | 64.37 | 66.80 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎపిఆడు | 46.92 | 49.06 |
| సింగపూర్ డాలర్ | ఎపిఆడు | 51.14 | 52.93 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.22 | 19.82 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.94 | 19.95 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.56 | 10.97 |

# బడ్జెట్ నష్టాలు భర్తీ



## రెండు రోజుల్లో రూ.3.57 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్ భారీ లాభాల కారణంగా 2 రోజుల్లో ఇన్వెస్టర్ల సంపద రూ.3.57 లక్షల కోట్లు ఎగసింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.3,57,044 కోట్లు పెరిగి రూ.156.62 లక్షల కోట్లకు చేరింది. ఒక్క మంగళవారం రోజే ఇన్వెస్టర్ల సంపద రూ.2.79 లక్షల కోట్లు ఎగబాకింది.

## కరోనా వైరస్ ప్రభావం నుంచి కోలుకుంటున్న ప్రపంచ మార్కెట్లు

- ఏడాది కనిష్టానికి ముడిచమురు ధరలు
- బ్లూచిప్ షేర్లలో వేల్యూ బయింగ్, షార్ట్ కవరింగ్
- డివిడెండ్ షేర్లలో జోరుగా కొనుగోళ్లు
- గణాంకాలు, ఆర్థిక ఫలితాల ప్రోత్సాహం
- 40 వేల పాయింట్లపైకి సెన్సెక్స్
- 917 పాయింట్ల లాభంతో 40,789 వద్ద ముగింపు
- 12,000 పాయింట్ల చేరువలో నిఫ్టీ
- 272 పాయింట్లు ఎగసి 11,980 పాయింట్లకు చేరిక

కరోనా వైరస్ మరింత ముదరకుండా గట్టి ప్రయత్నాలే జరుగుతున్నాయన్న భరోసాతో ప్రపంచ మార్కెట్లు కోలుకోవడం, ముడిచమురు ధరలు 13 నెలల కనిష్టానికి పడిపోవడంతో స్టాక్ మార్కెట్ మంగళవారం భారీగా లాభపడింది. సెన్సెక్స్ 40,000 పాయింట్లపైకి ఎగియగా, నిఫ్టీ 12,000 పాయింట్లకు 20 పాయింట్ల దూరంలో నిలిచింది. వరుసగా రెండో రోజూ సెన్సెక్స్, నిఫ్టీలు లాభపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం పుంజుకోవడం, బ్లూచిప్ షేర్లలో వేల్యూ, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు చోటు చేసుకోవడం సానుకూల ప్రభావం చూపించింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 917 పాయింట్లు ఎగసి 40,789 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 272 పాయింట్లు పెరిగి 11,980 పాయింట్ల వద్ద ముగిశాయి. శాతం పరంగా చూస్తే, సెన్సెక్స్ 2.3 శాతం, నిఫ్టీ 2.32 శాతం చొప్పున పెరిగాయి. గత నాలుగు నెలల్లో సెన్సెక్స్, నిఫ్టీ ఈ రేంజ్‌లో లాభపడటం ఇదే మొదటిసారి. అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ముగిశాయి.

**బడ్జెట్ నిరాశ నుంచి బయటకు...**

వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఉద్దేశించిన కేంద్ర బడ్జెట్ అంచనాలను అందుకోలేకపోవడంతో గత శనివారం జరిగిన ప్రత్యేక ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు భారీగా పతనమైన విషయం తెలిసిందే. బడ్జెట్ రోజున సెన్సెక్స్ 988 పాయింట్లు, నిఫ్టీ 300 పాయింట్ల మేర నష్టపోయాయి. మొత్తం మీద గత వారంలో ఈ సూచీలు 4.5 శాతం మేర నష్టపోయాయి. ఈ నష్టాలన్నింటినీ ఈ సూచీలు మంగళవారం భర్తీ చేసుకున్నాయని, మళ్లీ బడ్జెట్ ముందటి స్థాయికి చేరుకున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. బడ్జెట్ నిరాశ నుంచి ఇన్వెస్టర్లు తేరుకున్నారని, మార్కెట్‌ను నడిపించే కంపెనీల క్యూ3 ఫలితాలు, ఆర్థిక గణాంకాలపై దృష్టి సారిస్తున్నారని వారంటున్నారు.

**మరిన్ని విశేషాలు....**

- ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో టైటాన్ కంపెనీ షేరు 8 శాతం లాభంతో రూ.1,276 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే.
- మొత్తం 30 సెన్సెక్స్ షేర్లలో రెండు షేర్లు–బజాజ్ ఆటో, హిందుస్తాన్ యూనిలివర్ మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 28 షేర్లు లాభాల్లో ముగిశాయి.
- దాదాపు వందకు పైగా షేర్లు ఏడాది గరిష్ట స్థాయిలకు చేరాయి. వీటిలో సగం షేర్లు ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయిలకు ఎగిశాయి. ఆఫిల్ ఇండియా, ఐఆర్‌సీటీసీ, ఇండియామార్ట్ ఇంటర్‌మెష్, గోద్రేజ్ ప్రాపర్టీస్, హనీవెల్ ఆటోమేషన్, ఇన్ఫోఎడ్జ్ ఇండియా, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, బాటా ఇండియా, బెర్జర్ పెయింట్స్, డాబర్ ఇండియా, హెచ్‌యూఎల్, పీవీఆర్, రిలాక్సో ఫుట్‌వేర్, శ్రీ సిమెంట్, ఎస్‌ఆర్‌ఎఫ్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

### మార్కెట్ జోరు ఎందుకంటే...

- **కరోనా నుంచి కోలుకుంటున్న మార్కెట్లు...**

కరోనా వైరస్ కట్టడికి గట్టి ప్రయత్నాలే జరుగుతుండటంతో ప్రపంచ మార్కెట్లు కోలుకున్నాయి. మరోవైపు మందగమనాన్ని తట్టుకోవడానికి చైనా కేంద్ర బ్యాంక్ భారీగా నిధులను(17,300 కోట్ల డాలర్లు) విడుదల చేయాలని నిర్ణయించడం కూడా ప్రపంచ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపించింది. సోమవారం 7% పతనమైన షాంఘై సూచీ మంగళవారం 1.3 % పుంజుకుంది. జపాన్ నికాయ్, హాంకాంగ్ హాంగ్‌సెంగ్, దక్షిణ కొరియా కోస్పి సూచీలు 0.5%–1.8 శాతం మేర లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు కూడా లాభాల్లోనే ముగిశాయి. ఇక డౌజోన్స్ ఫ్యూచర్స్ కూడా 300 పాయింట్ల మేర ర్యాలీ జరిపింది.

- **దిగి వస్తున్న చమురు ధరలు...**

కరోనా వైరస్ భయాలతో వృద్ధి మందగిస్తుందని, ఫలితంగా చమురుకు డిమాండ్ పడిపోతుందనే ఆందోళనతో ముడి చమురు ధరలు క్షీణిస్తున్నాయి. జనవరి గరిష్ట స్థాయి నుంచి చూస్తే, బ్రెంట్ ముడిచమురు ధర దాదాపు 10 డాలర్లు పతనమైంది. చమురు ధరలు 20% పైగా తగ్గాయి. మూడొంతులకు పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న మన దేశానికి చమురు ధరలు తగ్గడం చాలా మేలు చేస్తుంది.

- **డివిడెండ్ షేర్ల జోరు...**

ఏప్రిల్ 1 తర్వాత డివిడెండ్ ఇస్తే, కంపెనీ ప్రమోటర్లు దాదాపు 40% డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ) చెల్లించాల్సి వస్తుందని అంచనా. ఈ భారాన్ని తప్పించుకునేందుకు పలు కంపెనీలు ఈ ఏడాది మార్చిలోపే డివిడెండ్‌ను ఇస్తాయనే అంచనాలతో డివిడెండ్ చెల్లించే షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి.

- **బడ్జెట్ బాగా లేకపోయినా...**

బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా లేకపోయినా, మరీ అధ్వానంగా అయితే లేదని, దీర్ఘకాలంలో వృద్ధికి తోడ్పడే విధంగానే ఉందని ఇన్వెస్టర్లు మెల్లగా గ్రహిస్తున్నారని నిపుణులంటున్నారు. కార్పొరేట్ బాండ్లలో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల పరిమితిని 9 శాతం నుంచి 15 శాతానికి పెంచడం, డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ భారాన్ని కంపెనీలపై తొలగించడం తదితర కారణాల వల్ల విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులకు భారత్ మరింత ఆకర్షణీయంగా అవతరించిందని వారంటున్నారు. అందుకే కొనుగోళ్లు జోరుగా జరిగాయని వారంటున్నారు.

- **షార్ట్ కవరింగ్, వేల్యూ బయింగ్ కొనుగోళ్లు**

శనివారం నాటి భారీ పతనం కారణంగా పలు బ్లూచిప్ షేర్లు ఆకర్షణీయ ధరల్లో లభ్యమవుతుండటంతో వేల్యూ బయింగ్ చోటుచేసుకుంది. మరోవైపు షార్ట్ పొజిషన్లను కవర్ చేసుకునేందుకు ట్రేడర్లు షార్ట్ కవరింగ్‌కు దిగడం కూడా కలిసివచ్చింది.

- **ఎనిమిదేళ్ల గరిష్టానికి తయారీ రంగ పీఎమ్‌ఐ**

ఈ ఏడాది జనవరి నెలలో తయారీ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎమ్‌ఐ) ఎనిమిదేళ్ల గరిష్టానికి ఎగసింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందనడానికి ఇదే నిదర్శనమని భావించి ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరిపారు.

- **పుంజుకున్న రూపాయి...**

డాలర్‌తో రూపాయి మారకం విలువ పెరిగింది. 11 పైసలు పుంజుకొని 71.27కు చేరింది.

- **గణాంకాల, ఫలితాల ప్రోత్సాహం...**

జనవరి వాహన విక్రయ గణాంకాలు ఒకింత ప్రోత్సాహకరంగానే ఉన్నాయి. అంతేకాకుండా కంపెనీల క్యూ3 ఫలితాలు మరీ నిరాశమయంగా కాకుండా ఒకింత మెరుగ్గానే ఉన్నాయి.

## రూ. 5 లక్షల డిపాజిట్ బీమా అమల్లోకి...

**న్యూఢిల్లీ:** బ్యాంకు డిపాజిట్లకు పెంచిన బీమా కవరేజీ మంగళవారం నుంచే అమల్లోకి తెచ్చినట్లు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. బ్యాంకు డిపాజిట్లపై బీమా కవరేజీని ప్రస్తుతమున్న రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచుతున్నట్లు 2020–21 బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.



ఆర్‌బీఐలో భాగమైన డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఈసీజీసీ) ఈ కవరేజీ ఇస్తుంది. మరోవైపు, డిపాజిట్లపై బీమా కవరేజీని పెంచే ప్రతిపాదనకు ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఆమోదం తెలిపింది. దాదాపు 27 ఏళ్ల తర్వాత దీన్ని సవరించినట్లు ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ మంగళవారం మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ప్రతి రూ. 100 డిపాజిట్‌పై బ్యాంకులు ఇకపై 12 పైసల ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.


### సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- బీమా షేర్ల టార్గెట్ ధరల్లో కోత?
- ఐటీసీ షేరు పతనం... పన్నుపోటొక్కటే కారణమా?
- ఈ 16 షేర్లకూ బడ్జెట్.. భారం?!
- కేజీ బ్లాక్ వార్తలా? డివిడెండ్‌పై ఆశలా?

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్..
సమగ్ర బడ్జెట్ వివరాలు, విశ్లేషణలు,
మార్కెట్ అప్‌డేట్స్ కోసం...
SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం..
ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
WWW.BUSINESS.SAKSHI.COM


# వృద్ధి లక్ష్య సాధన కష్టమే: మూడీస్



**న్యూఢిల్లీ:** భారత్ వృద్ధి లక్ష్య సాధన కొంత కష్టమేనని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం– మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. 2019–20లో 4.9 శాతం వాస్తవ వృద్ధి రేటు నమోదయ్యే వీలుందని, 2020–21లో ఈ రేటు 5.5 శాతానికి పెరగవచ్చని అంచనా వేసింది. భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధనకు ప్రధానంగా సంస్థాగత సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంటుందని పేర్కొంది. తాజాగా సీతారామన్ ఆర్థిక బడ్జెట్ ప్రకారం– 2020–21లో భారత్ నామినల్ (ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా) స్థూల దేశీయోత్పత్తి 10 శాతం. 2021–22, 2022–23ల్లో ఇది 12.6 శాతం, 12.8 శాతానికి పెరుగుతుందని బడ్జెట్ అంచనావేసింది. అయితే 2019–20లో ఈ రేటు 7.5 శాతంగా ఉంటుందని, 2020–21లో 8.7 శాతంగా నమోదవుతుందని మూడీస్ అంచనావేసింది. కాగా, ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్‌కి మించిన స్థాయిలోనే భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి అతనూ చక్రవర్తి తెలిపారు.

# హైదరాబాద్‌లో ఎక్స్‌పీరియన్ సెంటర్




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఐర్లాండ్‌కు చెందిన డేటా, అనలిటిక్స్ కంపెనీ ఎక్స్‌పీరియన్.. ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పింది. హైటెక్‌సిటీ వద్ద 35,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నెలకొల్పారు. ప్రస్తుతం 200 మంది ఇంజనీర్లు ఇక్కడ పనిచేస్తున్నారు. 2024 నాటికి ఉద్యోగుల సంఖ్యను 2,500 స్థాయికి తీసుకు వెళ్లనున్నట్టు కంపెనీ తెలిపింది. తెలంగాణ పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఈ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు.

**యాక్సెంచర్ ఇన్నోవేషన్ హబ్ కూడా**

ప్రొఫెషనల్, కన్సల్టింగ్ సర్వీసుల్లో ఉన్న అమెరికన్ కంపెనీ యాక్సెంచర్ హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేసింది. 3,00,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నెలకొల్పారు. భాగ్యనగరి సెంటర్‌లో 2,000 మంది ఉద్యోగులు ఉన్నట్టు సంస్థ వెల్లడించింది. ఈ కేంద్రంలో డిజిటల్ ఎకానమీకి అవసరమైన ఉత్పత్తులు, సేవలను యాక్సెంచర్‌తో కలిసి క్లయింట్లు ఆవిష్కరించాల్సి ఉంటుంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో సంస్థ తొలి నానో ల్యాబ్ ఒక్కడ కొలువుదీరింది. సంస్థకు ఇప్పటికే ఇన్నోవేషన్ హబ్ బెంగళూరులో ఉంది.

## పీఎన్‌బీపై మొండి భారం

### క్యూ3లో రూ. 492 కోట్ల నష్టాలు



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కు ఈ ఆర్థిక సంవత్సరం (2019–20) డిసెంబర్ క్వార్టర్‌లో రూ.492 కోట్ల నికర నష్టాలు(స్టాండ్‌అలోన్) వచ్చాయి. మొండి బకాయిలకు కేటాయింపులు పెరగడమే దీనికి ప్రధాన కారణం. 2018–19 ఇదే క్వార్టర్‌లో బ్యాంక్ రూ.247 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇక ఆదాయం రూ.14,854 కోట్ల నుంచి రూ.15,967 కోట్లకు పెరిగింది.

**16.30%కి స్థూల మొండి బకాయిలు...**

కన్సాలిడేషన్ పరంగా చూస్తే, గత క్యూ3లో రూ.250 కోట్ల నికర లాభం రాగా, ఈ క్యూ3లో రూ.502 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. ఆదాయం రూ.15,105 కోట్ల నుంచి రూ.16,211 కోట్లకు పెరిగింది. గత క్యూ3లో 16.33 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 16.30 శాతానికి, నికర మొండి బకాయిలు 8.22 శాతం నుంచి 7.18 శాతానికి తగ్గాయి. గత క్యూ3లో రూ.2,566 కోట్లుగా ఉన్న మొండి బకాయిలకు కేటాయింపులు ఈ క్యూ3లో రూ.4,445 కోట్లకు పెరిగాయి. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో బ్యాంక్ షేర్ 1 శాతం నష్టంతో రూ.56.75 వద్ద ముగిసింది.

# సంశయం వద్దు... పెట్టుబడులు పెట్టు!

**పారిశ్రామిక రంగానికి ఆర్థికమంత్రి విజ్ఞప్తి**



**న్యూఢిల్లీ:** ఆర్థికాభివృద్ధికి పెట్టుబడులు పెట్టాలని, ఈ విషయంలో ఎటువంటి సంశయాలకూ తావివ్వవద్దని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పారిశ్రామిక రంగానికి విజ్ఞప్తి చేశారు. 2020–21 వార్షిక బడ్జెట్‌పై సీఐఐ మంగళవారం ఇక్కడ నిర్వహించిన ఒక చర్చాగోష్టిలో ఆమె ప్రసంగించారు. పారిశ్రామిక రంగం పురోగతికి ప్రభుత్వం తగిన అన్ని చర్యలూ తీసుకుంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వ వ్యయాలే వృద్ధికి తోడ్పాటును అందిస్తాయని తాను భావించడం లేదని తెలిపారు. పరిశ్రమ కూడా సందేహాలను వదిలి, పెట్టుబడులు పెట్టాలని కోరారు. వృద్ధికి ఇది ఎంతో అవసరమని వివరించారు.

# బిల్లు తీసుకుంటే రూ.కోటి దాకా నజరానా

- జీఎస్‌టీని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్లాన్
- రూ. 10 లక్షల నుంచి రూ. 1 కోటి దాకా లాటరీ




**న్యూఢిల్లీ:** వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడంపై కేంద్రం దృష్టి పెట్టింది. కొన్న ప్రతీ వస్తువుకు విక్రేతల నుంచి కచ్చితంగా బిల్లు తీసుకునేలా కొనుగోలుదారులను ప్రోత్సహించే చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రూ. 10 లక్షల నుంచి రూ. 1 కోటి దాకా బహుమతులు ఇచ్చేలా లాటరీని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) సభ్యుడు జాన్ జోసెఫ్ ఈ విషయాలు తెలిపారు. జీఎస్‌టీ కింద తీసుకునే ప్రతి బిల్లుతోనూ కస్టమర్లు.. లాటరీలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. 'కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకే లాటరీ బిల్లు భారీ స్థాయిలో పెడుతున్నాం. కాబట్టి బిల్లు తీసుకోకుండా 28 శాతం (గరిష్ట జీఎస్‌టీ) పొదుపు చేయడం కన్నా రూ. 10 లక్షలో లేదా రూ. 1 కోటి దాకా గెలవడానికి అవకాశం ఉంటుంది కదా అని కొనుగోలుదారులు ఆలోచించడానికి ఆస్కారం ఉంటుంది. పన్నుల చెల్లింపుపై కొనుగోలుదారుల ఆలోచనా ధోరణులను మార్చేందుకు ఇలాంటివి ఉపయోగపడగలవు' అని ఆయన పేర్కొన్నారు. ప్రణాళిక ప్రకారం లాటరీలో పాల్గొనాలంటే కనీస బిల్లు మొత్తం ఉంటుంది. వినియోగదారుల సంక్షేమ నిధి నుంచి లాటరీ మొత్తాన్ని చెల్లిస్తారు. కొనుగోలుదారుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేసి లాభాలు ఆర్జించిన వ్యాపార సంస్థలపై విధించిన జరిమానాలను ఈ నిధికి బదలాయిస్తున్నారు.

## మార్కెట్‌లోకి పోకో ఎక్స్2 స్మార్ట్‌ఫోన్




ఎక్స్2తో పోకో ఇండియా జీఎం మన్‌మోహన్ చందోలు

**న్యూఢిల్లీ:** స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ పోకో తాజాగా ఎక్స్2 మోడల్‌ను విడుదల చేసింది. ఆన్‌డ్రాయిడ్ 10 ఓఎస్, 2400X1080 రిసొల్యూషన్‌తో 6.67 అంగుళాల ఫుల్ హెచ్‌డీ 120 హెర్ట్జ్ డిస్‌ప్లే, రెండు వైపులా కార్నింగ్ గొరిల్లా గ్లాస్–5, లిక్విడ్ కూల్ టెక్నాలజీతో క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 730జి ప్రాసెసర్, 8 జీబీ ర్యామ్, 256 జీబీ వరకు స్టోరేజీ ఉంది. క్వాడ్ కెమెరా సెటప్‌లో భాగంగా తొలిసారిగా సోనీ రూపొందించిన ఐఎంఎక్స్686 రకం 64 మెగాపిక్సెల్ వైడ్ యాంగిల్ సెన్సార్, అల్ట్రా వైడ్ యాంగిల్ లెన్స్‌తో 8 ఎంపీ సెన్సార్, ఆటోఫోకస్‌తో 2 ఎంపీ మాక్రో షూటర్, 2 ఎంపీ డెప్త్ సెన్సార్ పొందుపరిచారు. సెల్ఫీల కోసం డ్యూయల్ ఇన్ స్క్రీన్ కెమెరా ఏర్పాటు చేశారు. వేరియంట్‌ను బట్టి ధర రూ.15,999–19,999 మధ్య ఉంది. ఫ్లిప్‌కార్ట్‌లో ఫిబ్రవరి 11 నుంచి లభిస్తుంది.

# ఎయిర్‌టెల్ నష్టాలు 1,035 కోట్లు

- ఏజీఆర్ వడ్డీ కేటాయింపుల భారం
- 9 శాతం వృద్ధితో రూ.21,947 కోట్లకు ఆదాయం
- రూ.135కు పెరిగిన ఏఆర్‌పీయూ




**న్యూఢిల్లీ:** టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌కు ఈ ఆర్థిక సంవత్సరం (2019–20) మూడో త్రైమాసిక కాలంలో రూ.1,035 కోట్ల నికర నష్టాలు(కన్సాలిడేటెడ్) వచ్చాయి. ఏజీఆర్(సవరించిన స్థూల రాబడి) బకాయిల వడ్డీకి సంబంధించిన కేటాయింపులు, 3జీ నెట్‌వర్క్ పరికరాలపై తరుగుదల, తదితర అంశాల కారణంగా ఈ నష్టాలు వచ్చాయని భారతీ ఎయిర్‌టెల్ తెలిపింది. కంపెనీకి వరుసగా మూడో క్వార్టర్‌లోనూ నష్టాలు వచ్చాయని వివరించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.86 కోట్ల నికర లాభం ఆర్జించామని పేర్కొంది. ఆదాయం మాత్రం రూ.20,231 కోట్ల నుంచి 9% వృద్ధితో రూ.21,947 కోట్లకు పెరిగిందని తెలిపింది. గత క్యూ3లో రూ.128గా ఉన్న ఏఆర్‌పీయూ(ఒక్కో వినియోగదారుడి నుంచి సగటు రాబడి) ఈ క్యూ3లో రూ.135కు పెరిగింది.

**భారత ఆదాయం 7 శాతం వృద్ధి...**

భారత కార్యకలాపాల ఆదాయం 7 శాతం వృద్ధితో రూ.15,797 కోట్లకు పెరిగింది. ఆఫ్రికా కార్యకలాపాల ఆదాయం 14 శాతం వృద్ధి చెందాయి. డేటా, కాల్ చార్జీలను 50 శాతం వరకూ పెంచడం సానుకూల ప్రభావం చూపించింది. డేటా ట్రాఫిక్ 73 శాతం పెరిగింది. ఈ క్యూ3లో అత్యధికంగా (2.1 కోట్ల మంది) కొత్తగా 4జీ వినియోగదారులయ్యారు. కాగా ఈ క్యూ2లో భారతీ ఎయిర్‌టెల్‌కు రూ.23,045 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. కంపెనీ చరిత్రలో ఇవే అత్యధిక నష్టాలు.

## గతి నష్టం రూ. 5 కోట్లు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** లాజిస్టిక్స్ కంపెనీ గతి లిమిటెడ్ డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో రూ.5.3 కోట్ల నష్టం చవిచూసింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.4 కోట్ల నికరలాభం సాధించింది. టర్నోవరు రూ.483 కోట్ల నుంచి రూ.448 కోట్లకు వచ్చి చేరింది. మంగళవారం గతి షేరు 0.52 శాతం పెరిగి రూ.68.10 వద్ద స్థిరపడింది.

## తగ్గిన అవంతి ఫీడ్స్ లాభం

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో అవంతి ఫీడ్స్ నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 31.4% తగ్గి రూ.58.4 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవరు రూ.849 కోట్ల నుంచి రూ.942 కోట్లకు ఎగబాకింది. షేరు ధర 0.39% తగ్గి రూ.668.40 వద్ద స్థిరపడింది.

## నేటి బోర్డ్ మీటింగ్స్...

హెచ్‌పీసీఎల్, డీఎల్‌ఎఫ్, దివీస్ ల్యాబ్స్, క్యాడిలా హెల్త్‌కేర్, సిప్లా, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ గ్యాస్, ఆంధ్రాబ్యాంక్

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (99.9, 10గ్రా) | 41,580 | ▼ 210 |
| బంగారం (99.5, 10గ్రా) | 39,600 | ▼ 200 |
| వెండి (కిలో) | 49,700 | ▼ 600 |
| **హైదరాబాద్/చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,490 | ▼ 280 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,560 | ▼ 270 |
| వెండి (కిలో) | 49,700 | ▼ 600 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,800 | ▼ 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,730 | ▼ 50 |
| వెండి (కిలో) | 47,300 | ▼ 400 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,740 | ▼ 380 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,560 | ▼ 380 |
| వెండి (కిలో) | 47,000 | ▼ 300 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,740 | ▼ 380 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,560 | ▼ 380 |
| వెండి (కిలో) | 47,300 | ▼ 300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 5-2-2020

| | |
|---|---|
| విశాఖ | 375–00 |
| చిత్తూరు | 383–00 |
| వరంగల్ | 333–00 |
| విజయవాడ | 325–00 |
| గోదావరి | 325–00 |
| **4–2–2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 330–00 |

# ఎయిరిండియా రేసులో టాటా

- సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి బిడ్ చేసే యోచన
- ఎయిర్‌ఏషియా చీఫ్ టోనీతో చర్చలు




**ముంబై:** దాదాపు 87 ఏళ్ల క్రితం తాము ప్రారంభించిన విమానయాన సంస్థ .. ఎయిరిండియాను తిరిగి దక్కించుకునేందుకు టాటా గ్రూప్ గట్టిగా కసరత్తు చేస్తోంది. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి ఎయిరిండియా కోసం బిడ్ చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దిశగా నిబంధనలకు అనుగుణంగా వ్యూహాలు రూపొందించుకుంటోంది. ఎయిరిండియా ఫుల్ సర్వీస్ విభాగాన్ని విస్తారాతో కలిసి, చౌక చార్జీల విభాగం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌ను ఎయిర్ ఏషియా ఇండియాతో కలిసి నడపవచ్చని యోచిస్తోంది. ప్రస్తుతం మలేసియాకు చెందిన ఎయిర్ ఏషియాతో కలిసి చౌక చార్జీల ఎయిర్‌లైన్స్ వెంచర్ ఎయిర్‌ఏషియా ఇండియా, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో ఫుల్ సర్వీస్ ఎయిర్‌లైన్స్ వెంచర్ విస్తారాను టాటా గ్రూప్ నిర్వహిస్తోంది. ఎయిర్ ఏషియాతో భాగస్వామ్య ఒప్పందం ప్రకారం.. ముందస్తు అనుమతి లేకుండా మరో చౌక బడ్జెట్ ఎయిర్‌లైన్స్‌లో టాటా గ్రూప్ 10 శాతానికి మించి ఇన్వెస్ట్ చేయడానికి వీలు లేదు. ఎయిరిండియాకు బిడ్ చేసే క్రమంలో ఈ నిబంధనను సడలింపచేసుకునేందుకు టాటా గ్రూప్ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఎయిరిండియాలో బడ్జెట్ విభాగమైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌ను.. ఎయిర్‌ఏషియా ఇండియాలో విలీనం చేసే ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. దీనికి ఆమోదం పొందేందుకు ఎయిర్‌ఏషియా చీఫ్ టోనీ ఫెర్నాండెజ్‌తో సంప్రతింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కొత్త ఒప్పందం త్వరలోనే కుదుర్చుకోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎయిరిండియా కొనుగోలుకు ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు దాఖలుకు మార్చి 17 ఆఖరు తేదీ.

**ఉభయతారకం..:** ఫెర్నాండెజ్.. టాటా ప్రతిపాదనకు ఓకే చెబితే రెండు వర్గాలకు ఇది ప్రయోజనకరంగానే ఉండగలదని నిపుణులు పేర్కొన్నారు. టాటా సన్స్‌తో జాయింట్ వెంచర్ కింద 2013లో ఎయిర్‌ఏషియా .. భారత్‌లో చౌక చార్జీల విమానయాన కార్యకలాపాలు ప్రారంభించింది. ఇందులో టోనీకి 49%, టాటా సన్స్‌కు 51% వాటాలున్నాయి. ఆ తర్వాత సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి టాటా గ్రూప్ విస్తారా పేరిట ఫుల్ సర్వీస్ ఎయిర్‌లైన్స్ ప్రారంభించింది. ఇందులో టాటాలకు 51% వాటాలున్నాయి. ఎయిర్ ఏషియా ఇండియా.. విదేశాలకు సర్వీసులు ప్రారంభించేందుకు చాలాకాలంగా పర్మిషన్ల కోసం ఎదురు చూస్తోంది. ఇటీవలే క్రిమినల్ కుట్ర, మనీ లాండరింగ్ ఆరోపణలతో ఫెర్నాండెజ్‌తో పాటు ఎయిర్‌ఏషియా బోర్డులో టాటా గ్రూప్ నామినీ ఆర్ వెంకటరమణన్ తదితరులపై కేసులు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఎయిర్‌ఏషియా ఇండియాకు విదేశీ అనుమతులు రావడంలో జాప్యం జరిగే అవకాశం ఉంది. కాబట్టి ఎయిర్‌ఏషియా ఇండియాలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విలీనం ప్రతిపాదనకు ఫెర్నాండెజ్ అంగీకరిస్తే.. భారత విమానయానంలో మరింత పెద్ద పాత్ర పోషించేందుకు సత్వరం అవకాశం లభించగలదు.

### ఎయిరిండియాలోకి 100 శాతం ఎఫ్‌డీఐలపై దృష్టి

ఎయిరిండియా డిజిన్వెస్ట్‌మెంట్ ప్రణాళికను మరింత వేగవంతం చేసే దిశగా.. కంపెనీలో 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించే ప్రతిపాదనను కేంద్రం పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఎయిరిండియాలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై (ఎఫ్‌డీఐ) పరిమితి 49 శాతంగా ఉంది. దీన్ని 100 శాతానికి పెంచిన పక్షంలో ప్రవాస భారతీయులు (ఎన్నారై) కూడా పూర్తి స్థాయిలో ఇన్వెస్ట్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో 49 శాతం పరిమితి నిబంధనను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలంటూ పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగాన్ని (డీపీఐఐటీ) పౌర విమానయాన శాఖ కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిపై వివిధ శాఖల అభిప్రాయాలు కోరుతూ డ్రాఫ్ట్ నోట్ జారీ చేసినట్లు వివరించాయి.

# సంస్థాగత ఎన్నికలు త్వరలోనే పూర్తి చేస్తాం

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: పార్టీ సంస్థాగత ఎన్నికలను త్వరలోనే పూర్తి చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వెల్లడించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర పదాధికారులు, కోర్ కమిటీ, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జీల సమావేశం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఇందులో మున్సిపల్ ఎన్నికలు, వాటి ఫలితాలు, పార్టీ సంస్థాగత ఎన్నికలు, పౌరసత్వ సవరణ చట్టానికి మద్దతుగా ప్రచారం తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ జరిపారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు పౌరసత్వ సవరణ చట్టంపై ఇంటింటి ప్రచారం చేస్తామన్నారు. ఈ చట్టంపై అసెంబ్లీ తీర్మానం చెల్లదని తెలిసి కూడా కేసీఆర్ తీర్మానం చేస్తానని అంటున్నారని విమర్శించారు. కేసీఆర్, ఒవైసీ కలిసి మత రాజకీయాలు చేస్తూ భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని ఏ కారణాలతో అడ్డుకుంటున్నారో చెప్పకుండా ముస్లింలకు వ్యతిరేకం అని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దాన్ని తిప్పికొట్టేందుకే తాము ఇంటింటికీ వెళ్తామని, కేసీఆర్, ఒవైసీలను ప్రజల ముందు దోషులుగా నిలబెడతామని లక్ష్మణ్ హెచ్చరించారు. సహకార సంఘాల ఎన్నికల్లో అడ్డదారిలో గెలవాలని కేసీఆర్ అనుకుంటున్నారని, దానిని భగ్నం చేస్తామని స్పష్టం చేశారు. సహకార సంఘం ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో పోటీ చేయాలని నిర్ణయించామని తెలిపారు.

# 2021 నుంచి నైనీ బొగ్గు

- 5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి..
- సమీక్షలో సింగరేణి సీఎండీ శ్రీధర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఒడిశాలో సింగరేణి బొగ్గు గనుల సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాకు నుంచి 2021 మార్చి నాటికి 5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలని సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. సింగరేణిభవన్‌లో మంగళవారం ఆయన కొత్త గనులపై సమీక్ష నిర్వహించారు. 350 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు కలిగిన నైనీ బ్లాకు నుంచి ఉత్పత్తి ప్రారంభించేందుకు ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ బొగ్గు బ్లాకు నుంచి పెద్ద ఎత్తున బొగ్గు ఉత్పత్తి జరగనున్న నేపథ్యంలో ఈ గని వరకు రైల్వే మార్గాన్ని వేసేందుకు సింగరేణి సంస్థ, కోల్ ఇండియా కంపెనీతో కలసి జాయింట్ వెంచర్‌గా ఏర్పడనుంది. జాయింట్ వెంచర్‌గా ఏర్పడిన తర్వాత నైనీ గని వరకు వేసే రైల్వే లైనుకు తన వంతుగా సింగరేణి నిధులను కేటాయించబోతోంది. 'ఒడిశాలోని అంగూల్ జిల్లా రెవెన్యూ, అటవీ శాఖ సహకారంతో ఇప్పటికే అటవీ, ప్రభుత్వ, ప్రైవేటు భూముల సేకరణకు సంబంధించిన ప్రక్రియ వేగవంతమైంది. 783.27 హెక్టార్ల అటవీ భూముల సేకరణకు సింగరేణి సంస్థ రూ.450 కోట్లను చెల్లించాల్సి ఉంది. ఈ కేటాయింపుల కోసం వచ్చే సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ప్రతిపాదించి, అనుమతి పొందనున్నారు. ఈ సమావేశంలోనే ఫీజిబిలిటీ రిపోర్టును ఆమోదిస్తారు'అని సింగరేణి సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. '2020 జూన్ నాటికి మూడు గ్రామాల ప్రైవేటు భూముల సేకరణ పూర్తి చేయనున్నారు.

# సాగునీటి శాఖ ఇంజనీర్లకు పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సాగునీటి శాఖ పరిధిలో పని చేస్తున్న ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సీఎం కేసీఆర్ పదోన్నతుల ఫైలుపై సంతకం చేశారు. పదోన్నతుల్లో భాగంగా ఇప్పటివరకు సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా ఉన్న 10 మంది చీఫ్ ఇంజనీర్లుగా పదోన్నతులు పొందనున్నారు. వీరితో పాటే 25 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్‌ఈలుగా, మరో 75 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఈఈలుగా పదోన్నతులు దక్కనున్నాయి. పదోన్నతులు కల్పిస్తూ సీఎం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు నల్లా వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ నూనె శ్రీధర్, ప్రధాన కార్యదర్శి టి.వేణు, హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు చక్రధర్ హర్షం వ్యక్తం చేశారు.

# ప్రొ.కాశిం అరెస్ట్‌పై విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కాశింను పోలీసులు తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్ట్ చేశారని దాఖలైన కేసు విచారణ గురువారానికి వాయిదా పడింది. రాష్ట్ర పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ దాఖలు చేసిన రిట్‌లో తమ వాదనలు తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిషేధిత మావోయిస్టు పార్టీతో కాశింకు సంబంధాలు ఉన్నాయని పోలీసులు చెప్తున్నారు. కావాలనే కాశింపై కేసు బనాయించారని, ప్రజా గళాలు వినిపించకుండా పోలీసులు చేస్తున్నారని పిటిషనర్ వాదిస్తున్నారు. ఇరుపక్షాల వాదనలను గురువారం విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం మంగళవారం పేర్కొంది.




అడవి అంతా మంచుమయమై కనిపిస్తున్న ఈ ప్రాంతం జర్మనీలోని విల్లిన్‌జెన్‌లోది. మంగళవారం దట్టంగా మంచు కురవడంతో ఇలా ఆహ్లాదకరంగా కనువిందు చేస్తోంది

# కొత్త రూట్లో మెట్రో కూత

- జేబీఎస్–ఎంజీబీఎస్ మార్గంలో మెట్రో రైలు పరుగులు
- 7న జెండా ఊపి ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- మొత్తంగా 3 కారిడార్లతో తొలిదశ ప్రాజెక్టు పూర్తి
- ఢిల్లీ తర్వాత అతిపెద్ద మెట్రోగా హెచ్ఎంఆర్
- పీపీపీ మోడల్‌లో ప్రపంచంలో అతి పెద్దది.. తొలి ప్రాజెక్ట్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు మరో కొత్త రూట్లో పరుగులు తీయడానికి సిద్ధమైంది. జేబీఎస్– ఎంజీబీఎస్ రూట్లో ఇది ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. 7వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జేబీఎస్ వద్ద జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జెండా ఊపి ఈ మూడవ మెట్రో రైలు కారిడార్‌ను ప్రారంభిస్తారు. హైదరాబాద్– సికింద్రాబాద్ జంట నగరాలను అనుసంధానించే ఈ మార్గాన్ని.. మెట్రో అధికారులు వ్యయ ప్రయాసలకోర్చి పూర్తి చేశారు. తొలుత సంక్రాంతి నాటికి ప్రారంభించేందుకు ప్రయత్నించినా, మున్సిపల్ ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యమైంది. ఈ మార్గం అందుబాటులోకి రానుండటంతో నగరంలో తొలి దశ మెట్రో ప్రాజెక్టు సంపూర్ణమైంది. ప్రస్తుతం ఎల్బీ నగర్–మియాపూర్ రూటులో 29 కిలోమీటర్లు, నాగోలు– రాయదుర్గం రూటులో 29 కిలోమీటర్ల మేర మెట్రో రైలు మార్గం అందుబాటులో ఉంది. ఈ రెండు రూట్లలో నిత్యం 3.80 లక్షల నుంచి 4 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. 7న ప్రారంభమయ్యే నూతన మార్గంతో కలిపి మొత్తంగా మూడు కారిడార్ల పరిధిలో 69 కిలోమీటర్ల మేర నగరంలో మెట్రో రైలు అందుబాటులోకి వస్తుంది. దేశ రాజధాని ఢిల్లీ తర్వాత అత్యంత నిడివి గల మెట్రో మార్గమున్న నగరంగా గ్రేటర్ హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. అలాగే, ప్రపంచంలోనే పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టిన మొదటి, అతిపెద్ద మెట్రో ప్రాజెక్టు మనదే కావడం విశేషం.

### పాతనగరానికి మరింత ఆలస్యం..

జేబీఎస్ – ఎంజీబీఎస్.. ఈ రెండు బస్సుస్టే(ష)న్లకు పొరుగు రాష్ట్రాలు, దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు నగరంలో ఒక చోటు నుంచి మరోచోటుకు ప్రయాణించేందుకు ఈ మెట్రో మార్గం వీలు కల్పిస్తుంది. కొత్త మార్గంలో 45 రోజుల పాటు మెట్రో రైళ్లకు 18 రకాల సామర్థ్య పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి కమిషనర్ ఆఫ్ రైల్వేసేఫ్టీ ధ్రువీకరణ సైతం లభించింది. కాగా, ఈ మార్గాన్ని పాతనగరంలోని ఫలక్‌నుమా వరకు పొడిగించాలని తొలుత నిర్ణయించారు. అయితే, సుల్తాన్‌బజార్‌లో ఆస్తుల సేకరణ, అలైన్మెంట్ చిక్కులతో ప్రాజెక్టు ఆలస్యమైంది. ఆస్తులు కోల్పోయిన బాధితులకు మెరుగైన పరిహారం అందించడంతో పాటు వాణిజ్య కాంప్లెక్స్‌లో వారి వ్యాపార సముదాయాలకు చోటుకల్పించడంతో ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఈ కారిడార్‌ను పాతనగరం వరకు విస్తరించే ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి.

### 3వ కారిడార్ స్వరూపం

**11** కి.మీ.
జేబీఎస్-ఎంజీబీఎస్ మార్గం నిడివి

**9**
ఈ రూట్లో గల స్టేషన్లు

**18** ని॥
ప్రయాణ సమయం

**1,00,000**
రోజువారీ ప్రయాణికుల సంఖ్య (అంచనా)

### వివిధ నగరాల్లో మెట్రో ప్రాజెక్టు మార్గాలు (కి.మీ.లలో)

| నగరం | ప్రస్తుతం | నిర్మాణంలో.. | భవిష్యత్‌లో.. |
|---|---|---|---|
| కోల్‌కతా | 27.22 | 113.42 | -- |
| ఢిల్లీ | 218 | 140.00 | 103 |
| బెంగళూరు | 42.30 | 34.37 | 57.07 |
| గుర్‌గావ్ | 11.70 | -- | -- |
| ముంబై | 11.40 | 124.10 | 38.50 |
| చెన్నై | 27.88 | 19.17 | 104.40 |
| జైపూర్ | 9.63 | 2.40 | 23.01 |
| కొచ్చి | 13.20 | 25.60 | 37.20 |
| లక్నో | 8.50 | 33.00 | 140 |
| మొత్తం | 369.83 | 492.06 | 503.18 |

# రాష్ట్రంలో మరో కరోనా అనుమానిత కేసు

హైదరాబాద్: నగరంలోని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో మంగళవారం మరో కరోనా అనుమానిత కేసు నమోదైంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి (37) ఇటీవల చైనా నుంచి వచ్చాడు. సదరు వ్యక్తి గురించి తెలుసుకున్న అక్కడి డీఎంఅండ్‌హెచ్‌ఓ అతడిని పరీక్షల కోసం ఫీవర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు కరోనా అనుమానిత కేసుగా నమోదు చేసుకున్నారు. అతడిని ఐసోలేషన్ వార్డులో చేర్చుకుని అబ్జర్వేషన్‌లో ఉంచారు. ఇప్పటివరకు ఫీవర్ ఆస్పత్రిలో 21 కరోనా అనుమానిత కేసులు నమోదయ్యాయని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. వీరి నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించగా 15 మందికి నెగెటివ్ రిపోర్టు వచ్చిందని పేర్కొన్నారు. నలుగురికి స్వైన్‌ఫ్లూ అని తేలిందని, మరో ఇద్దరి రిపోర్టులు రావాల్సి ఉందని చెప్పారు.

### ఓపీ నుంచే వెళ్లిపోయిన ఓ యువకుడు..

ఇటీవల చైనా నుంచి వచ్చిన వరంగల్‌కు చెందిన ఓ మెడికల్ విద్యార్థి నిర్ధారణ పరీక్షల కోసం మంగళవారం ఫీవర్ ఆసుపత్రి ఓపీకి వచ్చాడు. చికిత్సల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్న అతను ఎవరికీ చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. చైనా నుంచి వచ్చిన వారు పూర్తి స్థాయి కరోనా నిర్ధారణ పరీక్షల కోసం కనీసం రెండు నుంచి మూడు వారాలైనా వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కరోనా అనుమానితుల రిపోర్టులు నెగెటివ్ వచ్చినప్పటికీ రెండు వారాల పాటు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలోనే ఉండి, మరోసారి శాంపిల్ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. కరోనా వ్యాధి ఒకటి రెండు రోజుల్లో నిర్ధారణ అయ్యేది కాదని.. మూడు వారాల తరువాత కూడా బయటపడవచ్చని అంటున్నారు.

# శ్రీవైష్ణవి ఆస్పత్రి ఎండీ ఆత్మహత్య

- బిల్డింగ్ ఖాళీ చేయాలని యజమాని, మరికొందరి వేధింపులు
- మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన అజయ్‌కుమార్
- తమ కుమారుడిది హత్యే అంటున్న తల్లిదండ్రులు



అజయ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

హైదరాబాద్: భవనం ఖాళీ చేయాలని యజమానితోపాటు మరికొందరు వేధించడంతో మనస్తాపం చెందిన ఓ ఆస్పత్రి ఎండీ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా శాఖాపూర్(వై) గ్రామానికి చెందిన అజయ్‌కుమార్(38).. భార్య శ్వేత, కుమారులు వర్షత్, హర్షిత్‌తో కలసి బీఎన్ రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నారు. కొన్నేళ్ల క్రితం సాగర్ రింగ్ రోడ్డు సరస్వతి నగర్ కాలనీలో ఉండే కరుణరెడ్డితో పరిచయం ఏర్పడింది. కరుణరెడ్డి అక్కడ ఓ బిల్డింగ్ నిర్మాణం చేసే క్రమంలో తాను అందులో ఆస్పత్రిని ఏర్పాటు చేస్తానని అజయ్ చెప్పారు. ముందుగా రూ.10 లక్షలిస్తే బిల్డింగ్ పూర్తి చేసి ఇస్తానని కరుణరెడ్డి హామీ ఇచ్చారు. దీంతో అజయ్‌కుమార్ అతనికి రూ.10 లక్షలు అడ్వాన్స్ ఇచ్చారు. అయినా నిర్మాణం పూర్తి చేయకపోవడంతో అజయ్‌కుమార్ మరికొంత డబ్బుతో పూర్తి చేసి శ్రీవైష్ణవి హాస్పిటల్‌ను ఏర్పాటు చేసుకున్నారు.. తను మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉంటూ డాక్టర్లతో ఆస్పత్రిని నడిపిస్తున్నారు. కొంత కాలంగా ఆస్పత్రి సరిగా నడవపోవడంతో కరుణరెడ్డికి చెల్లించాల్సిన అద్దె ఆలస్యమయ్యింది. దీంతో ఆయన బిల్డింగ్ ఖాళీ చేయాలని అజయ్‌కుమార్‌కు చెప్పారు. తనకు కొంత సమయం ఇవ్వాలని కోరినా కరుణరెడ్డి నిరాకరించి కోర్టులో కేసు వేయడంతో పాటు వెకెంట్ ఆర్డర్ తీసుకొచ్చారు. దీంతో అజయ్‌కుమార్ ఆస్పత్రిని కొన్ని రోజులు మూసేశారు.

### తాడుతో ఉరి వేసుకుని...

మూడు రోజుల క్రితమే మళ్లీ ప్రారంభించారు. బిల్డింగ్ ఖాళీ చేయాలని కరుణరెడ్డి, అతని బావమరిది కొండల్‌రెడ్డితో పాటు మరికొందరు అజయ్‌కుమార్‌పై ఒత్తిడి తెచ్చారు. వారి వేధింపులు ఎక్కువ కావడంతో అజయ్‌కుమార్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. సోమవారం రాత్రి 2 గంటల వరకు ఆస్పత్రిలో ఉన్న అజయ్‌కుమార్ సెల్లార్‌లో ఉన్న తన గదికి వెళ్లి తాడుతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంగళవారం ఉదయం ఆస్పత్రిలో పనిచేసే స్వామి వచ్చి పిలిచినా తలుపు తీయకపోవడంతో కిటికీ తెరిచి చూసి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అజయ్‌కుమార్ రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. సూసైట్ నోట్‌లో తన చావుకు కరుణరెడ్డి, కొండల్‌రెడ్డి, తుర్కయంజాల్‌కు చెందిన మాజీ సర్పంచ్ కొత్తకురుమ్మ శివకుమార్, సరస్వతినగర్ కాలనీ అధ్యక్షుడు మెగారెడ్డి, యాదగిరిరెడ్డి, శివారెడ్డితో పాటు ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ రమేష్‌లే కారణమంటూ రాశారు. పిల్లలను మంచిగా చూసుకోవాలని మీ నుంచి దూరమైతున్నందుకు క్షమించాలని భార్యకు అజయ్ లేఖ రాశారు. కాగా, తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడేంత పిరికివాడు కాదని, ఇది హత్యేనని అజయ్‌కుమార్ తల్లిదండ్రులు కర్నాల అరుణమ్మ, శ్యామ్ పేర్కొంటున్నారు.

# అదనపు టీఎంసీ పనులకు శ్రీకారం!

- కాళేశ్వరంలో ఎల్లంపల్లి దిగువన మిడ్‌మానేరు పనులకు త్వరలో టెండర్లు
- రూ.11,800 కోట్ల పనులకు టెండర్లు పిలిచే ప్రక్రియ వేగిరం..
- మిడ్‌మానేరు దిగువన రూ.14 వేల కోట్ల పనుల టెండర్లకు అంతా రెడీ
- వచ్చే నెలలో పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: బహుళార్థక సాధక ప్రాజెక్టు కాళేశ్వరంలో అదనంగా మరో టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ పనుల వేగిరానికి శ్రీకారం చుడుతోంది. మేడిగడ్డ నుంచి రోజుకు 2 టీఎంసీల గోదావరి నీటిని ఎత్తిపోసేలా పనులు కొనసాగిస్తున్న ప్రభుత్వం, ఇప్పటికే మూడో టీఎంసీ నీటిని తీసుకునేలా పంప్‌హౌస్‌ల నిర్మాణం కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఎల్లంపల్లి దిగువన మిడ్‌మానేరు వరకు ఉన్న పనులు జరుగుతున్నాయి. మిడ్‌మానేరు నుంచి మల్లన్నసాగర్ వరకు మొత్తంగా రూ.25 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టే కసరత్తులు చేస్తోంది.

### వచ్చే నెలలో సీఎం శంకుస్థాపన..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరు వరకు 2 టీఎంసీ, దిగువన ఒక టీఎంసీ నీటిని తీసుకునేలా పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం అదనంగా మరో టీఎంసీని తీసుకుంటూ మిడ్‌మానేరు వరకు 3 టీఎంసీలు, దిగువన 2 టీఎంసీల నీటిని తీసుకునేలా పనులు చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అదనపు టీఎంసీ నీటిని తరలించేందుకు మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు ఇప్పటికే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంప్‌హౌస్‌లలో ఉన్న 28 పంపులకు అదనంగా మరో 15 పంపుల ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఈ ప్రక్రియ ఊపందుకున్న నేపథ్యంలో ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు వరకు పనులను త్వరగా చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. దీంతో నీటి పారుదల శాఖ ఎల్లంపల్లి నుంచి రెండు పంప్‌హౌస్‌లను నిర్మించి, దేవికొండ రిజర్వాయర్ ద్వారా వరద కాల్వ నుంచి నీటిని మిడ్‌మానేరు తరలించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 3 టీఎంసీల మేర నీటిని తరలించేలా వరద కాల్వను మరింత వెడల్పు చేయాలని నిర్ణయించి ఈ ప్రక్రియకు మొత్తంగా రూ.11,800 కోట్లు అవుతుందని లెక్కించారు. ఈ పనులను 4 లేక 6 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇక మిడ్‌మానేరు దిగువన మల్లన్నసాగర్ వరకు పైప్‌లైన్ వ్యవస్థ ద్వారా నీటిని తరలించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ నీటి తరలింపునకు 3 స్థాయిల్లో లిఫ్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనిలో మిడ్‌మానేరు నుంచి అనంతగిరి రిజర్వాయర్ వరకు పైప్‌లైన్ వ్యవస్థ నిర్మాణానికి రూ.4,142 కోట్లు, అనంతగిరి నుంచి మల్లన్నసాగర్ వరకు పైప్‌లైన్ నిర్మాణానికి రూ.10,260 కోట్లు కలిపి మొత్తంగా రూ.14,362 కోట్ల మేర వ్యయం కానుంది. ఈ పనులను సైతం 6 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచే యోచనలో నీటి పారుదల శాఖ ఉంది. మొత్తంగా రూ.25 వేల కోట్ల పనులకు ఈ నెలలోనే టెండర్ల ప్రక్రియ ముగించేలా కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెలలో ఈ పనులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసే అవకాశముంది. ఇటీవల మున్సిపల్ ఎన్నికల అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ.. త్వరలోనే అదనపు టీఎంసీ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే.

# కొత్త జిల్లాల్లో టెన్త్ స్పాట్ వ్యాల్యుయేషన్ లేనట్టే!

సాక్షి, హైదరాబాద్: మార్చి 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వ్యాల్యుయేషన్) ఈసారి కూడా కొత్త జిల్లాల్లో నిర్వహించే అవకాశం లేదు. జవాబు పత్రాల వ్యాల్యుయేషన్ చేసేందుకు కనీసంగా రెండేళ్ల అనుభవం కలిగిన స్కూల్ అసిస్టెంట్లు కొత్త జిల్లాల్లో లేకపోవడంతో పాత జిల్లా కేంద్రాల్లోనే స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. కొత్త జిల్లాల్లోనూ స్కూల్ అసిస్టెంట్లు ఎంత మంది ఉన్నారు? అందులో ఏయే సబ్జెక్టు వారు ఎంత మంది? అన్న వివరాలను ప్రభుత్వ పరీక్షల విభాగం సేకరిస్తోంది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు అనుభవం కలిగిన సబ్జెక్టు టీచర్లు కొత్త జిల్లాల్లో సరిపడా లేకపోవడంతో పాత జిల్లాల్లోనే వ్యాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం భావిస్తోంది. ఎక్కడైనా టీచర్లు సరిపడా ఉన్నట్లు తేలితే ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని యోచిస్తోంది. మొత్తానికి స్పాట్ వ్యాల్యుయేషన్ వచ్చే నెల చివరి వారంలో ప్రారంభం కానుంది.










Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.